
శనివారం 17-3-2018



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 355
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దేవుడు శాసించాడు -ఫ్యామిలీలో



సెమీస్‌లో సింధు
ఆల్ ఇంగ్లండ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఒకుహారాపై విజయం –స్పోర్ట్స్‌లో

హస్తినలో హోదాగ్ని

అవిశ్వాస తీర్మానంతో ఢిల్లీని వేడెక్కించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

- తీర్మానం నోటీసుతో ప్రత్యేకహోదాపై సర్వత్రా చర్చ
- వైఎస్సార్సీపీ పోరుకు అండగా నిలిచిన పలు పార్టీలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్డీఏని వీడిన టీడీపీ
- తీర్మానానికి మద్దతిస్తామన్న ప్రకటనపై యూటర్న్
- అవిశ్వాసంపై విడిగా స్పీకర్‌కు నోటీసులు
- లోక్‌సభలో గందరగోళంతో నోటీసులు తీసుకోని స్పీకర్
- అవిశ్వాస తీర్మానానికి మళ్లీ వైఎస్సార్సీపీ నోటీసు
- సోమవారంనాటి బిజినెస్ లిస్ట్‌లో చేర్చాలని వినతి
- పార్లమెంటు ఆవరణలో వైఎస్సార్ సీపీ ధర్నా



ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో శుక్రవారం పార్లమెంటు వెలుపల నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా సెగ దేశ రాజధాని ఢిల్లీని తాకింది. హోదా కోసం నాలుగేళ్లుగా ఒంటరిగా పోరాడిన వైఎస్సార్ సీపీ కేంద్ర ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానం దేశ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించింది. అవిశ్వాస తీర్మానాన్ని మార్చి 21న పెట్టాలనుకున్నా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనూహ్యంగా దానిని ఐదు రోజులు ముందుకు జరపాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ పోరుకు దేశవ్యాప్తంగా పలు పార్టీలు అండగా నిలిచాయి. అవిశ్వాసానికి నోటీసు ఇవ్వడం, మద్దతివ్వాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాయడం, ఆయా పార్టీల నాయకులను వైఎస్సార్సీపీ ఎంపీలు కలుసుకుని మద్దతు కోరడం గురువారం నాడు సంచలనం సృష్టించింది. వైఎస్సార్సీపీ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సమాజ్‌వాదీ, ఎంఐఎం తదితర పార్టీలు మద్దతుగా ముందుకొచ్చాయి. కాగా గురువారం నుంచి చోటుచేసుకుంటున్న పరిణామాలు తెలుగుదేశం పార్టీలో ప్రకంపనలు సృష్టించాయి. అది దిగిరాక తప్పని స్థితి కల్పించాయి. గత్యంతరం లేక అధికార ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగుతున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. గురువారం నాడు వైఎస్సార్సీపీ అవిశ్వాసానికి మద్దతిస్తామని ప్రకటించినా శుక్రవారం నాటికి మాటమార్చి తామే సొంతంగా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్టు ప్రకటించింది. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వీలుగా శుక్రవారం నాటి బిజినెస్‌లో తీర్మానాన్ని చేర్చాలని ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం ఉదయం నోటీసులు ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ సభ్యుడు తోట నరసింహం ఇచ్చిన నోటీసులు అందాయని చెప్పిన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్.. సభ సజావుగా లేనందున తీర్మానాన్ని తీసుకోవడం లేదని ప్రకటిం చారు. అవిశ్వాసానికి అనుకూలంగా ఇప్పటికే పలు పార్టీల మద్దతును వైఎస్సార్‌సీపీ కూడగట్టడంతో సభలో విపక్షాలన్నీ బాసటగా నిలిచాయి. దాదాపు 100 మంది సభ్యులు నిలుచున్నప్పటికీ గందరగోళ పరిస్థితుల్లో లెక్కించలేనని సభాపతి ప్రకటించారు. కాగా, అవిశ్వాస తీర్మానానికి గురువారం వైఎస్సార్ సీపీ నోటీసు ఇచ్చినప్పటి నుంచి జాతీయ మీడియాలో కూడా మిగతా 7వ పేజీలో ▶

ఉద్యమవాణిని వినిపించిన వైఎస్సార్‌సీపీ...

ప్రత్యేక హోదా ఉద్యమ గళాలను దేశవ్యాప్తంగా వినిపించడంలో, వివిధ పార్టీల మద్దతు కూడగట్టడానికి వైఎస్సార్‌సీపీ ఎంపీలు నిరంతరం కృషి చేశారు. అన్ని పార్టీలతో చర్చించి మద్దతు కూడగట్ట గలిగారు. నలుగురు ఎంపీలు పార్టీ నుంచి ఫిరాయించినా మిగిలిన ఐదుగురు సభ్యులు ఉద్యమవాణిని పార్లమెంటులో గట్టిగా వినిపించారు. విభజన హామీలు అమలుకాని పక్షంలో ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కూడా అన్ని పార్టీలకు లేఖ రాశారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై తెలుగు విద్యార్థుల అభిప్రాయం




ట్రెండ్.. మారుతోంది!

- రెండు దశాబ్దాల క్రితం వరకూ బ్రిటన్, అమెరికాలే టార్గెట్
- ఆ దేశాల్లో వలస విధానాల్లో మార్పులతో మారిన వైఖరి
- ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, మలేసియాలకు ప్రాధాన్యత
- ఉన్నత విద్య తర్వాత ఉద్యోగావకాశాలు మెండుగా ఉండటం వల్లే..
- సులభంగా శాశ్వత నివాస హోదా లభించడమూ ఓ కారణమే

సాక్షి, హైదరాబాద్

విదేశాల్లో ఉద్యోగం.. ఎంతో మంది భారతీయ విద్యార్థులు, మరీ ముఖ్యంగా తెలుగు విద్యార్థుల కల. దీని కోసం పాశ్చాత్య దేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉద్యోగావకాశాలు, అక్కడి ప్రభుత్వ విధానాలను బట్టే ఏ దేశంలో ఉన్నత విద్యను అభ్యసించాలనే దానిపై నిర్ణయం తీసుకుంటున్నారు. గడచిన నాలుగు దశాబ్దాలుగా ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్న వారి వివరాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. 1980–2000 దాకా దాదాపు రెండు దశాబ్దాలపాటు బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్)లో ఉన్నత విద్య చదివేందుకు వెళ్లిన తెలుగు విద్యార్థులు భారీ సంఖ్యలో అక్కడ స్థిరపడ్డారు. 1980–90 దశకంలో ఆర్థిక వనరులున్న కుటుంబాలు తక్కువ కావడంతో ఇంగ్లండ్‌లో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళ్లినవారి సంఖ్య తక్కువే. 1990–2000 దశకం వచ్చేసరికి అక్కడకు క్యూ కట్టిన వారి సంఖ్య భారీగా ఉండటంతో బ్రిటన్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో విదేశీయులకు అవకాశం లేకుండా కట్టడి చేయడం మొదలుపెట్టింది. దాంతో మనవాళ్ల దృష్టి అమెరికాపై పడింది. దాదాపు 15 ఏళ్ల పాటు లక్షల సంఖ్యలో తెలుగు విద్యార్థులు అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. దీంతో అక్కడ వర్ణవివక్ష మొదలైంది. 'బయ్ అమెరికన్–హైర్ అమెరికన్' నినాదంతో ట్రంప్ అధికారంలోకి రావడంతో తెలుగు విద్యార్థుల దృష్టి ఇతర దేశాలపై పడింది. దీంతో ఆస్ట్రేలియా, కెనడా, మలేసియా వంటి దేశాలకు వారు తరలి వెళుతున్నారు. విదేశీ విద్యకు సంబంధించి మిగతా 6వ పేజీలో ▶



రేపటి ఫన్‌డే ప్రత్యేకం
ములుగు రామలింగేశ్వర వరప్రసాదు సిద్ధాంతి
శ్రీ విళంబి నామ సంవత్సర
ఉగాది పంచాంగం

ప్రజల ఆత్మగౌరవమే రైజింగ్ ఇండియా

- వారి మద్దతుతోనే ధైర్యంగా నిర్ణయాలు
- స్వచ్ఛ భారత్, డిజిటల్ లావాదేవీల్లో వీరి భాగస్వామ్యాన్ని మరువలేం
- న్యూస్ 18 సదస్సులో ప్రధాని మోదీ
- విద్య, వైద్య, విద్యుత్, ఆర్థిక, అంతర్జాతీయ అంశాలు, యాక్ట్ ఈస్ట్ తదితర అంశాలపై ప్రసంగం

8 లో



తీర్మానాలకు తుదిరూపు

- ప్లీనరీలో నేడు కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం

కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. వచ్చే ఐదు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణకు పార్టీ సీనియర్ నేతలు తొలిరోజు తుది రూపునిచ్చారు. -వివరాలు 8లో

మంచినీటికి కటకటే!

- కృష్ణా ప్రాజెక్టుల్లో వేగంగా తగ్గిపోతున్న జల మట్టాలు
- మరో వారంలో శ్రీశైలం ఖాళీ అయ్యే అవకాశం
- ప్రస్తుతం రోజుకు 2 టీఎంసీల నీటి వినియోగం
- అటు నాగార్జునసాగర్‌లోనూ ఇదే పరిస్థితి

-వివరాలు 6లో

ఇదండీ సంగతి



అబ్బ! వదిలేయండి సార్! నిజంగానే చూపిస్తే ఛస్తాం

'గేట్' బద్దలుకొట్టాడు!

వరంగల్ ఎన్ఐటీ విద్యార్థికి ప్రథమ ర్యాంకు

- ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించిన సౌరవ్ కుమార్ సింగ్
- గేట్ ఫలితాలు విడుదల చేసిన ఐఐటీ గౌహతి

7
100 లోపు 7 ర్యాంకులు వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులవే..
- వివరాలు 3లో



దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు



- 2003లో జరిగిన 'ఇమిగ్రేషన్ స్కాండల్' కేసులో పంజాబ్ పాప్ సింగర్ దలేర్ మెహందీని కోర్టు దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో ఆయన పాత్ర ఉందని నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 8లో



Happy Ugadi
Pigeon
CONSTA COOL
RECHARGEABLE AIR COOLER
UBER COOL
ALL-IN-ONE SUMMER SOLUTION
పరిచయం చేస్తున్నాం
భారతదేశంలో
మొట్టమొదటి
రీచార్జబల్
కూలర్స్
WORK UP TO 7 HOURS WITHOUT ELECTRICITY
TIMER SAVES ELECTRICTY & WATER
360° SWING FOR COMPLETE COOLING
REMOTE CONTROL
STRONG AIR THROW
EXTREMELY PORTABLE
1 YEAR WARRANTY
STOVEKRAFT
PRESSURE COOKERS | HARD ANODISED COOKWARE | NON-STICK COOKWARE | LPG COOKTOPS AND HOBS | INDUCTION COOKTOPS | CHIMNEYS | MIXER GRINDERS | EMERGENCY LAMPS | SMALL APPLIANCES
www.stovekraft.com/pigeon
Follow Pigeon Kitchen Appliances on
Distributor for Telangana : OM SAKTI ENTERPRISES – 9908200155 | Nalgonda : Kodada – Madhu Electronics -9246170199 | Suryapet : Sri Srinivasa Furniture -9848138344 | Sales Executive : Ravi – 9701817910, Jogi Reddy – 9908200177, Uddand – 96761366833 | For Service Support : 9908200155
Toll Free Service Helpline (Monday to Saturday - 9:00 am to 6:00 pm): 1800 425 66666 | Missed Call: 9740034444 | SMS <TALK> to 9740034444 | Email: customercare@stovekraft.com



happy Ugadi
Gilma
live in tomorrow
మీ జీవన శైలిని
పెంచుకునే
సమయం ఇదే
ప్రత్యేక గిల్మా ఉగాది అందించే ఆఫర్లు ఇక్కడ ఉన్నాయి.
ప్రత్యేకంగా మీకోసం.
Accord 60 Chimney - MRP ₹16,990
Iris Plus 4 Burner Auto - MRP ₹9,790
Combo MRP ₹26,780
OFFER PRICE ₹19,990
Dura 60 Chimney - MRP ₹21,490
Nero 4 Burner Auto - MRP ₹10,790
Combo MRP ₹32,280
OFFER PRICE ₹23,990
Falcon 60 Chimney - MRP ₹21,990
GB 4 - MRP ₹19,340
Combo MRP ₹41,330
OFFER PRICE ₹29,990
Cosmia 90 Chimney - MRP ₹28,990
GB 4 XL - MRP ₹22,490
Combo MRP ₹51,480
OFFER PRICE ₹39,990
Estima 90 Chimney - MRP ₹35,990
GB 4 XL - MRP ₹22,490
Combo MRP ₹58,480
OFFER PRICE ₹46,990
CHIMNEYS | HOBS | LPG COOKTOPS | KITCHEN SINKS | WATER HEATERS | OFFICE CHAIRS
STOVEKRAFT
DOWNLOAD THE GILMA APP ON Play Store
Follow Gilma Lifestyle on
www.stovekraft.com/gilma
Gilma Exclusive Showroom: Miryalguda Sri Maha Laxmi Traders, Near Lic Office, Sagar Road – 9666785633 | For New Franchisee / Chairs Distribution Enquiry Contact – Mr. Sudheer: +91 9392121220.
Service Enquiries (Monday to Saturday 9 am to 6 pm) Toll Free No: 1800 425 66666 | Missed Call: 9740034444 | SMS <TALK> to 9740034444 | Email: customercare@stovekraft.com

కోటా పెంపుపై టీఆర్‌ఎస్ పోరు

పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీల నిరసన

రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్



శుక్రవారం పార్లమెంటు ప్రధాన ద్వారం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న టీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: జనాభా దామాషా ప్రకారం ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్ల కోటా పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఆయా రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ శుక్రవారం పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఆందోళన చేపట్టింది. ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలన్నీ బలాన్ని సమకూర్చగా టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే మాత్రం వెల్‌లో ఉండి తమ పోరాటాన్ని కొనసాగించాయి. 50 శాతానికి మించి రిజర్వేషన్లను పెంచుకునేందుకు రాష్ట్రాలకు అధికారం కట్టబెట్టాలని, ఒక దేశంలో ఒకే విధానం ఉండాలని టీఆర్‌ఎస్ ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. అంతకుముందు పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఎంపీలు కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, కవిత, బి.వినోద్‌కుమార్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పసునూరి దయాకర్ పాల్గొన్నారు. జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'గత రెండు వారాలుగా టీఆర్‌ఎస్ దేశం మొత్తానికి పనికొచ్చే అంశంపై పోరాడుతోంది. ఒక దేశంలో ఒకే విధానం ఉండాలి. తమిళనాడులో రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి వేరే రాష్ట్రాల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో ఎందుకు పెట్టరు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కోట్లాది రూపాయలు వృథాగా పోతున్నందున ఈ పథకాన్ని రైతులతో అనుసంధానం చేయండి. గిట్టుబాటు ధర కోసం రెండు వారాలుగా మేం పట్టుపట్టుతున్నాం. కానీ ప్రభుత్వం స్పందించట్లేదు. ఇది ప్రజావ్యతిరేక ప్రభుత్వం' అని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడటమే తప్పు అన్నట్లు అశోక్‌గజపతి రాజు, వై.ఎస్.చౌదరి గురువారం సభలో మాట్లాడటం నచ్చలేదని వినోద్ కుమార్ అన్నారు. సమస్యలేవైనా ఉంటే వాటిపై మాట్లాడుకోవాలని హితవు పలికారు.

'గేట్' బద్దలుకొట్టాడు!

వరంగల్ ఎన్‌ఐటీ విద్యార్థి సౌరవ్ కుమార్ సింగ్‌కు ప్రథమ ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్‌లో (గేట్) వరంగల్ ఎన్‌ఐటీ విద్యార్థి సౌరవ్ కుమార్ సింగ్.. ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయి ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీలతోపాటు ఇతర విద్యా సంస్థల్లో ఎంఈ/ఎంటెక్/ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన గేట్ ఫలితాలను ఐఐటీ గౌహతి శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జాతీయ స్థాయి ప్రథమ ర్యాంకు సహా 100 లోపు ఏడు ర్యాంకులను వరంగల్ ఎన్‌ఐటీ విద్యార్థులే కైవసం చేసుకున్నట్లు ఎన్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు వెల్లడించారు. గత నెల 3, 4, 10, 11 తేదీల్లో 23 సబ్జెక్టుల్లో గేట్‌ను ఐఐటీ గౌహతి నిర్వహించింది. ఇందులో ఎన్‌ఐటీ విద్యార్థులే కాకుండా ఇతర విద్యార్థుల్లోనూ ఎక్కువ మంది ర్యాంకులను సాధించినట్లు తెలిసింది. ఒక్కసారి సాధించిన గేట్ స్కోర్‌కు మూడేళ్ల వరకు వ్యాలిడిటీ ఉంటుంది. ఆ మూడేళ్లలోగా ఎప్పుడైనా ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి గేట్ ర్యాంకు ఉపయోగపడుతుంది.

టాప్ ర్యాంకులు సాధించిన ఎన్‌ఐటీ విద్యార్థులు వీరే..

ర్యాంకు	విద్యార్థి
1	సౌరవ్ కుమార్ సింగ్
12	చంద్రశేఖర్ తివారీ
15	పలిక చరిత
17	కులదీప్ జైన్
33	రాజేంద్ర ముళ్లపూడి
44	అర్పిత బిస్వాస్
47	వంశీకృష్ణారెడ్డి
197	శివరాం బత్తిని

ఉద్యోగాలకూ 'గేట్' దాటాల్సిందే!

గేట్ స్కోర్ ఉన్న వారికి ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఇస్తుండటంతో ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఇటీవల పెరిగింది. ఎన్‌టీపీసీ, గెయిల్, ఐవోసీఎల్, హెచ్‌పీఎల్, బీహెచ్‌ఈఎల్ తదితర సంస్థలు గేట్‌లో అర్హత సాధించిన వారికే ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈసారి తెలంగాణ రాష్ట్రం నుంచి గేట్‌కు దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు అంచనా.

● ధార్మిక సంస్థ టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలు వినియోగించుకునే భక్తులకు సర్వీస్ చార్జీలు తగ్గాయి. భక్తుల నుంచి సూచనలు, ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో సంప్రదింపులు జరిపిన టీటీడీ ఈవో.. క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేస్తున్న భక్తులకు సర్వీస్ చార్జీని 1.5 శాతం నుంచి 0.5 శాతానికి తగ్గించారు. ఆర్జితసేవలు, వసతి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, ఈ-హుండీ, ఈ-డొనేషన్ తదితర సేవలకు తగ్గించిన చార్జీలు వర్తిస్తాయి.

సమితులకే రైతు బీమా బాధ్యత

- వ్యవసాయ శాఖ నిర్ణయం
- మార్గదర్శకాలపై కసరత్తు మొదలు
- 60–70 ఏళ్లు దాటిన రైతులకూ వ్యక్తిగత బీమా

సాక్షి, హైదరాబాద్: సమన్వయ సమితులకే రైతు వ్యక్తిగత బీమా నిర్వహణ బాధ్యత అప్పగించాలని వ్యవసాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో గ్రామ రైతు సమన్వయ సమితులే ముఖ్యపాత్ర పోషిస్తాయి. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితులు పర్యవేక్షిస్తాయి. రైతు వ్యక్తిగత బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందుకు 2018–19 బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించింది. ఈ పథకం ద్వారా రైతు ఏ కారణంతో చనిపోయినా ఆ కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందనుంది. పథకం మార్గదర్శకాలు ఖరారు చేయడంలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. జూన్ ఒకటి నుంచి రైతు బీమా పథకం అమల్లోకి రానుంది. ప్రభుత్వమే రైతుల తరఫున బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తుంది.

వార్డుల వారీగా బాధ్యత అప్పగింత

గ్రామానికి 15 మంది చొప్పున రైతు సమితి సభ్యులున్నారు. వారికి వార్డుల వారీగా బాధ్యలిస్తారు. సభ్యులే రైతుల వద్దకు వెళ్లి బీమా దరఖాస్తు అందించి.. నింపి సంతకం చేశాక తిరిగి తీసుకుంటారు. అనంతరం అవి మండల జిల్లా సమన్వయ సమితుల నుంచి రాష్ట్ర రైతు సమన్వయ సమితికి చేరుతాయి. దరఖాస్తులను వ్యవసాయశాఖలోని బీమా విభాగంతో కలసి క్రోడీకరించాక బీమా కంపెనీలకు పంపుతారు. ఈ ప్రక్రియకు నెల రోజుల సమయం పట్టే అవకాశముంది.

60–70 ఏళ్లు దాటినా బీమా

కేంద్రం నిబంధనల ప్రకారం ప్రస్తుతం 55 ఏళ్ల వరకే బీమా వర్తిస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే 60–70 ఏళ్లు దాటిన రైతులకూ వర్తింపజేసేలా బీమా కంపెనీలతో ఆ శాఖ చర్చలు జరుపుతోంది. 55 ఏళ్లకే పరిమితం చేస్తే అందరికీ పరిహారం అందదని ఈ నిర్ణయం తీసుకున్నారు. వయస్సు పెరిగిన కొద్దీ ప్రీమియం రేటూ పెరుగుతుంది. కాబట్టి ఏ వయస్సు నుంచి ఏ వయస్సుకు ప్రీమియం రేటుండాలో బీమా కంపెనీలతో వ్యవసాయ శాఖ చర్చిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత లెక్కల ప్రకారం 72 లక్షల మంది రైతులున్నట్లు అంచనా. వారిలో వయస్సు వారీగా లెక్కలు తీస్తున్నారు. ప్రీమియానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి నిర్ణయం తీసుకుంటారు. రూ.5 లక్షల బీమాకు ఒక్కో రైతు కోసం రూ.1,100 ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. ఏటా సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలి. రైతులకు చెల్లించే బీమా పరిహారంలో రూ.2 లక్షలు కేంద్రం, రూ.3 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. అయితే కేంద్రం 55 ఏళ్ల వారికే బీమా పరిహారపు సొమ్ము ఇస్తున్నందున ఆ వయస్సుకు మించిన వారికి వాటను రాష్ట్రమే భరించనుంది.

త్వరలో 'తెలంగాణ భాషా బిల్లు'

తమిళనాడు వెళ్లి అధ్యయనం చేసొచ్చిన బృందం

ముసాయిదా బిల్లు తయారీలో అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం తెలుగు భాష పరిరక్షణకు నడుం బిగించింది. ఇటీవల హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకటి నుంచి 12 తరగతుల వరకు తెలుగు తప్పనిసరిగా ఉండాల్సిందేనని, అందుకు పక్కనున్న తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి నేతృత్వంలో బృందం ఇటీవల తమిళనాడు వెళ్లొచ్చింది. ఈ బృందం తమిళనాడులో ఆరు పాఠశాలలను సందర్శించింది. ఇద్దరు మంత్రులను కలసింది. ఈ సందర్భంగా పలు అంశాలను అధ్యయనం చేసింది.

ముసాయిదా బిల్లు తయారు...

తమిళనాడుకు వెళ్లొచ్చిన బృందం సభ్యులు విద్యా భాషగా తమిళం ఎలా ఉందో.. తెలంగాణలో తెలుగు అంతకన్నా మెరుగ్గా ఉంచేందుకు ఒక నోట్‌ను తయారు చేసి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యకి ఇచ్చారు. ఆయన దాన్ని ముసాయిదా బిల్లు రూపంలో సిద్ధం చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి చేసుకొన్న తర్వాత దాన్ని కేబినెట్ ముందు ఉంచనున్నారు. కేబినెట్ దీన్ని ఆమోదించిన తర్వాత దీనికి 'తెలంగాణ భాషా బిల్లు'గా నామకరణం చేసి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. ఆ తర్వాత కఠినతరమైన జీవో రానుంది. ఇది 1 నుంచి 12 వ తరగతుల వరకు నిర్వహించే పాఠశాలల ముంగిటకు చేరుతుంది. కాగా, తెలంగాణ భాషా బిల్లును వచ్చే జూన్ నాటికి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొస్తుందని తమిళనాడు భాషా అధ్యయనానికి వెళ్లొచ్చిన బృందం సభ్యులు పేర్కొన్నారు.

సాక్షి
శనివారం, మార్చి, 17

చిచ్చురేపిన గూఢచర్యం

దేశాల మధ్య ఉండే సంబంధాలు చిత్రమైనవి. పరస్పరం కత్తులు నూరుకునే దేశాలు మాత్రమే కాదు... స్నేహంగా ఉంటున్న దేశాలు సైతం అవతలి పక్షం తీరుతెన్నుల గురించి ఆరా తీసేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. అయిదేళ్ల క్రితం సీఐఏ మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ స్నోడెన్ అమెరికా దశాబ్దాలుగా శత్రు దేశాలపైన మాత్రమే కాదు... సన్నిహిత దేశాలపై కూడా ఎలా నిఘా పెట్టిందో బట్టబయలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు బ్రిటన్–రష్యాల మధ్య కొనసాగుతున్న పంచాయతీ అలాంటి గూఢచార కార్యకలాపాల పర్యవసానమే. రష్యా సైనిక ఇంటెలిజెన్స్ కల్నల్‌గా పనిచేసిన సెర్గీ స్క్రిపాల్, ఆయన కుమార్తె యులియా స్క్రిపాల్ బ్రిటన్‌లోని శాలిస్‌బరీ పట్టణంలో ఒక షాపింగ్ మాల్ వద్ద ఈ నెల 4న అపస్మారకస్థితిలో పడి ఆసుపత్రిపాలైన ఉదంతం బ్రిటన్, రష్యాలమధ్య చిచ్చు రేపింది. వీరిద్దరిపైనా విష రసాయన ప్రయోగం జరిగిందన్నది ఆరోపణ. పర్యవసానంగా రష్యా రాయబార కార్యాలయంలో పనిచేస్తున్న 23మంది దౌత్యాధికారులు తక్షణం దేశం విడిచి వెళ్లాలంటూ బ్రిటన్ హుకుం జారీ చేసింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇలా పరస్పరం దౌత్యాధికారులను బహిష్కరించుకున్న చరిత్ర ఉంది. ఆ సంప్రదాయం మళ్లీ మొదలుకావడం ఆందోళన కలిగిస్తుండగా ఈ గొడవలో తాజాగా ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా కూడా తలదూర్చాయి. ఈ ఉదంతంలో రష్యా తక్షణం సంజాయిషీ ఇవ్వాలంటూ డిమాండ్ చేశాయి. ఈ ఉదంతంతో తమకేమాత్రం సంబంధం లేదని రష్యా అంటున్నది.

సెర్గీ స్క్రిపాల్ రష్యా పౌరుడు, ఆ దేశ సైనిక ఇంటెలిజెన్స్‌లో ఉన్నతాధికారిగా పనిచేసినవాడు. వేరే దేశాల్లో నిఘా ఉంచి సమాచారం రాబట్టాల్సిన స్క్రిపాల్ యూరప్‌లో తమ దేశం తరఫున పనిచేస్తున్న గూఢచారులు, వారి చిరునామాలు, వారి మారుపేర్లు వగైరాలను పదేళ్లపాటు బ్రిటన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ సంస్థ ఎంఐ6కు అందజేశాడు. 2003లో పట్టుబడ్డాడు. ఈ కేసు పర్యవసానంగా అతని ఉద్యోగం పోవడంతోపాటు దేశద్రోహ నేరంకింద జైలు శిక్ష కూడా పడింది. 2010లో బ్రిటన్, రష్యాల మధ్య గూఢచారుల మార్పిడి ఒప్పందం కింద స్క్రిపాల్ విడుదలై బ్రిటన్ వెళ్లిపోయాడు. సాధారణంగా అయితే అక్కడితో ఆ వ్యవహారం ముగిసి పోవాలి. కానీ రష్యాకు అలాంటి చరిత్ర లేదు. అది గతంలో సైతం ఇలా డబుల్ ఏజెంట్లుగా పని చేసిన 'ద్రోహుల్ని' వదల్లేదు. రష్యా గూఢచార సంస్థ కేజీబీలో పనిచేస్తూ అనంతర కాలంలో పుతిన్ ప్రభుత్వానికి వ్యతిరేకిగా మారి బ్రిటన్‌కు వెళ్లిపోయిన అలెగ్జాండర్ లిత్వినెంకోను ఇదే తరహాలో 2006లో మట్టుబెట్టారు. రష్యా వ్యాపారవేత్త బోరిస్ బెరిజోవిస్కీని చంపడానికి పుతిన్ ప్రభుత్వం ఆదేశించిందని ఆరోపించిన లిత్వినెంకో పుతిన్ ఆగ్రహానికి గురయ్యాడు. లిత్వినెంకోపై గుర్తు తెలియని వ్యక్తులు పోలోనియం–210 అనే అణుధార్మిక పదార్థాన్ని ప్రయోగించారని బ్రిటన్ పోలీసులు నిర్ధారించారు. తమ భూభాగంలో లిత్వినెంకోపై విషప్రయోగం జరిపిన రష్యా పౌరుణ్ణి బ్రిటన్ గుర్తించి అప్పగించమని కోరినా పుతిన్ ప్రభుత్వం అంగీకరించలేదు.

వివిధ దేశాల ప్రధానులు, అధ్యక్షులు విదేశాల్లో పర్యటించడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం, స్నేహసంబంధాలు నెరపడం సర్వసాధారణం. దీనికి సమాంతరంగా ఆ దేశాల్లోని గూఢచారులను నియమించుకుని వారిద్వారా సొంతంగా సమాచారం రాబట్టుకోవడం ఇంచుమించు ప్రతి దేశమూ చేసే పని. మిగిలిన దేశాల మాటలా ఉన్నా అమెరికా ఈ విషయంలో ఆరితేరింది. అది దుర్మార్గ దేశాలుగా పరిగణిస్తున్న ఇరాన్, ఉత్తరకొరియా, సిరియా వంటి దేశాలపై మాత్రమే కాదు... తనకు సన్నిహితంగా మెలగుతున్న బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలపై కూడా గూఢచర్యం సాగించింది. ఎడ్వర్డ్ స్నోడెన్ వీటిని సాక్ష్యాధారాలతో సహా వెల్లడించి అందరినీ నివ్వెరపరిచాడు. అమెరికా నిఘాకు బలైన దేశాల్లో మన దేశం కూడా ఉంది. శత్రు దేశాల సంగతలావుంచి, ఆ దేశాల్లో అంతర్గత పరిస్థితులెలా ఉన్నాయో తెలుసుకోవడంలో వింతేమీ లేదు. శత్రుదేశ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండటం సాధారణం. కానీ మిత్ర దేశాలుగా ఉంటూ పరస్పరం సహకరించుకునే దేశాలు సైతం అవతలి దేశం ఏం చేస్తున్నదో తెలుసుకునే ప్రయత్నం చేస్తాయి. ప్రతి దేశమూ తమ సమస్త సమాచారాన్నీ బట్టబయలు చేసుకోదు. ఎంత మిత్రదేశమైనా చెప్పవలసినదేమిటో, చెప్పకూడనిదేమిటో పరిమితులు విధించుకుంటుంది. తమ సమాచారం బయటికిపొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, అవతలి దేశం గుట్టు లాగడానికి ప్రయత్నిస్తుంటుంది. ఇలా ఎవరికి వారు సాగించే నిఘా కార్యకలాపాలు ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుంటాయి. 1971లో భారత్–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరగడానికి ముందు నాటి ప్రధాని ఇందిరాగాంధీ వ్యూహమేమిటో తమకు కేబినెట్ మంత్రి ద్వారా తెలిసేదని అప్పటి సీఐఏ డైరెక్టర్ రిచర్డ్ హెల్మ్స్ ప్రకటించాడు. 2009లో లండన్‌లో జరిగిన జీ–20 దేశాల సమావేశాలపై అమెరికా నిఘా పెట్టి వివిధ దేశాల ప్రతినిధి బృందాలు తమలో తాము మాట్లాడుకున్న సంభాషణల్ని రికార్డు చేసిందని స్నోడెన్ అయిదేళ్లక్రితం బయటపెట్టాడు. ఏ దేశం ఎలాంటి వ్యూహం అనుసరించబోతున్నదో తెలుసుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవడం అమెరికా చర్యలోని ఆంతర్యం. జీ–20లో ఒకటి రెండు మినహా అన్నీ అమెరికా మిత్ర దేశాలే. పైగా ఆతిథ్యం ఇచ్చిన బ్రిటన్ అత్యంత సన్నిహిత దేశం. అయినా అమెరికా తన పోకడ మానుకోలేదు.

ఇప్పుడు స్క్రిపాల్, అతని కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. వీరిపై ప్రయోగించిన పదార్థం 'నోవిచోక్' అయి ఉండొచ్చునంటున్నారు. ఇది నాడుల పనితీరును నియంత్రించే వ్యవస్థను దెబ్బతీస్తుందని, మనుషుల్ని క్షణాల్లో అశక్తులుగా మారుస్తుందని, ఒకసారి దీని బారిన పడితే కోలుకోవడం అంటూ ఉండదని చెబుతున్నారు. ఆ సంగతలా ఉంచి ఈ ఉదంతం రష్యాకూ, యూరప్ దేశాలకూ మధ్య ఎలాంటి చిచ్చు రేపుతుందో, ఇది ఎటు పోతుందో రాగలరోజుల్లో తెలుస్తుంది. పరస్పర గూఢచర్యం చివరికెలాంటి పరిణామాలకు దారితీస్తుందో తెలియాలంటే స్క్రిపాల్ ఉదంతమే ఉదాహరణ.



అంతర్జాతీయ గూఢచర్యం ఏ స్థాయికి వెళ్లిందంటే ప్రపంచంలో ఎవ్వరైనా ఏ సమయంలో అయినా దాని లక్ష్యాలుగా మారి తీరుతారు.

– ఎడ్వర్డ్ స్నోడెన్
అమెరికన్ మాజీ సీఐఏ ఉద్యోగి

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి అమావాస్య సా.6.17 వరకు, తదుపరి శ్రీవిళంబినామ సంవత్సర చైత్ర, శు.పాడ్యమి, నక్షత్రం పూర్వాభాద్ర రా.7.30 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం తె.5.23 నుంచి 7.00 వరకు, దుర్ముహూర్తం ఉ.6.11 నుంచి 7.44 వరకు, అమృతఘడియలు ఉ.11.04 నుంచి 12.34 వరకు.

సూర్యోదయం	: 6.12	10.30 వరకు	
సూర్యాస్తమయం	: 6.06	యమగండం:	
రాహుకాలం:		ప.1.30 నుంచి	
ఉ.9.00 నుంచి		3.00 వరకు	

నమాజ్ వేళలు

ఫజర్	: 5.11	మగ్రీబ్	: 6.26
జొహర్	: 12.25	ఇషా	: 7.38
అసర్	: 4.45		

రాజకీయాల్లో 'ఆప్' సోపాలు


శేఖర్ గుప్తా

మూడేళ్ల క్రితం తాను అనుభవించిన రాజకీయ అధికారంలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే ఆప్ ఇప్పుడు అనుభవిస్తోంది. ఈరోజు ఢిల్లీలో ఏ ఉప ఎన్నిక నిర్వహించినా ఆ పార్టీయే గెలుస్తుంది. కానీ, సగం ఢిల్లీ రాష్ట్రానికి పరిమితమై మమతా బెనర్జీతో సమానంగా నిలబడటం అనేది కేజ్రీవాల్, అతడి పార్టీ పెట్టుకున్న లక్ష్యం కానేకాదు. వాళ్లు వ్యవస్థను మార్చడానికి వచ్చారు. భారత్‌ను రక్షించడానికి వచ్చారు. ఇప్పుడు అదంతా ముగిసిపోయింది. మళ్లీ వీరు పూర్వ ప్రాభవాన్ని సాధించగలరా?

ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎప్పుడు పుట్టిందీ ఖచ్చితంగా చెప్పడం కష్టమే. ఆప్‌ను స్థాపించింది 2012 ఆగస్ట్ 4న అని చెప్పవచ్చు. ఎందుకంటే, అదే రోజు ఈ పార్టీ స్థాపకులు అవినీతి వ్యతిరేక పోరాటంలో భాగంగా రాజకీయాలు మురికి కూపం అని వర్ణించాక కొత్త పార్టీ పెడుతున్నట్లు వెల్లడించారు. ఇండియా అగెన్స్ట్ కరప్షన్ పేరిట అవినీతి వ్యతిరేక పోరాటం ఉధృతంగా దేశవ్యాప్తంగా సాగిన 2010లో ఆప్ పుట్టుకకు మూలాలు ఉన్నాయని నా పుస్తకంలో రాశాను. ఈ పార్టీకి ప్రధాన చిహ్నంగా, ప్రచారకర్తగా అన్నా హజారే దొరికారు. ఈ అవినీతి వ్యతిరేక ఆర్కెస్ట్రా నిర్వాహకుడు(కండక్టర్)గా అరవింద్ కేజ్రీవాల్ నిలబడ్డారు. ఈ కొత్త రాజకీయశక్తి స్పష్టమైన రూపం సంపాదించలేకపోయింది. దీనికి గట్టి మేనిఫెస్టో గానీ, అజెండా గానీ ఎప్పుడూ లేదు. జన్ లోక్‌పాల్ అనే జనాస్త్రంతో అవినీతి రాక్షసిని అంతమొందించడం ఒక్కటే దాని లక్ష్యంగా కనిపించింది. పార్టీకి సిద్ధాంతమంటూ లేదు. దాని వల్ల దేశం నలుమూలల నుంచీ జనం ఆప్ వేదికపైకి వచ్చి అన్నా హజారే వెలుగులో మురిసిపోవడానికి, మెరిసిపోవడానికి వీలయింది. పత్రికల్లోనే గాక, సామాజిక మాధ్యమాల్లో కూడా వారికి మంచి ప్రచారం లభించింది. ఏ విషయంపైనా బలమైన అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా దేనిపైనా విభేదాలు రాకుండా నివారించడమే పంథాగా ఈ వేదిక మొదలైంది. పూర్తి వ్యతిరేక భావాలున్న ఇద్దరు కాషాయాంబరధారులైన స్వామి అగ్నివేశ్, బాబా రాందేవ్ ఈ వేదికపై ఒకేసారి కనిపించే అవకాశం వచ్చింది. వామ పక్షం వైపు మొగ్గే లాయర్ ప్రశాంత్ భూషణ్, మితవాదిగా ముద్రపడిన కవి కుమార్ విశ్వాస్–ఈ ఇద్దరికీ ఆప్ స్థానం కల్పించింది. ఆప్ తెగింపు, ఆదర్శాలు మీడియాలోని పలువురు యువకులను ఆకట్టుకున్నాయి. జర్నలిస్టులుగా పని చేసిన ఆశిష్ ఖేతాన్, మనీష్ సిసోడియా, అశుతోష్‌లు వారిలో ప్రముఖులు.

సామాజిక కార్యకర్తలకు కేంద్రం!

మేధా పాట్కర్ నుంచి అఖిల్ గోగోయ్, మయాంక్ గాంధీ వరకూ అనేక మంది సామాజిక కార్యకర్తలకు ఇది పెద్ద కేంద్రస్థానంగా మారింది. వివిధ వృత్తుల్లో నిపుణులు(మీరా సన్యాల్), విశ్రాంత సీనియర్ ఉన్నతాధికారులు (పుణెలో అరుణ్ భాటియా), జడ్జీలు(సంతోష్ హెగ్డే) వంటి ప్రముఖులెందరినో ఆప్ ఆకర్షించింది. అలాగే, యోగేంద్ర యాదవ్ వంటి వామపక్షవాదులైన లిబరల్ మేధావులూ ఈ కొత్త రాజకీయపక్షానికి చేరువయ్యారు. ఆప్ అంటే విపరీత స్థాయిలో ప్రజల్లో ఉత్సాహం ఉప్పొంగిన ఆ రోజుల్లో ప్రజా ఉద్యమంగా పుట్టిన ఆప్ ఉద్దేశాలు, పద్ధతులను ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదంటే అతిశయోక్తి కాదు. ఓ మోస్తరుగా ప్రశ్నించిన మాలాంటి వారిని దుర్భాషలాడారు. దుమ్మెత్తిపోశారు. ఈ వేదిక దేని కోసం నిలబడుతోంది? అనేదే మా ప్రధాన ప్రశ్న. అప్పుడు అరవింద్ కేజ్రీవాల్ సొంతగా రాసిన సంక్షిప్త మేనిఫెస్టోను చదవాలని మాకు సలహా ఇచ్చారు. దీన్ని చదవగానే కొన్ని వాస్తవ దూరమైన కథలను ఒక చోట గుచ్చినట్టు (అరవింద్ చిత్ర కథ) అనిపించింది. ఓ సిద్ధాంతం లేకుండా నాలుగు కాలాలు సాగే రాజకీయ మార్గాన్ని నిర్మించలేరనీ, కేవలం అవినీతి వ్యతిరేకంగా పోరాడితే చాలదనేది మా వాదన. దీంతో, రాజకీయాలపై ఆసక్తి లేకుండా ఇలాంటి ప్రశ్న అడిగే ధైర్యం మీకు ఎక్కడిదంటూ మాపై మండిపడ్డారు. మేరా నేతా చోర్ హై(మా నాయకుడు దొంగ) అనేది వారి ప్రధాన నినాదమైతే వారికి రాజకీయ సిద్ధాంతం ఎక్కడుంటుంది? పార్లమెంటును దొంగలు, బందిపోట్ల స్థావరంగా వారు వర్ణించారు. జన్‌లోక్‌పాల్‌లో నోబెల్, మెగసెసే అవార్డుగ్రహీతలు సహా రాజకీయాలతో సంబంధం లేని వారు ఉండాలనీ, సీబీఐ సర్వస్వతంత్ర సంస్థగా పనిచేయాలనేవి వారి నిశ్చితాభిప్రాయాలు. చివరికి, ''వ్యవస్థను మార్చడానికి మరో మార్గం లేదు'' అంటూ వారే ఓ శుభ ముహూర్తాన రాజకీయ నాయకులుగా అవతారమెత్తారు.

జాతిహితం



పొందిక లేని 'యువ' నేతల పార్టీ ఆప్!

సంప్రదాయానికి భిన్నంగా కాస్త చిన్న వయసులో ఓ ప్రజా ఉద్యమాన్ని తెలివిగా, చురుకుగా నడిపిన నాయకులు రాజకీయపక్షంగా రూపాంతరం చెందారు. ముందే ఊహించినట్టే పొందిక, కుదురు లేకపోవడమే ఆప్‌కు ప్రధాన సవాలుగా మారింది. అధికారం అందుకున్నాక వారిని కలిపి ఉంచాల్సిన లక్ష్యం గాలికి కొట్టుకుపోయింది. ఇప్పుడు వారిని నడిపించే లక్ష్యం అవినీతిని తుదముట్టించడం కాదు. సాధ్యమైనంత వరకూ స్వచ్ఛమార్గంలో పాలన అందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలబడటమే వారి ఉద్దేశంగా కనిపించింది. ఇలాంటి ప్రణాళికలు ఎప్పుడూ విజయవంతం కావని అనుభవాలు చెబుతున్నాయి. అత్యంత జనాదరణ కలిగిన అస్సాం విద్యార్థి ఉద్యమం బలమైన రాజకీయ పార్టీగా (అస్సాం గణపరిషత్) నిలబడలేక కుప్ప కూలడమే ఇందుకు మంచి ఉదాహరణ. ఆప్‌లాగే ఈ విద్యార్థి నేతలు 1985లో జరిగిన తమ తొలి ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. విదేశీ పౌరులను బయటికి పంపాలనే లక్ష్యం ఆచరణలోకి రాలేదు. ఈ పార్టీ నేతలు ఎంతో కాలం కలిసి నడవలేకపోయారు. విదేశీయుల వ్యతిరేక ఉద్యమ నేతలు ఎంతోమంది నేడు బీజేపీలో ఉన్నారు. ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్, కీలక మంత్రి హిమంతా బిశ్వశర్మ ఇలాంటి నేతలే. ఏజీపీగా మిగిలిన అతి పెద్ద చీలికవర్గం ప్రస్తుతం బీజేపీ జూనియర్ భాగస్వామిగా సంకీర్ణ సర్కారులో కొనసాగుతోంది. గతంలో ఏజీపీ వామపక్షాలతో కలిసి పాలన సాగించడం విశేషం. లక్ష్యం మాయమైంది. శూన్యాన్ని భర్తీ చేయడానికి సిద్ధాంతం మిగలలేదు. ఎవరి దారి వారిది. ఇవే ఏజీపీ దుస్థితికి కారణాలు.

ఒక్క తేడా మినహాయిస్తే ఆప్ కూడా పైన చెప్పిన పరిస్థితినే ఎదుర్కొంటోంది. ఆప్ స్థాపకుల్లో ప్రముఖులైన ఎందరో నిరాశానిస్పృహలతో పార్టీ నుంచి దూరమయ్యారు. వారిలో ప్రసిద్ధులైన యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ సామ్యవాద సిద్ధాంతాలతో రాజకీయపార్టీ ప్రారంభించారు. మరి కొందరు ఆప్‌పై తమ ఆగ్రహాన్ని భిన్న మార్గాల్లో వ్యక్తంచేస్తున్నారు. కేజ్రీవాల్ అధికార ఉన్మాదంతో నడుస్తున్నారని అన్నాహజారే తరచు విమర్శిస్తున్నారు. మయాంక్ గాంధీ ఇటీవల ఆప్ నేతల పోకడలపై ఆగ్రహం ప్రకటిస్తూ పుస్తకం రాశారు. కేజ్రీవాల్ తన కేబినెట్ నుంచి ఉద్వాసన పలికిన మాజీ మంత్రులు ఆయనకు వ్యతిరేకంగా ట్విటర్‌లో నిప్పులు కక్కుతున్నారు. తాజాగా ఇప్పుడు పంజాబ్‌లో పార్టీ నాయకత్వం కీచులాటల నుంచి సంక్షోభంలోకి పయనిస్తోంది. ఏడాది క్రితం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించి జాతీయ శక్తిగా ఆవిర్భవిస్తుందని అంచనాలు వేశారు. అయితే, ఇక్కడ మనం ప్రజా ఉద్యమాల నుంచి రాజకీయపక్షాలుగా అవతరించిన ఏజీపీ, ఇతర చిన్న పార్టీలకూ, ఆప్‌కూ మధ్య ఉన్న ఒక తేడా గమనించాలి. ఈ పార్టీలకు లేని తిరుగులేని నేత అరవింద్ కేజ్రీవాల్ ఆప్‌కు ఉన్నారు. 2010 నుంచి అంటే గడచిన ఎనిమిదేళ్లుగా అధికార రాజకీయాలను ప్రధాని నరేంద్ర మోదీ తరహాలో ఎలాంటి దయాదాక్షిణ్యాలకు తావులేకుండా నడుపుతున్న నేతగా కేజ్రీవాల్ పేరు తెచ్చుకున్నారు. ఫలితంగా ఆప్ తన లక్ష్యాలను కోల్పోయింది. వ్యక్తిపూజకు నిలయంగా మారింది.

ఈ క్రమంలో ఎలాంటి నిచ్చెన మెట్ల అధికార వ్యవస్థలేని రాజకీయపక్షంగా రూపుదిద్దుకుంది. తన నాయకత్వానికి పోటీ లేదా సవాలు ఎదురైతే–మోదీ మాదిరిగానే కేజ్రీవాల్ కూడా 'మమ్మల్ని ఢీకొనే వారెవరైనా పచ్చడి పచ్చడి కావాల్సిందే' అనే సూత్రాన్ని అమలు చేస్తారు. అయితే, పార్టీ లోపల సవాలు చేసేవారిపై, బయటి ప్రత్యర్థులపై కేజ్రీవాల్ మరో ఎత్తుగడ ప్రయోగిస్తారు. వారిపై అత్యంత తీవ్ర ఆరోపణలు చేయడం, ముఖ్యంగా ఆ వ్యక్తుల నిజాయితీని అనుమానించే రీతిలో అడ్డగోలుగా దాడిచేయడం ఆయనకు ఆనవాయితీ. ఈ అభియోగాల నిరూపణకు సాక్ష్యాధారాలు ఉన్నాయా? లేవా అన్నది ఆయనకు అనవసరం.

దూషణలతో భయపెట్టే ఎత్తుగడలు చెల్లుతాయా?

నిజజీవితంలో ప్రతిదీ దాని నిర్దిష్ట గడువుతేదీతో వస్తుంటుంది. అనాగరికమైన నిందలతో భయపెట్టే ఎత్తుగడ మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొదటిది. తన పరిశుద్ధమైన ప్రతిబింబం ఆ ఆరోపణలకు బలం చేకూర్చుతుంది. రెండు తాను ఏ కోశానా భయం లేని తిరుగుబాటుదారు కాబట్టి తాను చేసే ఈ దాడులు ప్రజల ప్రశంసకు పాత్రమవడమే కాకుండా తను గురిపెట్టిన లక్ష్యాలను నైతికంగా దిగజార్చివేస్తాయి. చివరగా, అతడి బాధితులు న్యాయస్థానానికి వెళ్లినప్పటికీ, న్యాయ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగుతుంటుంది. భారత్‌లో ఉత్తమ విద్యావంతులైన నేతల నేతృత్వంలో ఉన్న అతి తరుణ రాజకీయ పార్టీ కూడా అత్యంత అసభ్యంగా, మొరటుగా వ్యవహరిస్తుందనే ఒక విచారకరమైన రాజకీయ అభాసను అది సృష్టిస్తుంది.


ఈ మూడు కారణాలు కూడా ఇప్పుడు మారిపోయాయి. అధికారంలో కొనసాగుతున్న మూడేళ్ల కాలంలోనే కేజ్రీవాల్ తాను స్వయంగా ఎంపిక చేసుకున్న పార్టీనేతలను.. అవినీతి నుంచి నైతిక పతనం దాకా వివిధ నేరారోపణలతో మంత్రిమండలి నుంచి తొలగించాల్సి వచ్చింది. దీంతో పార్టీ గొప్పగా చెప్పుకున్న పరిశుద్ధత తన మెరుగును కోల్పోయింది. అరుణ్ జైట్లీపై నిందారోపణలకు సంబంధించి న్యాయ ప్రక్రియ వేగవంతం కావడం కేజ్రీవాల్‌ను భయపెట్టింది. తన బాధితులనుంచి తానెదుర్కొంటున్న న్యాయపరమైన సవాళ్లు (30 పైచిలుకు) దృఢమైనవని, తనను కాపాడలేవని కేజ్రీవాల్‌కి తెలుసు. కాబట్టే ఆయన వెంటనే తిరోగమన బాట పట్టారు. 'భయంలేని తిరుగుబాటుదారు' అనే ప్రతిష్టను ఈ వెనుకంజ మసకబార్చేసింది.

మూడేళ్ల క్రితం తాను అనుభవించిన రాజకీయ అధికారంలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే ఆప్ ఇప్పుడు అనుభవిస్తోంది. ఈరోజు ఢిల్లీలో ఏ ఉప ఎన్నిక నిర్వహించినా ఆ పార్టీయే గెలుస్తుంది. కానీ, సగం ఢిల్లీ రాష్ట్రానికి పరిమితమై మమతా బెనర్జీతో సమానంగా నిలబడటం అనేది కేజ్రీవాల్, అతడి పార్టీ పెట్టుకున్న లక్ష్యం కానేకాదు. వాళ్లు వ్యవస్థను మార్చడానికి వచ్చారు. భారత్‌ను రక్షించడానికి వచ్చారు. ఇప్పుడు అదంతా ముగిసిపోయింది. మళ్లీ వీరు పూర్వ ప్రాభవాన్ని సాధించగలరా? రాజకీయాల్లో ఇది జరగదని మీరు ఎన్నటికీ చెప్పలేరు. ఏఏపీ మళ్లీ పునరుత్థానం చెందడాన్ని మనం చూడవచ్చు కానీ అదేరకమైన దూషణ రాజకీయాలతో మాత్రం కాదు.

వ్యాసకర్త దప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

కుట్ర కాదు వ్యూహం

'ఇది తెలుగుదేశంపై కుట్ర. దీని వెనక పెద్దలున్నారు' అని బాబు అంటున్నారు. కుట్ర అనుకుంటే కుట్ర, వ్యూహం అనుకుంటే వ్యూహం. చదరంగంలో చెక్ అన్నా, ఆటకట్టు అన్నా, షా అన్నా ఒక్కటే. పెద్దల్లో అగ్రనేత షా లేరు కదా?


శ్రీరమణ

అక్షర తూణీరం



ఈ ఉగాది చంద్రబాబుని పూర్తిగా ఇరుకున పడేసేట్టు కనిపిస్తోంది. మొన్న సంక్రాంతి నాడు సూర్యుని ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తించి గౌరవించారు. శివరాత్రి నాడు జటాజూటంలోని గంగని ఏపీ ప్రభుత్వ ఆడపడుచుగా మన్నించారు.

మనది చాంద్రమానం కాబట్టి ఉగాది శుభవేళ చంద్రునికో నూలుపోగుగా ఆయనకో స్థానం కల్పిస్తారని ఎదురు చూస్తున్న వేళ ఎదురుదెబ్బ తగిలింది. మావూళ్లో ఒకాయన ఏమన్నాడంటే– ''ఆమని వచ్చింది, మా చంద్రబాబు కోయిలలా కూస్తు న్నాడు. కుహూ కుహూ అని ఒకటే కూత'' అన్నాడు. నిజమే, ఎన్నిసార్లు చెబుతాడు అదే మాట.

ఎన్నికల సమయంలో సవాలక్ష అనుకుంటారు. ప్రేయసీప్రియులు పెళ్లికి ముందు బోలెడు బాసలు, ఊసులు చేసుకుంటారు. వాటినే 'స్వీట్ నథింగ్' అంటారు ఆంగ్లంలో.

ప్రపంచ ప్రసిద్ధ స్టేట్ కాపిటల్ చంద్రబాబు కల. ఆ కలకి మోదీ ధారాళంగా నిధులు ఇవ్వాల్సిన పనిలేదు. రైతు రుణమాఫీ తెలుగుదేశం పార్టీ ఎన్నికల వాగ్దానం. దానికి కేంద్రం పైసలివ్వక్కర్లేదు. పోలవరం పూర్తి చేస్తారు. దాని సమయం దానికి పడుతుంది. తెలుగు దేశం ఎంపీలు, మంత్రులు ఢిల్లీలో కూచుని రాష్ట్రానికి ఏ చిన్నదీ సాధించలేకపోయారనే అపప్రథ సామాన్య ప్రజలో ఉంది.

నాలుగేళ్ల సమయాన్ని వృథా చేశారనీ, ఈలోగా మోదీ స్థిమితపడ్డారనీ, ఇంకోరి మాట వినే స్థితిలో లేరని పరిశీలకులు అంటున్నారు. కొందరు అమాయకులు ఏమంటున్నారంటే– అందరికీ కావల్సింది రాష్ట్ర ప్రయోజనాలే అయినప్పుడు, అన్ని పార్టీలను మిళితం చేసి ఏకోన్ముఖంగా పోరాడవచ్చు గదా. వాళ్లు నిజంగా అమాయకులు.

జనసేన మంగళగిరి సభలో పవన్‌కల్యాణ్ ఫిరంగి పేల్చాడు. 'మా నాన్న ముఖ్యమంత్రి కాదని' చిన్న తూటా విసిరాడు. తర్వాత లోకేష్‌బాబు అవినీతి మీ దృష్టికి రాలేదా అని సూటిగా చంద్రబాబుని ప్రశ్నించాడు మహాజన సభలో కిమిన్నాస్తి. సరితూగే జవాబు లేదు. ఖండన లేదు. ఛోటా మోటా నాయకులు మాత్రం, ఆయనెవరండీ.. పవన్‌కల్యాణ్ మాటలక్కాడా స్పందిస్తారా, గోంగూర అంటున్నారు. మొన్నటిదాకా పవన్‌కల్యాణ్ నోటెంట ఏమాట వచ్చినా, మంచి సూచన చేశారంటూ హాజరైన మాట నిజం కాదా.

ఇప్పుడు తేలిగ్గా తీసేసి 'గోంగూర' అంటే బ్యాలెన్సవదు. పవర్‌లోకి రాకముందు నుంచే రాష్ట్ర వెల్ఫేర్ విషయాల్లో చినబాబే జోక్యం చేసుకుంటున్నాడని వినేవాళ్లం. ఇహ పవర్లోకి వచ్చాక ఇంకో పవర్ హబ్ ఆవిష్కృతమైందని టీడీపీ నాయకులే చెబుతున్నారు. రెండో పవర్ సెంటర్ పుట్టడం అసలు దానికి చేటని గత చరిత్ర చెబుతోంది. 'కాకి పిల్లకేం తెలుసు ఉండేలు దెబ్బ' అనే సామెత వేయి సంవత్సరాల నాడు పుట్టింది. ఇప్పుడు అర్జంటుగా ఇంటి ఆవరణలో స్వచ్ఛభారత్‌పై దృష్టి పెట్టాలి.

'ఇది తెలుగుదేశంపై కుట్ర. దీని వెనక పెద్దలున్నారు' అని చంద్రబాబు అంటున్నారు. కుట్ర అనుకుంటే కుట్ర, వ్యూహం అనుకుంటే వ్యూహం. అవిశ్వాసం వేళ మోదీకి అవకాశం వస్తుందనీ, అప్పుడు ఉతికి ఆరేస్తారని ఒకచోట విన్నా. చదరంగంలో చెక్ అన్నా, ఆటకట్టు అన్నా, షా అన్నా ఒక్కటే. పెద్దల్లో అగ్రనేత షా లేరు కదా కొంపదీసి?

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

విళంబికి వేళాయె!



కాలం చక్రరూపంలో కదిలేది కదా, మరి దానికి అది ఎక్కడో అంతుతేల్చటం ఎలా? హేమాద్రి పండితుడి 'చతుర్వర్గ చింతామణి' అనే శాస్త్ర గ్రంథంలో కాల గణన సంప్రదాయం గురించి ఒక శ్లోకం ఉంది. బ్రహ్మ జగత్తును చైత్రమాసం శుక్ల పక్షంలో ప్రథమ దినాన సూర్యోదయం జరుగుతుండగా సృష్టించాడు అని దానర్థం. అంటే ఉగాది– చైత్ర శుద్ధ పాడ్యమి తిథి– సృష్ట్యాదికి వార్షికోత్సవం. అది నూతన యుగానికి ఆరంభమైన 'యుగాది'కి కూడా వార్షికోత్సవం.

చెట్టూ చేమా కూడా హేమంత రుతువులో చలి బాధలూ మంచు పీడా అనుభవించి, శిశిరంలో ఎండుటాకులూ గట్రా వదిలేసి, చైత్రమాసం నాటికి కొత్త చిగుళ్లు తొడిగి, వాటి జీవిత చక్రంలో మరొక నూతన అధ్యాయాన్ని మొదలుపెడతాయి. కనుక చైత్ర మాసారంభాన్ని సృష్ట్యాదికి వార్షికోత్సవంగా స్వీకరించాలి.

సమస్త ప్రాణికోటిలోనూ కొత్త ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ నింపి, బతుకు తీపి చవిచూసి, భవిష్యత్తు పట్ల ఆశలు పెంచే తియ్యని సమయం గనుక చైత్రమాసం మధుమాసం. కోకిలల గొంతుకలకూ, కవి కోకిలల కలాలకూ స్తబ్దత వదిలించి లోకాన్ని కోలాహలావహం చేసే ముహూర్తం మధుమాసం.

జ్యోతిర్మయం

ఉగాది మధుమాసానికి ముఖ ద్వారం. గోరంట పూలతో, అర విచ్చిన పొగడ మొగ్గలతో, అన్ని వనాలలోనూ ఆనందంతో చరించే కోకిలల గుంపుల గొంతుకల కాకతీ స్వరాలలో ఒప్పారుతుండేది మధుమాస సమయం. సాక్షాత్తూ గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు గర్వంగా చెప్పుకోలేదూ, రుతువులలో వసంత రుతువును నేను అని.

విళంబి నామ సంవత్సరానికి విలంబం లేకుండా స్వాగతం పలికే సమయం వచ్చింది. పండుగ కళ పలకరిస్తున్నది. తెలవారకముందే చెంగున లేవాలి. అభ్యంగన స్నానం చేయాలి. అనుష్ఠానాలూ నిత్య విధులూ ఆలస్యం లేకుండా పూర్తి చేసుకోవాలి. కొత్త సంవత్సరం గనుక కొత్త బట్టలూ, ఆభరణలూ ఆలంకారాలూ ధరించాలి. ఆరు రుచుల ఉగాది పచ్చడి చక్కగా చవి చూడాలి. ఆలయ దర్శనం చేసి రావాలి. మృష్టాన్న భోజనం ఆనందంగా ఆరగించాలి.

ఆపైన ఈ పర్వదినాన తీరిక చేసుకొని దైవజ్ఞుల దగ్గర పంచాంగ శ్రవణం చేయాలి. ఆపై ఆసక్తి ఉన్నవాళ్లు ఉదక కుంభ (నీటి బిందెల) దానాలు చేస్తారు. వేసవికి వచ్చినట్లే ఉంది కనుక చలివేంద్రాలలో మంచినీళ్లు అందించే ఏర్పాట్లు చేయొచ్చు.

ఏతెంచుతున్న విళంబి వత్సరం, ఏడాది పొడుగునా అందరికీ ఆనందోత్సాహాలనూ, సుఖ సంతోషాలనూ అందిస్తూ చల్లగా సాగిపోతుందని ఆశిద్దాం.

(రేపు ఉగాది పర్వదినం)
– ఎం. మారుతి శాస్త్రి

ఉద్యోగుల సమస్యలకు నాయకుల తిలోదకాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల సేవా మరియు వేతన స్థిరీకరణ చెల్లింపులకు సంబంధించి పెక్కు సమస్యలు చాలా కాలంగా పరిష్కరించబడకుండా నిలిచి ఉన్నాయి. అందులో కొత్తగా పీఆర్సీ 11 ఇప్పటికే కాలాతీతమైనప్పటికీ కమిషన్ నియామక ప్రక్రియ ఇంతవరకూ ప్రారంభించ లేదు. రెండు విడతల కరువు భత్యం (7/17, 1/18) చెల్లింపులు ఆరు మాసాలకు పైబడి కాలం గడిచినా మంజూరీ ఊసే లేదు. సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు గత పీఆర్సీ 10 సిఫారసు ననుసరించి అదనపు పింఛన్ మంజూరీ, చెల్లింపులు చాలా కాలంగా (మూడు సంవత్సరాలకు పైబడి) నిలిపి ఉంచడంతో వారికి అదనపు పింఛన్ మంజూరీ ప్రశ్నార్థకమై ఉన్నది. వేతన స్థిరీకరణ బకాయిల చెల్లింపులు 2 సంవత్సరాలకు పైబడి కాలయాపనానంతరం ఏకమొత్తంగా చెల్లింపులు చేయకుండా ఇటీవలనే సుదూర కాల వ్యవధి (18) విడతల మాసవారీ చెల్లింపుల పద్ధతిలో ప్రారంభించటంతో ఉద్యోగ వర్గాలలో అసంతృప్తి నెలకొని ఉంది.

ఉద్యోగుల సేవ, వేతన స్థిరీకరణ చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పందించి మంజూరీలిస్తూ చెల్లింపులు చేయటంతో తమ బడ్జెట్‌పై బకాయిల భారం పడకుండా వ్యవహరించుట అభినందనీయం. అందుకు విరుద్ధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుదూర కాలయాపన అనంతరం మంజూరీలిస్తూ కోట్లాది రూపాయల భారం రాష్ట్ర బడ్జెట్‌పై మోపడం అసమంజసం, అనాలోచితం.

ఉద్యోగ వర్గాలకు లబ్ధి సమకూర్చే ముఖ్యమైన అంశం ఏదంటే పైన పేర్కొన్న సమస్యల పరిష్కారమే. వీటిని సాధించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘ నాయకులపై ఉన్న వారు అవలంబిస్తున్న నామమాత్రపు ప్రదర్శనలు, అధికారులతో కుమ్మక్కు వలన ఫలితం శూన్యం. ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు తమ కనుసన్నల్లోనే మెదులుతూ ఉన్నందున ఉద్యోగ సంఘాల నుండి ఇప్పట్లో నిరసనల ప్రమాదమేదీ ఉండబోదని గ్రహించి ప్రభుత్వ వర్గాలు సమస్యల పరిష్కారం చేయకుండా మిన్నకుండి వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తూ ఉన్నారని గమనించాలి.

క్షేత్ర స్థాయి ఉద్యోగ సంఘ సభ్యుల సమస్యల పరిస్థితి అయోమయంలో పడి ఉండేందుకు రాష్ట్ర స్థాయి సంఘ నాయకుల అలసత్వమే కారణమై ఉంటుందని తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర స్థాయి సంఘ నాయకులు మేల్కొని సమస్యల పరిష్కారం కోసం పటిష్టమైన కార్యాచరణ అత్యవసరంగా చేపట్టవలసిన అవసరం ఉంది. తెలంగాణలోని అన్ని ఉద్యోగ సేవా సంఘ నాయకులు, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులతో సమావేశం ఏర్పరచి ఒక జేఏసీగా ఏర్పడి భారీ సమూహంతో సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి తీవ్ర నిరసన తెలియజేయటంతో పాటు అవసరమని భావిస్తే ప్రదర్శనలు చేయటం ద్వారా పైన పేర్కొన్న అన్ని సమస్యల పరిష్కారం సాధించవలసిన అవసరం ఉంది.

– మోహన్, ఎన్జీవో, కరీంనగర్

ఇన్ బాక్స్

విలువలు తేవమ్మా.. విళంబి

హేవిళంబి నామసంవత్సరం లోని
మధుర జ్ఞాపకాలలో తేలియాడుతూ
మనస్సుకు పట్టిన పులుపు మాలిన్యాన్ని
తొలగించుకుంటూ
పెనం మీద చిటపటలాడే ఉప్పు లాంటి
చిర్రుబుర్రులాటలను దూరం చేసుకుంటూ
అహంకారానికి తావివ్వకుండా
చిలిపి చేష్టలలోని వగరును
మననం చేసుకుంటూ
చేదు అనుభవాలకు స్వస్తి చెబుతూ
షడ్రుచుల సమ్మిళితజీవిత గమనాన్ని
ఉగాది పచ్చడిగా సేవించి...
అసమానతలు తొలగాలని
రైతన్నలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని
మహిళలను గౌరవిస్తేనే...
దేశం వృద్ధి చెందుతుందనే సత్యాన్ని ఎరిగి
విలువలకు ప్రాణం పోయాలని
సమస్త ప్రాణులు సుభిక్షంగా ఉండాలని
మనసారా కోరుకుంటూ...
విళంబి నామసంవత్సరానికి
ఆత్మీయ స్వాగతం పలుకుదాం.

(రేపు తెలుగు నూతన సంవత్సరాది)
– గుండు కరుణాకర్, వరంగల్

కేసీఆర్ అబద్ధాలకు అడ్డాగా అసెంబ్లీ

మంద కృష్ణమాదిగ

హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ బెదిరింపులకు, అబద్ధాలకు అసెంబ్లీని అడ్డాగా మార్చారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను అణచివేస్తానని, అణచివేశానని అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించడం బెదిరింపులో భాగం కాదా అని ప్రశ్నించారు. కేవలం తాను దళితుడిని అయినందువల్లే అణచి వేస్తానని ప్రకటిస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణను సాధిస్తామని చెప్పడం అబద్ధాలకు పరాకాష్ట అని అన్నారు. 24 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో తాము ఏనాడూ విధ్వంసాలకు పాల్పడలేదని, టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన తర్వాత 13 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో హింస, విధ్వంసాలు చోటు చేసుకున్నాయని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, ముద్రగడ, జగన్, కేసీఆర్ కూడా దీక్ష చేశారని, వారి ఆరోగ్యం క్షీణించినప్పుడే భగ్నం చేశారని, కానీ, తాను దీక్షకు కూర్చున్న నిమిషంలోపే పోలీసులు భగ్నం చేశారని పేర్కొన్నారు. భారతి మృతి చెందినప్పుడు రెండు రోజుల్లో అన్ని పక్షాలను తీసుకుని ఢిల్లీ వెళతానని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, కానీ, 4 నెలల 10 రోజులు గడిచినా అది నెరవేరలేదని అన్నారు. మాదిగ భవన్ నిర్మిస్తామని, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడెకరాల భూమిస్తామని హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని, అందుకే కేసీఆర్‌ను మాదిగలు నమ్మేపరిస్థితి లేదని అన్నారు.

21 నుంచి ఢిల్లీలో దీక్షలు

ఈ నెల 21వ తేదీ నుంచి ఢిల్లీలో వర్గీకరణ కోసం నిరాహార దీక్షలు చేపట్టను న్నామని కృష్ణ మాదిగ తెలిపారు. 17వ తేదీ నుంచి ఉభయ రాష్ట్రాల్లోని ఎంపీలకు వినతిపత్రాలు అందించడం, 20న అన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధుల్లో దీక్షలు ఉంటాయని చెప్పారు. 21 నుంచి పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు.

బీసీలను ఐదు గ్రూపులుగా వర్గీకరించాలి

జాతీయ బీసీ కమిషన్‌కు బీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలను ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా వర్గీకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ రోహిణికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఇక్కడ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఒక వినతిపత్రం ఇచ్చింది. రాజ్యాంగంలో ఓబీసీ అని ఉంది కానీ ఎంబీసీ–ఈబీసీ అని లేదని పేర్కొంది. బీసీలను ఐదు గ్రూపులుగా వర్గీకరించాలని, ఒక గ్రూపులో విద్యాసంస్థల అడ్మిషన్లలో సీట్లు, ఉద్యోగాల భర్తీలో ఖాళీలు మిగిలిన తరువాతి గ్రూపులకు మళ్లించాలని, బ్యాక్‌లాగ్ ఉంచొద్దని సూచించారు. సంచార జాతులు, భిక్షాటన చేసే కులాలు, ఆశ్రిత కులాలు, సేవా కులాలను 'ఏ'గ్రూపులో, చేతివృత్తులు–కులవృత్తులు చేస్తూ వారి జనాభాలో 50 శాతంలోపు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఉన్న కులాలను 'బీ'గ్రూపులో, 50 శాతం కంటే ఎక్కువ ప్రాతినిధ్యం ఉన్న కులాలను 'సీ'గ్రూపులో, వ్యవసాయ కులాలు, వ్యవసాయాధారిత ఇతర జనరల్ కులాలను 'డీ'గ్రూపులో, క్రిస్టియన్లు, ముస్లింల లోని కొన్ని కులాలను 'ఈ'గ్రూపులో చేర్చాలని కోరారు. ఆయా గ్రూపుల్లో చేర్చిన కులాల జనాభా ప్రకారం రిజర్వేషన్ల శాతం నిర్ణయించాలని కోరారు. ఈ మేరకు 60 మంది ఎంపీలను కలసి వినతిపత్రాలు ఇచ్చినట్టు కృష్ణయ్య మీడియాకు తెలిపారు. జస్టిస్ రోహిణిని కలిసిన బృందంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, ఎన్.భూపేష్‌సాగర్, ఎస్.లక్ష్మీనారాయణ ఉన్నారు.

అసెంబ్లీ సీసీ టీవీ ఫుటేజీలు ఇవ్వండి

సమాచార చట్టం కింద కోరిన కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సభ్యులనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్న తరుణంలో జరిగిన వ్యవహారానికి సంబంధించి సభలోపలి సీసీ టీవీ ఫుటేజీలు అందించాలంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య సమయంలో సభ లోపలి దృశ్యాలను అన్ని సీసీ టీవీల నుంచి సేకరించి రెండు రోజుల్లో అందివ్వాలని అందులో కోరారు. సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా/అసంపూర్తి సమాచారం, తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకునే అధికారి పేరు, హోదా, ఫోన్ నంబర్ వివరాలు సమర్పించాలని కోమటిరెడ్డి అందులో కోరారు.

'మిథ్యా'నవనాలు

రాష్ట్రంలో పేరుకు పార్కులు.. ఎక్కడా లేని ఆనవాళ్లు

చాలా మున్సిపాలిటీల్లో నామమాత్రంగా ఉద్యానవనాలు ● పచ్చదనం లేదు.. పర్యవేక్షణ అసలే లేదు

చెత్త డంపింగ్ యార్డులను తలపిస్తున్న దుస్థితి ● చాలా చోట్ల కబ్జాల పాలవుతున్న పార్కు స్థలాలు

కమ్యూనిటీ హాళ్లదీ అదే పరిస్థితి.. వాడుకలో లేక శిథిలం ● 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి



డంపింగ్‌యార్డుగా మారిన ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని భుక్తాపూర్ పార్కుస్థలం

అవి పార్కులు.. మామూలుగా అయితే పచ్చని చెట్లు, మొక్కలు.. పిల్లల ఆట పరికరాలు.. ఆహ్లాదకర వాతావరణం ఉండాలి.. కానీ అక్కడ చెట్లు, మొక్కలు కాదుకదా గడ్డి కూడా ఉండదు.. అంతా చెత్తాచెదా రం.. ఆ కాస్త భూమీ ఆక్రమణల మయం.. ఓ చోట వాహనాల పార్కింగ్ స్థలంగా మారిపోతే.. మరోచోట నివాస భవనాలు వెలి శాయి.. ఇక వివిధ కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ భవనాలు భూత్ బంగ్లాలుగా మారిపోతున్నాయి.. ఇదీ రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో పార్కులు, కమ్యూనిటీ హాళ్ల దుస్థితి. పార్కులు, కమ్యూనిటీ హాళ్ల పరిస్థితిపై 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో ఎన్నో విస్మ యకర అంశాలు వెల్లడయ్యాయి.

– సాక్షి నెట్‌వర్క్

ఆనవాళ్లు కూడా లేకుండా..



బాన్సువాడలో మున్సిపల్ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భారీ భవనం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పేరుకు పార్కులు ఉన్నా.. చాలా చోట్ల వాటి ఆనవాళ్లు కూడా లేవు. పిల్లలకు క్రీడా వసతులు, ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్‌ల వంటివేమీ లేవు. పచ్చదనం కనుమరుగై, పరికరాలు తుప్పుపట్టిపోయినవి కొన్ని అయితే.. ఎడాపెడా కబ్జాల పాలవుతున్నవి మరికొన్ని. పలుచోట్ల అయితే నిర్వహణ లేక పార్కులు చెత్త డంపింగ్ యార్డులుగా మారిపోతుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాలూ పార్కుల స్థలాల్లోనే..

ఇక స్థలాల కొరత పేరుతో.. చాలా చోట్ల పార్కుల స్థలాల్లోనే ప్రభుత్వ కార్యాలయా లను ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. వనప ర్తి, తాండూరు, కరీంనగర్, సిద్దిపేట, నిజా మాబాద్ మున్సిపాలిటీల పరిధిలో పార్కు స్థలాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు వెలి శాయి. పలుచోట్ల స్త్రీశక్తి భవనాలు, గ్రంథాల యాలు, ఇతర ప్రభుత్వ అవసరాలకు పార్కు స్థలాలనే కేటాయిస్తున్నారు. ఇక బెల్లంపల్లి, జనగామ, పెద్దపల్లి, సిరిసిల్ల, గోదావరిఖని, బాన్సువాడ తదితర మున్సిపాలిటీల్లో అసలు పార్కులే లేవు. ప్రస్తుతం అమృత్ పథకం కింద ఎంపికైన పలు మున్సిపాలిటీలు, కార్పొ రేషన్ల పరిధిలో వందకుపైగా పార్కులు రూపు దిద్దుకోనున్నాయి. వాటికి నిధులు మంజూ రైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

రాష్ట్రంలో పార్కులు, కమ్యూనిటీ హాళ్ల సంఖ్య

పాత జిల్లా	మున్సిపాలిటీలు కార్పొరేషన్లు	పార్కులు	కమ్యూనిటీ హాళ్లు
మెదక్	5	11	5
ఖమ్మం	4	26	24
వరంగల్	3	22	25
రంగారెడ్డి	3	27	11
నిజామాబాద్	5	104	30
మహబూబ్‌నగర్	4	47	22
నల్లగొండ	5	107	76
ఆదిలాబాద్	7	16	6
కరీంనగర్	6	13	16

('సాక్షి'పరిశీలనలో తేలిన లెక్కల ప్రకారం..)

మున్సిపాలిటీల్లో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట మున్సిపాలిటీలో ఉన్న ఓ పార్కు మిషన్ భగీరథ పంపుహౌస్‌గా మారిపోయింది. సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, మెదక్ మున్సిపాలిటీల్లోని ఐదు పార్కుల్లో ఒక్క నిమిషం గడ పలేని పరిస్థితి ఉంది. పాత ఖమ్మం జిల్లా పరిధిలోని పార్కులు, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ లోపించింది. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో 20 పార్కుల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నా.. పనులు మొదలు కాలేదు. చాలా చోట్ల పార్కు స్థలాలు కబ్జా అయ్యాయి. పాత రంగారెడ్డి జిల్లాలో చాలా చోట్ల పార్కుల స్థలాలు కబ్జాల పాలయ్యాయి. తాండూరులో ఉన్న పార్కులో జిల్లా ఆస్పత్రిని నిర్మించారు. నిజామాబాద్ పట్టణంలో పేరుకు చాలా పార్కులున్నా ప్రభుత్వ నిర్మాణాలు వెలిశాయి. పాత మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పేరుకే పార్కులు.. ఎక్కడా వసతులు లేవు. పలు చోట్ల పార్కుల కోసం ఉద్దేశించిన స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. కమ్యూనిటీ హాళ్లు అయితే పాడుబడిన బంగళాలను తల పిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా పార్కుల స్థలాలు పరాధీనమైపోయాయి. ఉన్న ఒకటి రెండు చోట్లా సౌకర్యాలేవీ లేవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ ఇదే దుస్థితి. గోదావరిఖనిలో ఖాళీ స్థలంలో పార్కు, ఆస్పత్రి నిర్మాణంపై వివాదం నెలకొంది. లక్ష జనాభా ఉన్న జగిత్యాలలో ఒకే పార్కు ఉండగా.. సిరిసి ల్లలో ఇప్పుడిప్పుడే పార్కులు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నారు.



ఆక్రమణకు గురైన మిథుల పార్కులోని కొంతస్థలం

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

చాలా చోట్ల పార్కులు, పార్కుల స్థలాలు కబ్జాల పాలవుతు న్నాయి. 'ఇది ప్రభుత్వ భూమి'అని తెలిపే బోర్డు సహా దురాక్రమణకు గురవుతున్నా అడిగేవారు లేరు. ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో మాత్రం పార్కులు, పార్కు స్థలాలు ప్రభుత్వ అధీనంలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. మిగతా ఏ జిల్లాలోనూ ఉద్యానవనాలు, వాటికి ఉద్దేశించిన స్థలాలు చేతులు మారడమో, కబ్జా కావడమో జరిగినట్టు 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీల నలో తేలింది. వరంగల్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో అయితే పార్కు స్థలాలకు సంబంధించి అధికారుల వద్ద లెక్కాపత్రం కూడా లేకుండా పోయింది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పార్కుల స్థలాల్లోనే గుడిసెలు, దుకాణాలు వెలిశాయి. వాటికి ఇంటి నంబర్లు కూడా ఇచ్చేయడం గమనార్హం. అలాంటి చోట తొలుత పేదల పేరుతో గుడిసెలు వేస్తున్నారు. కొంతకాలం తర్వాత భారీ భవంతులు నిర్మిస్తు న్నారు.

పార్కు స్థలం.. ప్రైవేట్ స్కూల్ పార్కింగ్ ప్లేస్



మెదక్ జిల్లా కేంద్రం నడిబొడ్డున జంబికుంట వీధిలోని పార్కు స్థలం ఇది. దీని విలువ కోటి రూపాయలకు పైమాటే. పక్కనే ఉన్న ఓ ప్రైవేటు స్కూలు నిర్వాహకులు 'ఇది పార్కు స్థలం'అనే బోర్డు సహా ఆ స్థలాన్ని కబ్జా చేసేశారు. ఏకంగా ప్రహరీ కూడా కట్టేసి.. వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తు న్నారు. కానీ ఇదేమిటని అడిగేవారెవరూ లేరు.

జంబికుంట వీధిలో పార్కులోకి చొచ్చుకొచ్చిన ఓ ప్రైవేట్ స్కూల్

మనుగడ కోల్పోతున్న కమ్యూనిటీ హాళ్లు

మున్సిపాలిటీల పరిధిలోని వార్డులు, బస్తీలు, కాలనీల్లో వివాహాలు, ఇతర శుభ కార్యాలు, ప్రభుత్వపర కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలుగా నిర్మించిన కమ్యూనిటీ హాళ్ల పరిస్థితి దారుణంగా మారిపోయింది. సరైన నిర్వహణ లేక చాలా చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల కమ్యూనిటీ హాళ్లు స్త్రీశక్తి భవనాలుగా మారిపోగా.. చాలా తక్కువ భవనాలు మాత్రమే కమ్యూనిటీ హాళ్లుగా వినియోగంలో ఉన్నాయి. ఇక పదులకొద్దీ మున్సిపాలిటీల్లో అసలు కమ్యూనిటీ భవనాలే లేకపోవడం గమనార్హం. కొన్ని చోట్ల ఉన్నా నిరుపయోగంగా ఉంటున్నాయి. ఉదాహరణకు నారాయ ణపేట మున్సిపాలిటీ పరిధిలో పది కమ్యూనిటీ భవనా లున్నా.. చిన్నపాటి కార్యక్రమం కూడా నిర్వహించలే నంత ఇరుగ్గా ఉండడం గమనార్హం.

దోచుకుని తెలంగాణను ఖాళీ చేశారు

సీఎం కేసీఆర్‌పై కోమటిరెడ్డి ఫైర్



సాక్షి, న్యూఢిల్లీ: సీఎం కె.చంద్రశేఖర్‌రావు నాలుగేళ్ల కాలంలో తెలంగాణను దోచుకుని మొత్తం ఖాళీ చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్లీనరీలో పాల్గొనేందుకు శుక్రవారం ఢిల్లీ వచ్చిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ప్రజలను కులాల వారీగా విడదీస్తూ కేసీఆర్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అప్రజాస్వామిక రీతిలో తమను సస్పెన్స్ చేశారని, దేశ చరిత్రలో ఎక్కడా ఇలా జరగలేదని చెప్పారు. అసెంబ్లీలోకి అనుమతి లేకుండా పోలీసులు ఎలా వచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెట్టడమే తన లక్ష్యమని అన్నారు.

గదులు కేటాయించకపోవడమేంటి?: ప్లీనరీలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌లకు తెలంగాణ భవన్‌లో అధికారులు గదులు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత జానారెడ్డి తమ పేర్లపై గదులకు సిఫార్సు చేసినా ఇవ్వకపోవడంపై అసహ నం వ్యక్తం చేశారు.

✦ మోదీతో కేసీఆర్ లాలూచీ బట్టబయలు



రేవంత్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీతో సీఎం కేసీఆర్ లాలూచీ పార్లమెంటు సమావేశాల్లో బట్టబయలైందని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకోడానికి బీజేపీ తరపున టీఆర్‌ఎస్ ఎంపీలు శిఖండి పాత్ర పోషించారని శుక్రవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తూ కాంగ్రెస్, వామపక్ష పార్టీలు సహా అనేక పార్టీల సభ్యులు తమ స్థానాల వద్ద లేచి నిలబడ్డారని, అప్పుడే టీఆర్‌ఎస్ సభ్యులు బీజేపీకి అనుకూలంగా గందరగోళం చేశారని ఆరోపించారు. ప్రత్యేక హోదాపై వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీల పోరాటానికి మద్దతిస్తామంటూనే హోదాను వ్యతిరేకిస్తున్న మోదీని కాపాడేలా టీఆర్‌ఎస్ ఎంపీలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ సభ్యులు మౌనంగా ఉంటే అవిశ్వాసం చర్చకు వచ్చేదని.. అప్పుడు ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రిజర్వేషన్ల అంశమూ చర్చకు వచ్చేదన్నారు.

✦ జనాభా దామాషాలో పార్టీలు టికెట్లివ్వాలి



తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో జనాభా దామాషాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని పార్టీలు టికెట్లు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్)కు ఆదరణ పెరుగుతోందన్నారు. బీఎల్‌ఎఫ్ పక్షాన రానున్న ఎన్నికల్లో 119 స్థానాలకు పోటీ చేస్తామని.. ఈ సారి ఎక్కువ మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సీట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సీఎం కేసీఆర్‌తో పొత్తు ప్రసక్తే లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు అవినీతిపై ప్రశ్నిస్తున్న పవన్‌కల్యాణ్.. కలసి పనిచేద్దామనే ప్రతిపాదనతో తమతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభానికి గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని హాజరవుతున్నట్టుగా వెల్లడించారు.

✦ అవిశ్వాసం పెడితే అడ్డుపడుతున్నారు

టీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగిన జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విభజన చట్టంలోని హామీల అమలు కోసం కేంద్రంపై అవిశ్వాసం ప్రవేశపెడితే టీఆర్‌ఎస్ ఎంపీలు సభ ఆర్డర్‌లో లేకుండా ఆందోళన చేస్తూ బీజేపీ కనుసైగల్లో పనిచేస్తున్నారని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి విమర్శించారు. మూడో ప్రత్యామ్నాయం పేరు వల్లిస్తున్న సీఎం కేసీఆర్.. బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడేలా టీఆర్‌ఎస్ ఎంపీలను నడిపిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు టీఎంసీ, టీడీపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు అవిశ్వాసం పెడితే పార్లమెంటులో టీఆర్‌ఎస్ అడ్డుపడుతోందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా పెట్టుబడి రాయితీ ప్రత్యామ్నాయం అవుతుందా అని ప్రశ్నించారు. రుణమాఫీ లబ్ధిని బ్యాంకులు తప్ప రైతు పొందలేక పోయాడని, ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు ప్రభుత్వం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

✦ స్వామిగౌడ్ గాయం కేసీఆర్ డ్రామా



రవీంద్రనాయక్

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ గాయం పేరుతో సీఎం కేసీఆర్ డ్రామా ఆడుతున్నారని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఆరోపించారు. నియంతలా పాలిస్తున్న కేసీఆర్.. ప్రశ్నించేవారు లేకుండా చేయాలని కుట్రతో వ్యవహరిస్తున్నారని శుక్రవారం దుయ్యబట్టారు. స్వామిగౌడ్‌కు గాయం కాలేదని, రాష్ట్రంలో అన్ని వర్గాలను సీఎం మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్రంతో పోరాటానికి ఢిల్లీలో ధర్నా చేస్తానంటున్న సీఎం గిరిజనుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు గిరిజనులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

✦ టీడీపీ దూరమవడం మాకే మంచిది

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలిగినా ఎలాంటి నష్టం ఉండబోదని, ఇది బీజేపీకే లాభం చేకూర్చే పరిణామమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ కాస్త కష్టపడితే అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, సంస్థాగతంగా ఎలాంటి బలం లేని త్రిపుర లాంటి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చినప్పుడు ఇది పెద్ద కష్టమైన విషయమేమీ కాదన్నారు. రెండు రోజుల పర్యటన కోసం తెలంగాణకు వచ్చిన ఆయన శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర పదాధికారులు, ఓబీసీ మోర్చా, మీడియా కమిటీ, ఐటీ, సోషల్ మీడియా కమిటీలతో భేటీ అయ్యారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి అధికారాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆ తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో పెనుమార్పులు సంభవిస్తాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేవిధంగా పలు సూచనలు చేశారు. శనివారం ఖమ్మం, వరంగల్ రూరల్ జిల్లాల్లో బూత్‌స్థాయి, మండల, జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాల్లో ఆయన పాల్గొంటారు.

✦ అవిశ్వాసానికి మద్దతు ఇస్తాం : కర్నె



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా టీఆర్‌ఎస్ ఎంపీలు ఓటేస్తారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రకటించారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తామని ఎంపీ వినోద్ కుమార్ ఇప్పటికే ప్రకటించారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ శక్తి ఏమిటో దేశ ప్రజలు త్వరలోనే చూడబోతున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంకెలగారడీ కాదని, తెలంగాణ ప్రగతిని ప్రతిబింబిస్తున్నదన్నారు. టీఆర్‌ఎస్‌లో చేరితే కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభపెట్టినట్టుగా సంపత్‌కుమార్ మాట్లాడటం సరికాదని, ఆ ఖర్మ టీఆర్‌ఎస్‌కు లేదన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డిపై కోమటిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, నల్లగొండ జిల్లాలో హత్యా రాజకీయాలకు పాల్పడిన చరిత్ర కోమటిరెడ్డిది అని విమర్శించారు. కాంగ్రెస్ వరుస ఓటములు జీర్ణించుకోలేక జైపాల్‌రెడ్డి నోటికొచ్చినట్టుగా మాట్లాడుతున్నాడని విమర్శించారు.

✦ మాదిగ కార్పొరేషన్‌పై ప్రకటన చేయాలి

సీఎం కేసీఆర్‌కు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి

హైదరాబాద్: అత్యంత వెనుకబడిన మాదిగ ఉపకులాల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్.. డప్పు, చెప్పుకు రూ.2వేల పెన్షన్‌పై సీఎం కేసీఆర్ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటన చేయాలని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాల డిమాం డ్ల సాధన కోసం ఈ నెల 20న నిర్వహించనున్న సమరభేరి సదస్సు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విద్యానగర్‌లోని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మాదిగ ఉపకులాల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఈ నెల 20న సమరభేరి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గనుల శాఖలో 477 లీజులు రద్దు



శుక్రవారం గనుల శాఖ కార్యకలాపాలపై సమీక్షిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

గనుల శాఖపై సమీక్షలో మంత్రి కేటీఆర్

- కార్యకలాపాలు నిర్వహించనందుకు చర్యలు
- లీజులు, పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేయండి
- రాక్ శాండ్ వినియోగాన్ని ప్రోత్సహించండి
- రాష్ట్రవ్యాప్తంగా శాండ్ టాక్సీ విధానం అమలు చేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గనుల శాఖ అనుమతి తీసుకుని కార్యకలాపాలు చేపట్టని లీజులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఏడాది కాలంగా రాష్ట్రవ్యాప్తంగా 477 లీజులకు సంబంధించి కార్యకలాపాలు నిర్వహించడం లేదని గుర్తించి.. వాటిని రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఇక వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో గనుల శాఖ అధికారులు 354 తనిఖీలు నిర్వహించి.. 79 చోట్ల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. దీంతో వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలో గనుల శాఖ కార్యకలాపాలపై శుక్రవారం మంత్రి కె.తారకరామారావు సమీక్షించారు. అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయాలని, ఇందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించండి

గనుల శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని మంత్రి కేటీఆర్ సూచించారు. గనుల పర్యవేక్షణలో జియోఫెన్సింగ్, జియో ట్యాగింగ్, ఉపగ్రహ చిత్రాల వినియోగం, డ్రోన్ల వినియోగాన్ని విస్తృతం చేయాలన్నారు. త్వరలో తీసుకురానున్న మైనింగ్ పాలసీలో దేశంలోని అత్యుత్తమ విధానాలను అమలుచేయాలని, ఆ పాలసీని చట్టరూపంలో తీసుకువస్తామని చెప్పారు. ఈ-వేలం విధానంలో గనుల, ఇసుక రీచ్‌ల లీజులు కేటాయించాలని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక రాష్ట్రంలో సున్నపురాయి గనుల లీజుపైనా మంత్రి చర్చించారు. వాటికి జాతీయ స్థాయిలో కాకుండా అంతర్జాతీయస్థాయి వేలం నిర్వహించాలని చెప్పారు.

రాక్ శాండ్ వినియోగం పెంచండి

పర్యావరణ సమతుల్యత కోసం రాక్ శాండ్ (రాతి ఇసుక) వినియోగాన్ని పెంచాలని కేటీఆర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం వివిధ శాఖల పరిధిలో చేపట్టిన నిర్మాణాల్లో దాని వినియోగం పెంచాలని, ఆయా శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. టీఎస్ఎండీసీ రాక్ శాండ్ క్రషర్ల ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. పలు జిల్లాల్లో చేపట్టిన శాండ్ టాక్సీ విధానం విజయవంతమైందని, దానిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఒక్క ఫోన్ కాల్‌తో రాష్ట్రంలోని ఎవరికైనా ఏయే ధరల్లో ఇసుక లభిస్తుందో తెలిసేలా కొత్త విధానం రూపొందించాలని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖ ఆదాయ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. రూ.3,166 కోట్ల ఆదాయ లక్ష్యం పెట్టుకోగా మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా ఫిబ్రవరి నెలాఖరు నాటికే సుమారు రూ.3,500 కోట్లు (110 శాతం) ఆదాయం వచ్చిందన్నారు. ఇసుక ఆదాయ లక్ష్యం రూ.388 కోట్లుకాగా.. రూ.538 కోట్లు (139శాతం) సమకూరినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపిందని, అందువల్లే ఆదాయం కూడా పెరిగిందని పేర్కొన్నారు.

బహిష్కరణ వెనుక రాజకీయ దురుద్దేశాలు

హైకోర్టుకు వివరించిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్

- ఇందులో అసెంబ్లీ స్పీకర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పాత్ర ఉంది
- నోటీసులు లేవు..వివరణ లేదు
- ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం
- గవర్నర్ ప్రసంగం సభ వ్యవహారాల కిందకు రాదు
- మాపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు లేదు
- ఇయర్ ఫోన్ విసిరిన తర్వాత కూడా చైర్మన్ ఉల్లాసంగా గడిపారు
- ఆ తర్వాతే కంటికి దెబ్బతగిలిదంటూ బ్యాండేజీ వేసుకున్నారు
- ప్రభుత్వ వాదన నిమిత్తం విచారణ సోమవారానికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: తమపై వేసిన బహిష్కరణ వేటు వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని, ఇందులో అసెంబ్లీ స్పీకర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి సైతం పాత్ర ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.సంపత్‌కుమార్ హైకోర్టుకు నివేదించారు. తమకు నోటీసులు ఇవ్వకుండా.. వివరణ తీసుకోకుండా.. సభలో చర్చించకుండా.. ప్రభుత్వం అనుకున్నదే తడువుగా తమ బహిష్కరణ పూర్తి కావడం, తమ అసెంబ్లీ నియోజకవర్గాలు ఖాళీ అయినట్లు ఎన్నికల కమిషన్‌కు వర్తమానం పంపడం అంతా చాలా వేగంగా, ఏకపక్షంగా పూర్తి చేశారని వారు తెలిపారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం, అసెంబ్లీ వర్గాలు, ఇప్పటి వరకు తమకు బహిష్కరణ ఉత్తర్వులను అందజేయలేదని అన్నారు. నిబంధనల ప్రకారం ఇటువంటి వ్యవహారాల్లో ప్రివిలేజ్ కమిటీలో, సభలో చర్చించిన తరువాతే నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, స్పీకర్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. గవర్నర్ ప్రసంగం శాసనసభ వ్యవహారాల కిందకు రాదని, ఆయన ప్రసంగ సమయంలో ఎవరైనా సభ్యుడు హుందాగా వ్యవహరించకపోతే అతనిపై చర్యలు తీసుకునే అధికారం గవర్నర్‌కు మాత్రమే ఉందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ఆటంకం కలిగించామంటూ తమపై స్పీకర్ బహిష్కరణ వేటు వేశారని, ఇలా చేయడం స్పీకర్ తన అధికార పరిధిని దాటి వ్యవహరించడమే కాక, రాజ్యాంగ విరుద్ధమని వివరించారు. వీరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ శివశంకరరావు ప్రభుత్వ వాదనల నిమిత్తం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చారు. తమను శాసనసభ నుంచి బహిష్కరించడంతో పాటు, నల్లగొండ, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఖాళీగా ఉన్నట్లు నోటిఫై చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలును నిలిపేయడంతో పాటు, ఆ నోటిఫికేషన్ ఆధారంగా నల్లగొండ, అలంపూర్ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించకుండా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కోమటిరెడ్డి, సంపత్ గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు విచారణ జరిపారు.

తర్వాతా ఉల్లాసంగానే గడిపారు

పిటిషనర్లు విసిరిన ఇయర్ ఫోన్ వల్ల మండలి చైర్మన్ గాయపడ్డారన్నది ఆరోపణ అని, ఇయర్ ఫోన్ విసిరిన చాలాసేపటి వరకు మండలి చైర్మన్ ఉల్లాసంగా గడిపారని, గవర్నర్, స్పీకర్‌తో సరదాగా మాట్లాడుతూ గడిపారని వాదించారు. గవర్నర్‌ను కారు వరకు వెళ్లి సాగనంపారని తెలిపారు. తర్వాత 20 నిమిషాలకు కన్నుకు దెబ్బతగిలినట్లు బ్యాండేజీ వేసుకున్నారని, ముందు కుడికన్నుకు గాయమైందని.. తర్వాత ఎడమ కన్నుకు గాయమైందన్నారని తెలిపారు. కానీ వీడియో ఫుటేజీని బహిర్గతం చేయలేదన్నారు.

ఇందులో స్పీకర్ జోక్యం తగదు..

కోమటిరెడ్డి, సంపత్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సభా వ్యవహారాల కిందకు రాని వాటి విషయంలో జోక్యం చేసుకునే అధికారం స్పీకర్‌కు లేదన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన దానికి స్పీకర్ చర్యలు తీసుకోవడానికి సభా వ్యవహారాల నిబంధనలు అంగీకరించవన్నారు. రాజస్థాన్ అసెంబ్లీలో ఇలాగే జరిగినప్పుడు అందుకు బాధ్యులైన సభ్యులను గవర్నరే బహిష్కరించారని తెలిపారు. నిబంధనల ప్రకారం బహిష్కరణ ఆ సెషన్‌కు మాత్రమే పరిమితం అవుతుందని, అయితే స్పీకర్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో వెలువరించిన తీర్పులను ఉదహరించారు. ఇటువంటి వ్యవహారాల్లో న్యాయ సమీక్ష చేయవచ్చని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు.

▶ మొదటిపేజీ తరువాయి

ట్రెండ్.. మారుతోంది!

ఎప్పటికప్పుడు మారుతున్న తెలుగు విద్యార్థుల ట్రెండ్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

అక్కడే చదువు.. ఉద్యోగం..

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి 2004లో ఎంబీఏ కోర్సు పూర్తి చేసేందుకు లండన్ వెళ్లారు. రెండేళ్లలో కోర్సు పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తుండగానే అతడిని అక్కడి ప్రభుత్వం తిప్పిపంపింది. అయితే ప్రభాకర్‌రెడ్డి లండన్ వెళ్లింది చదువు పేరుతో అక్కడ ఉద్యోగం సంపాదించడానికే. అంతకు ముందు 15 ఏళ్ల నుంచి బ్రిటన్‌లో మాస్టర్స్ విద్యను అభ్యసించేందుకు వెళ్లిన బోథ్ పరిసర ప్రాంతాల యువకులు అక్కడే ఉద్యోగాలు సంపాదించి స్థిరపడటమే. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ దాకా వేలాది మంది యూకేకు వెళ్లి స్థిరపడ్డారు. 1990 దశకం మొదట్లో మొదలైన వలసలు పదేళ్లపాటు సాగాయి. అధ్యాపకులు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఎంబీఏ గ్రాడ్యుయేట్లు ఇలా వేలాది మందికి బ్రిటన్ ఆశ్రయం ఇచ్చింది. తర్వాత ఐదేళ్లు కూడా వేలాది మంది తెలుగు విద్యార్థులు మాస్టర్స్ డిగ్రీ కోసం యూకే బాటపట్టారు. కానీ అందులో 80 శాతం మందిని ఆ దేశం వెనక్కి పంపింది. చదువుకోవడానికి కాకుండా ఉద్యోగాల కోసమే వస్తున్నారన్న విషయాన్ని గ్రహించిన బ్రిటన్ 2005లో తన పాలసీని సమీక్షించి వలసవాద విధానాలను కట్టుదిట్టం చేసింది. ఫలితంగా గత 13 ఏళ్లలో యూకే వెళ్లి మాస్టర్స్ చేసిన వారి సంఖ్య వందల్లోకి వచ్చింది.

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్న తెలుగు వారి సంఖ్య సుమారుగా..

కాలవ్యవధి	బ్రిటన్	అమెరికా/కెనడా	ఆస్ట్రేలియా	మలేషియా
1980-89	45,980	29,700	12,300	-
1990-99	1,63,000	91,500	15,400	3,500
2000-09	2,18,000	1,88,000	35,000	19,000
2010-18 (జనవరి 31)	30,300	3,65,000	1,73,000	35,000

2005 నుంచి అమెరికా వైపు..

తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన రవికుమార్ యూకే వెళ్లడం వల్ల ఫలితం లేదని గ్రహించి 2005లో ఇంజనీరింగ్‌లో పీజీ చేయడానికి అమెరికా వెళ్లారు. ఎంఎస్ చేసి ఉద్యోగంలో స్థిరపడ్డారు. రవికుమార్‌ను ఆదర్శంగా తీసుకుని అమలాపురం, పరిసర ప్రాంతాలకు చెందిన 5,000 మంది అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. తర్వాత కె.సతీష్ కుమార్ అతని ఆరుగురు ఇంజనీరింగ్ స్నేహితులు అమెరికాలో ఎంఎస్ డిగ్రీ కోసం 2016 ఆగస్టులో టెక్సాస్‌కు వెళ్లారు. అయితే డల్లాస్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు వీరిని విచారించి.. వారు చేరబోయే విశ్వవిద్యాలయాలకు అనుమతి లేదంటూ తిప్పిపంపారు. దీంతో అమెరికా వెళ్లాలనుకున్న విద్యార్థుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. 15 ఏళ్ల పాటు అమెరికాలో విద్య కోసం వెళ్లిన వారికి అక్కడి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. యూకేలో విధానాలు కట్టుదిట్టం కావడంతో 2001–2002 నుంచే ఉన్నత విద్య కోసం అమెరికాకు వలసలు పెరిగాయి. 2002లో 15,550 మంది అమెరికా వెళ్తే 2015లో ఆ సంఖ్య 2.25 లక్షలకు పెరిగింది. అంటే 15 ఏళ్లలో 15 రెట్లు పెరిగింది. ఇందులో తెలుగు విద్యార్థుల సంఖ్య దాదాపు 40 శాతం. ఈ నేపథ్యంలో భారతీయ నిపుణుల వల్ల అమెరికాలో నిరు ద్యోగం ఎక్కువైందన్న ప్రచారం సాగడంతో 2016 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ 'బయ్ అమెరికన్–హైర్ అమెరికన్' నినాదంతో అనూహ్యంగా ఆ దేశానికి అధ్యక్షుడయ్యారు. అప్పటి నుంచి వలసవాద విధానాన్ని కఠినతరం చేసేందుకు అనేక ప్రతిపాదనలు తీసుకొచ్చారు. దీంతో గత రెండేళ్లలో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిం చాలనుకునే వారి సంఖ్య 40 శాతం తగ్గింది.

రారమ్మంటున్న ఇతర దేశాలు..

మహమ్మద్ షబ్బీర్ హైదరాబాద్ వాసి. ఇక్కడ ఇంజనీరింగ్ చదివి 2014లో ఆస్ట్రేలియా వెళ్లి ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడ్డారు. తర్వాత మూడేళ్లలో తన సోదరులతో పాటు సమీప బంధువులు 10 మందిని తీసుకు వెళ్లారు. ఇప్పుడు వారిలో అత్యధికులు శాశ్వత నివాస హోదా పొందారు. ఇలా తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది చూపు ఆస్ట్రేలియాపై పడింది. యూఎస్ తన విధానాలను కఠినతరం చేస్తున్నట్లు ప్రచారం కావడంతోనే ఆస్ట్రేలియా వెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2015లో ఉన్నత విద్య కోసం 6,500 మంది ఆస్ట్రేలియా వెళితే 2017 సెప్టెంబర్ వచ్చేసరికి ఆ సంఖ్య 39,000కు పెరిగింది. సెప్టెంబర్‌లో మొదలయ్యే విద్యా సంవత్సరానికి వెళ్లే వారి 50,000 దాటుతుందని విద్యా కన్సల్టెన్సీలు చెపుతున్నాయి. విద్యార్థులు న్యూజిలాండ్, కెనడా, మలేషియాలకూ క్యూ కడుతున్నారు. అమెరికాలా కెనడా ఆంక్షలు పెట్టలేదు. అమెరికాతో పోలిస్తే కెనడాలో తక్కువ కాలంలోనే శాశ్వత నివాస హోదా దక్కుతోంది.

ప్రతిభావంతుల చాయిస్.. యూఎస్

'జీఆర్‌ఈ, టోఫెల్‌లో మంచి స్కోర్ రావడంతో పాటు తమ మీద తమకు నమ్మకం ఉన్నవారు ఇప్పటికీ అమెరికాకే మొదటి ప్రాధాన్యత ఇస్తు న్నారు. ఏదో ఒక ఉద్యోగం ముఖ్యం అనుకునే వారే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, మలేషియా వంటి దేశాలకు వెళుతున్నారు. వారి సంఖ్య ఈ రెండేళ్లలో 150 శాతం పెరిగింది. అదే సమయంలో అమెరికా వెళ్లాలనుకునే వారి సంఖ్య బాగా తగ్గింది. రెండేళ్ల క్రితం వరకు మా దగ్గరకు సలహా కోసం వచ్చిన వారిలో 90 శాతం మంది అమెరికానే కోరుకునే వారు. ఇప్పుడు వారి సంఖ్య 50 శాతానికి తగ్గింది' అని అమీర్‌పేటలో గత నాలుగు దశాబ్దాలుగా విదేశీ విద్య కన్సల్టెన్సీ సర్వీసు నడుపుతున్న నాగేశ్వరరెడ్డి చెప్పారు. 'అమెరికాకు వెళ్లే విద్యార్థులు తగ్గినా 320–325 జీఆర్‌ఈ స్కోర్ వచ్చినా అక్కడి టాప్ రేటెడ్ విశ్వవిద్యా లయా ల్లో సీట్లు దక్కడం లేదు. 2010–2014 మధ్య 305–310 స్కోరు వస్తే టాప్ 50 విశ్వవిద్యాలయాల్లో సీట్లు వచ్చేవి. ఇప్పుడు అదే వర్సిటీల్లో 320–325 వచ్చినా సీట్లు లేదు. విద్యార్థులు ఆస్ట్రేలియా, కెనడా వెళ్లడానికి ఇది కూడా ఒక కారణం' అని విశ్లేషించారు.

మంచినీటికి కటకటే!



కృష్ణా ప్రాజెక్టుల్లో వేగంగా తగ్గిపోతున్న జల మట్టాలు

- మరో వారంలో శ్రీశైలం ఖాళీ అయ్యే అవకాశం
- ప్రస్తుతం రోజుకు 2 టీఎంసీల నీటి వినియోగం
- ఆరేడు రోజుల్లోనే 800 అడుగులకు నిల్వలు
- అటు నాగార్జునసాగర్‌లోనూ ఇదే పరిస్థితి
- 510 అడుగుల ఎగువన ఉన్నది 22 టీఎంసీలే
- కనీస మట్టాలకు దిగువన తోడుకునేందుకు ఏపీ ఒత్తిళ్లు
- అది సరికాదంటూ విభేదిస్తున్న తెలంగాణ
- కనీస మట్టాలకు తగ్గితే హైదరాబాద్, నల్లగొండలకు తప్పని గోస

సాక్షి, హైదరాబాద్: సాగునీరే కాదు.. తాగునీటికీ కటకట మొదలవుతోంది.. వేసవి పూర్తి స్థాయిలో మొదలవకముందే నీటి కొరత ముంచుకొస్తోంది. కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలంలో కనీస నీటి మట్టాల కంటే దిగువన నీటిని తోడేస్తుండగా.. సాగర్‌లో నీటి నిల్వలు కనీస మట్టానికి చేరుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇరు రాష్ట్రాలకు ఆగస్టు వరకు తాగు, సాగు అవసరాలకు ఈ నీరే దిక్కుకావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నీటిని ఎలా సర్దుబాటు చేసుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది.

శ్రీశైలం ఖాళీకి మరో వారమే..!

కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వేగంగా ఖాళీ అవుతోంది. ఇక్కడ ప్రతిరోజు 24 వేల క్యూసెక్కుల (రోజుకి 2 టీఎంసీల) చొప్పున నీటిని ఆంధ్రప్రదేశ్ తోడేస్తోంది. దాంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో 823.2 అడుగుల వద్ద 43.34 టీఎంసీల మేర నిల్వలున్నాయి. వాస్తవానికి శ్రీశైలం కనీస నీటిమట్టం 834 అడుగులు కాగా.. వారం కిందటి నుంచే దిగువకి వెళ్లి తోడేస్తున్నారు. ఇదే మాదిరి రోజుకు 2 టీఎంసీల చొప్పున తీసుకుంటే.. ప్రస్తుతం 800 అడుగుల మట్టానికి ఎగువన ఉన్న 14.36 టీఎంసీల నీరు వారంలో ఖాళీ అవుతుంది. ఆ తర్వాత శ్రీశైలం నుంచి చుక్క నీరు కూడా తీసుకునేందుకు వీలుండదు. అంటే ఇక పూర్తిగా నాగార్జున సాగర్‌లో లభ్యత జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది.

సాగర్ నీటిపై ఊగిసలాట

ప్రస్తుతం సాగర్‌లో 522.7 అడుగుల వద్ద 154.25 టీఎంసీల నీటి లభ్యత ఉంది. ఇందులో కనీస నీటి మట్టం 510 అడుగులకు ఎగువన వినియోగార్హమైన నీళ్లు 22.58 టీఎంసీలు మాత్రమే. ప్రస్తుతం ఇరు రాష్ట్రాలు కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటి అవసరాల కోసం 15 వేల క్యూసెక్కుల మేర నీటిని తీసుకుంటున్నాయి. ఇదిలాగే కొనసాగితే నెలాఖరు నాటికి సాగర్‌లో నీటి నిల్వలు కనీస మట్టాలకు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సాగర్‌లో ప్రస్తుతం ఎడమ కాల్వ కింద జోన్–1, జోన్–2కు సంబంధించి ఈ నెలలో మరో 10 టీఎంసీలు, ఏప్రిల్‌లో ఆరు టీఎంసీల వరకు సాగునీటి అవసరాలు ఉంటాయని అంచనా. ఈ లెక్కన సాగర్‌లో నీటిమట్టం కనీసం 515 అడుగుల వరకైనా లేకుంటే నీటి విడుదలలో సాంకేతిక ఇబ్బందులు తప్పవు. మరోవైపు హైదరాబాద్, నల్లగొండ జిల్లాల తాగునీటి అవసరాలు తీరాలంటే కనీసం 510 అడుగుల నీటిమట్టం తప్పనిసరి. దీంతో మే నెలాఖరు వరకు సాగర్‌లో కనీస నీటి మట్టాలు ఉండేలా చూడాలని తెలంగాణ పట్టుబడుతోంది. కానీ ఆంధ్రప్రదేశ్, కృష్ణా బోర్డులు మాత్రం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటం ఆందోళనకరంగా మారింది.

కనీస మట్టాలకు దిగువన నీటిపై కన్ను

ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటినే ఆగస్టు నెలాఖరు వరకు సర్దుకోవాల్సిన పరిస్థితుల్లో.. కనీస నీటి మట్టాల కంటే దిగువకు వెళ్లి నీటిని తోడుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. సాగర్‌లో కనీసమట్టాలకు దిగువన 500 అడుగుల వరకు నీటిని తీసుకునేందుకు బోర్డు ఏపీ ఇప్పటికే ఒత్తిడి తెస్తోంది. 510 అడుగుల నుంచి 500 అడుగుల మధ్య 16.36 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉంటుందని, 510 అడుగుల ఎగువన ఉన్న లభ్యత జలాలు 22.58 టీఎంసీలు కలిపితే... మొత్తం 38.94 టీఎంసీలతో ఇరు రాష్ట్రాల అవసరాలు తీరుతాయని చెబుతోంది. దీనిపై తెలంగాణ తరపున తీవ్ర అభ్యంతరం చెబుతూ సీఎస్ ఎస్కే జోషి ఇటీవల బోర్డుకు లేఖ రాశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మే నెలాఖరు వరకు 510 అడుగుల మట్టం కన్నా దిగువకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. కానీ బోర్డు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ముందున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని.. హైదరాబాద్, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బోర్డు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముందని నీటి పారుదల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

23 వరకు డీఎల్ఎడ్ పరీక్ష ఫీజు పెంపు

సాక్షి, హైదరాబాద్: డీఎల్ఎడ్ కోర్సు పరీక్ష ఫీజు గడువును మార్చ్ 23 వరకు పెంచినట్లు ప్రాంతీయ సంచాలకులు ఆర్.అనిల్ కుమార్ వెల్లడించారు. ఆలస్య రుసుముతో ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, ఫీజు చెల్లించే అభ్యర్థులు www.dled.nios.ac.in వెబ్‌సైట్‌లో వివరాలను చూడాలని ఒక ప్రకటనలో తెలిపారు.

దేవుడా నువ్వే దిక్కు: వికలాంగులు

సాక్షి. హైదరాబాద్: నీరవ్‌మోదీ కుంభకోణం చిరు వికలాంగుల ఉద్యోగులను రోడ్డు పాలు చేసింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న గీతాంజలి జేమ్స్ జ్యువెల్లరీ కంపెనీలో 600 మంది ఉద్యోగుల్లో 200 మంది వికలాంగులు పని చేస్తున్నారు. ఆ కంపెనీని అధికారులు సీజ్ చేయడంతో వారంతా రోడ్డున పడ్డారు. దీంతో తమ బాధ ప్రభుత్వానికి చెప్పుకుందామని శుక్రవారం ప్రగతి భవన్‌కు వెళ్లిన వికలాంగులకు అక్కడి అధికారులు సచివాలయానికి వెళ్లాలని సూచించారు. అక్కడా ఫలితం లేకపోవడంతో గేటు దగ్గర ఉన్న అధికారులకు వినతిపత్రం సమర్పించి, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. పెద్దలు చేసిన తప్పులకు చిరు ఉద్యోగులం రోడ్డుపాలయ్యాం దేవుడా.. నువ్వే దిక్కంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఏప్రిల్ 29న యాదవ కృతజ్ఞత సభ

ఏర్పాటు చేయనున్న రాజ్యసభ అభ్యర్థి లింగయ్య

సాక్షి, హైదరాబాద్: 'యాదవుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, వినూత్న పథకాలు ప్రవేశపెడుతున్న ఏకైక సీఎం కేసీఆర్' అని టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థి బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపేందుకు ఏప్రిల్ 29న జింఖాన గ్రౌండ్‌లో 'యాదవ కృతజ్ఞత సభ' ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం టీఆర్ఎస్, యాదవ సంఘ నాయకులు లింగయ్యను కలసి అభినందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ..'బడుగు, బల హీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను. యాదవుల కోసం కోకాపేటలో పదెకరాల స్థలంలో రూ.10 కోట్లతో యాదవ భవన్ ఏర్పాటు కానుంది. సబ్సిడీ గొర్రెల పంపిణీతో గొల్లకురుమలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయం' అన్నారు.

22న బీసీ కుల సంఘాల సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు ప్రత్యేక నిధి అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం.. చివరకు అత్తెసరు నిధులు కేటాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న నగరంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

టీఎస్ఐపార్డ్ ఇక టీఎస్ఐఆర్‌డీ

సాక్షి, హైదరాబాద్: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ – తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ ఆండ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీడీఎస్–టీఎస్ఐపార్డ్) పేరు 'తెలంగాణ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీఎస్ఐఆర్‌డీ)' గా మారింది. ఈ మేరకు పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ కమిషన్‌పై నిర్లక్ష్యం

గవర్నర్‌తో ఎస్సీ కమిషన్ చైర్మన్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ కమిషన్ నిర్లక్ష్యానికి గురైందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తోపాటు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ ఏర్పాటైన తర్వాత గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశామని శ్రీనివాస్ చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీలకు అందేలా చూసే బాధ్యత కమిషన్‌పై ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ఎస్సీ కమిషన్‌కు జీవం పోస్తామని తెలిపారు. కమిషన్‌కు వెబ్‌సైట్ ఏర్పాటు చేసి, ప్రతి అంశం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. నిధులు సక్రమంగా ఖర్చు చేయడానికి విజిలెన్స్ కమిటీలనూ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త పద్ధతుల్లో నిధులను, సంక్షేమ పథకాలను కింది స్థాయి వరకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై భరోసా కల్పిస్తామన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సభ్యులు చిలకమారి నర్సింహ, దేవయ్య ఉన్నారు.

విమానంలో ప్రయాణికుడు మృతి

అత్యవసరంగా ల్యాండైన ఎమిరేట్స్ విమానం..

శంషాబాద్: ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ విమానంలో తీవ్ర అస్వస్థతతో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈకే372 విమానం దుబాయ్ నుంచి బ్యాంకాక్‌కు బయలుదేరింది. మార్గంమధ్యలో సూడాన్‌కు చెందిన మహ్మద్ అలీ(55) అనే ప్రయాణికుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం అతన్ని విమానాశ్రయ ప్రాంగణంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అలీ విమానంలోనే మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. సుమారు మూడు గంటల తర్వాత విమానం తిరిగి బయలుదేరింది.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'శ్రీ చైతన్య'

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 100 మందికి పైగా శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఒకేసారి చోటు సంపాదించి రికార్డు సృష్టించారు. వీరంతా ఐదేళ్లలోపు వారు కావడం విశేషం. చిన్నారులు వందరోజుల శిక్షణతోనే వరుసగా 100 దేశాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు, మ్యాప్‌లో 100 దేశాలను గుర్తించి ఈ ఘనత సాధించారు. ఈ పోటీలని శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చెన్నైతో పాటు బెంగళూరులోని శ్రీ చైతన్య స్కూల్ క్యాంపస్‌లలో నిర్వహించి సాయంత్రం ఫలితాలను ప్రకటించారు. పోటీకి విచ్చేసిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జడ్జి రాజేందర్ లుత్రా మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన చిన్నారులకు తమ బుక్‌లో స్థానం కల్పించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఇంతటి విజయానికి శ్రీ చైతన్య స్కూల్–స్టార్ మేవరిక్స్ ఎర్లీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామే కారణమని సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీమ పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తెలుగు రాష్ట్రాల్లోని శ్రీ చైతన్య స్కూళ్లలో ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విజయం సాధించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయ సిబ్బందికి సంస్థ చైర్మన్ బియస్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్‌టీఎస్ఈ ఫలితాల్లో నారాయణ హవా

సాక్షి, హైదరాబాద్: యూనిఫైడ్ కౌన్సిల్ ఏటా నిర్వహించే నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎన్ఎస్‌టీఎస్ఈ)లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో 1,4,5,6,7,8,10 ర్యాంకులతో టాప్–10లోపు 29 ర్యాంకులు దక్కించుకున్నారు. 50లోపు 189 ర్యాంకులు, 100లోపు 387 ర్యాంకులు సాధించారు. 2,4,7 తరగతుల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు తమ విద్యార్థులే సాధించారని సంస్థ ఎండీ పి.సింధూర నారాయణ తెలిపారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్వహించే ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థులు రాశారని వెల్లడించారు. స్కూల్ స్థాయిలో నిర్వహించే ఏ పోటీ పరీక్షలోనైనా తమ విద్యార్థులదే విజయమని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందించారు.

వచ్చే నెలలో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో దూరవిద్య ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షలను వచ్చేనెల 17వ తేదీ నుంచి మే 1వ తేదీవరకు నిర్వహించనున్నట్లు సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 8:30 గంటల నుంచి 11:30 గంటల వరకు ఉంటాయిని పేర్కొంది. మే 1వ తేదీన అన్ని వొకేషనల్ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామని వివరించింది. వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని వెల్లడించింది.

సీపీఎస్ రద్దుపై సీఎంకు బహిరంగ లేఖలు

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదేనని పేర్కొంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుక్రవారం బహిరంగ లేఖలు రాసినట్లు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగులు రాసిన లేఖలను జిల్లా కలెక్టర్లకు అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో తాము ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి అందజేసినట్లు వెల్లడించారు. సీపీఎస్ రద్దు అంశం కేంద్ర పరిధిలోనిదని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటనపై ఈ లేఖలు రాసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని లక్షల మంది ఉద్యోగుల కోసం కృషి చేయాలని కోరారు.

భూమికి మరో ముప్పు!



1,600 అడుగుల సైజున్న భారీ గ్రహశకలం.. వేల కిలోమీటర్ల వేగంతో భూమివైపు దూసుకొస్తోంది

భూమివైపు దూసుకొస్తున్న భారీ గ్రహశకలంపేరు బెన్నూ.. ఇది వంద అంతస్తుల భవనం కన్నా ఎక్కువ సైజు ఉంటుందని అంచనా. 2135లో భూమిని ఢీకొడుతుందని నాసా ఆధ్వర్యంలో పనిచేస్తున్న నియర్ ఎర్త్ ఆబెక్ట్స్ (నియో) చెబుతోంది. ఇంత భారీ సైజున్న గ్రహశకలం భూమివైపు రావడం చాలా అరుదు. సుమారు 6 కోట్ల ఏళ్ల కింద రాక్షసబల్లులను అంతమొందించింది ఇలాంటి భారీ గ్రహశకలమే. అందుకే బెన్నూ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు శాస్త్రవేత్తలు. దీని బరువు దాదాపు 7,900 కోట్ల కిలోలు. ఇది గనుక భూమిని ఢీకొంటే మనిషి అన్నవాడు ఉండబోడని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

అంతరిక్షంలో కొన్ని చోట్ల భారీ సంఖ్యలో గ్రహశకలాలు ఉంటాయన్న విషయం తెలిసిందే. కక్ష్య నుంచి బయటపడి ఇష్టారీతిగా తిరిగే కొన్ని గ్రహశకలాలు వేల కిలోమీటర్ల వేగంతో భూమివైపు దూసుకొస్తుంటాయి. వీటిల్లో చాలా తక్కువ మాత్రమే భూమిని ఢీకొడతాయి. నియో అంచనా ప్రకారం 2135 సెప్టెంబర్ 25న బెన్నూ భూమిని ఢీకొట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో బెన్నూను ఎదుర్కొనేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రణాళికలు రచిస్తోంది.

2135 డెడ్‌లైన్..

ప్రత్యేకంగా రూపొందించిన అంతరిక్ష నౌకతో బెన్నూను ఢీకొట్టించాలని.. దీంతో అది దారితప్పి ముప్పు నుంచి భూమి బయటపడుతుందని అంచనా. అయితే అంతరిక్ష నౌకతో ఢీకొట్టించడం కన్నా అణుబాంబుతో గ్రహశకలాన్ని పేల్చేయడం మేలని కొంతమంది శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. బోలెడన్ని అంతరిక్ష నౌకలను గ్రహశకలం వైపు పంపితే.. ఒక్కోదాన్ని ఢీకొన్నప్పుడల్లా బెన్నూ వేగం తగ్గుతూ వస్తుందని మరికొందరు ప్రతిపాదిస్తున్నారు. గ్రహశకలం చిన్నదైతే ఢీకొట్టేందుకు చాలా సమయం ఉందని తెలిస్తే దాన్ని ఎదుర్కొనేందుకు మొదటి పద్ధతి సరిపోతుందని లారెన్స్ లివర్‌మూర్ నేషనల్ లేబొరేటరీకి చెందిన డేవిడ్ డియర్‌బార్న్ అంటున్నారు. అయితే అణుబాంబులతో పేల్చేయడం మేలైన పని అని ఓ తాజా అధ్యయనంలో తేలింది.

8 టన్నుల హ్యామర్..

బెన్నూను అణుబాంబులతో పేల్చేసేందుకు అమెరికాకు చెందిన నేషనల్ న్యూక్లియర్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ సంస్థ (ఎన్ఎన్ఎస్ఏ) అంతరిక్ష నౌకను సిద్ధం చేస్తోంది. హైపర్ వెలాసిటీ ఆస్టరాయిడ్ మిటిగేషన్ మిషన్ ఫర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ (హ్యామర్) అని పిలుస్తున్న ఈ అంతరిక్ష నౌక దాదాపు 8.8 టన్నుల బరువు ఉంటుంది. దీన్ని రెండు రకాలుగా వాడుకోవచ్చు. అధిక వేగంతో ప్రయాణిస్తూ బెన్నూను ఢీకొనడం ఒక పద్ధతి. లేదంటే అణుబాంబులను మోసుకెళ్లి ఆ గ్రహశకలంపై వాటిని పేల్చేయడం రెండో పద్ధతి. మొదటి పద్ధతిని పాటిస్తే ఎంత శక్తి పుడుతుందో తెలుసా? హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కంటే 80 వేల రెట్లు ఎక్కువ. ఈ భారీ శక్తి కాస్తా గ్రహశకలం దారిని మార్చేస్తుందని, తద్వారా అది భూమికి దూరంగా జరుగుతుందని శాస్త్రవేత్తల అంచనా. అయితే గంటకు లక్ష కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న బెన్నూను దారి మళ్లించేందుకు ఇది సరిపోదని.. అణుబాంబులతో ముక్కలు చేయడమే కరెక్ట్ అని ఎన్ఎన్ఎస్ఏ శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్నారు.

– సాక్షి హైదరాబాద్

మార్చిలోనే అల్పపీడనం!

అరేబియా సముద్రంలో అరుదైన వాతావరణం.. 125 ఏళ్లలో ఇదే తొలిసారి

ఈ ఏడాది వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అరేబియా సముద్రం మీదుగా అరుదైన వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకా ఎండలు ముదరకుండానే, మార్చిలోనే అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ముంబైలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణంగా అరేబియా సముద్రంలో ఏప్రిల్, మే నెలల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. కానీ ఈ సారి మార్చిలోనే ఇలా జరగడం అత్యంత అరుదైన విషయమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 125 సంవత్సరాల్లో ఈ తరహా వాతావరణాన్ని చూడటం ఇదే తొలిసారని అంటున్నారు. 1891 నుంచి అరేబియా సముద్రంలో వాతావరణానికి సంబంధించిన రికార్డుల్ని పరిశీలిస్తే మార్చిలో అల్పపీడనం ఏర్పడటం ఇదే మొదటిసారని తేల్చి చెప్పారు. దీని ప్రభావంతో తమిళనాడు, కేరళలలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలోనూ దీని ప్రభావం కన్పిస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటకలో ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయన్న అంచనాలున్నాయి. కొంకణ్, సెంట్రల్ మహారాష్ట్ర, విదర్భ, మరఠ్వాడా ప్రాంతాల్లో వడగళ్ల వానలు కూడా కురిసే అవకాశముంది. ఈ అల్పపీడనం కారణంగా వీస్తున్న బలమైన గాలులు లక్షద్వీప్, కేరళను చుట్టుముట్టాయి. గంటకు 55 కి.మీ.వేగంతో గాలులు వీస్తున్నాయి. మరో రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ముంబై, పుణే, నాసిక్‌లలో ఇప్పటికే చిరు జల్లులు కురుస్తున్నాయి. కానీ రైతన్నలకు ఈ వాతా వరణ పరిస్థితులు దడపుట్టిస్తున్నాయి. రబీ సమయంలో వాతావరణంలో ఇలాంటి మార్పులు, అకాలవర్షాల వల్ల ఎంత నష్టం వాటిల్లుతుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి.

(సాక్షి నాలెడ్జ్ సెంటర్)

ఎందుకీ పరిస్థితి?

హిందూ మహాసముద్రంలో భూమధ్య రేఖకు సమీపంలో మార్చి 10న ఏర్పడిన అతి తక్కువ స్థాయి అల్పపీడనం అరేబియా సముద్రం వైపునకు వచ్చి అల్పపీడనంగా మారింది. అది గంటకు 20 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ లక్షద్వీప్ వద్ద బలహీనపడింది. ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉన్నప్పుడు సముద్ర ఉపరితలం వేడెక్కి, సముద్ర జలాలు ఆవిరిగా మారి అల్పపీడనాలు ఏర్పడుతూ ఉంటాయి. గత దశాబ్ద కాలంలో భూమధ్య రేఖకు సమీపంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోయి హిందూ మహాసముద్రం ఉపరితలజలాలు అసాధారణ స్థాయిలో వేడెక్కిపోవడం మొదలైంది. దాని ప్రభావం అరేబియా సముద్రం వైపు మళ్లిందని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా గ్లోబల్ వార్మింగ్ పరిస్థితుల కారణంగా కాలం కాని కాలంలో అల్పపీడనాలు, తుపానులు ఏర్పడుతున్నాయి. సాధారణంగా బంగాళాఖాతంతో పోల్చి చూస్తే అరేబియా సముద్రంలో అల్పపీడనాలు తక్కువగానే ఏర్పడతాయి. కానీ గత నాలుగేళ్లుగా అరేబియా సముద్రంలో అల్పపీడనాలు, తుపానులు ఎక్కువైపోతున్నాయి. ఈ సముద్ర తీర ప్రాంతంలో మానవ కార్యకలాపాలు పెరిగిపోవడం, పారిశ్రామిక వాడలు ఎక్కువైపోవడం వల్ల కూడా వాతావరణంలో అనూహ్యమార్పులు చోటు చేసుకుంటున్నాయని తాజా సర్వేలు చెబుతున్నాయి.

నేడు పలుచోట్ల తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఆగ్నేయ అరేబియా సముద్రం నుంచి తేమతో కూడిన గాలులతో పాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల నుంచి రాష్ట్రం మీదుగా విస్తరించిన ఉపరితల ద్రోణి కారణంగా శనివారం పలుచోట్ల ఉరుములు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరికొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. గత 24 గంటల్లో పగటి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పట్టగా, రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే ఐదు డిగ్రీలు అధికంగా నమోదు కావడం గమనార్హం.కాగా, మహబూబ్‌నగర్‌లో ఐదు డిగ్రీలు అధికంగా 27 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత రికార్డు అయింది. ఖమ్మంలో 27, రామగుండంలో 26, నిజామాబాద్, హైదరాబాద్‌ల్లో 25 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హస్తినలో హోదాగ్ని

▶ మొదటి పేజీ తరువాయి

ఈ అంశంపై చర్చ మొదలైంది. శుక్రవారం రోజంతా జాతీయ మీడియా కథనాలు ప్రసారం చేశాయి. వివిధ జాతీయ పార్టీల నేతలతో చర్చా కార్యక్రమాలు నిర్వహించాయి. గడిచిన నాలుగేళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం తీరును ప్రధానంగా ప్రస్తావించాయి.

మళ్లీ నోటీసులు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ

సభ సజావుగా లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సభ్యుల బలాన్ని లెక్కించలేక పోతున్నానని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం మరో నోటీసును లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు అందజేశారు. ''లోక్‌సభ కార్యకలాపాల నియమావళిలోని చాప్టర్ 17లోని 198(బి) నిబంధన కింద నేను ఈ కింది తీర్మానాన్ని 19 మార్చి 2018న ప్రవేశపెట్టేందుకు నోటీసు ఇస్తున్నాను. ఈ తీర్మానాన్ని 19 మార్చి 2018 నాటి సభా కార్యకలాపాల జాబితాలో చేర్చాలని అభ్యర్థిస్తున్నాను. తీర్మానం: 'మంత్రి మండలిపై ఈ సభ అవిశ్వాసాన్ని వ్యక్తపరుస్తోంది' అని నోటీసులో పేర్కొన్నారు. ఇదే రీతిలో టీడీపీ ఎంపీ తోట నరసింహం కూడా నోటీసును అందజేశారు. సోమవారం నాటి జాబితాలో చేర్చాలని కోరారు.

మాపై ప్రజలకు నమ్మకం ఉంది

శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వైఎస్ అవినాశ్‌రెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'చంద్రబాబుకు విశ్వసనీయత లేదు. మేం లాలూచీ పడ్డామని అంటారు. ఆయన 16 కేసుల్లో స్టే తెచ్చుకున్నారు. ఇక్కడ ఎవ్వరికీ రాజకీయ పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదు. అవిశ్వాసానికి మేం అన్ని పార్టీల నుంచి మద్దతు కోరాం. వామపక్షాలు ఇప్పటికే మద్దతు తెలిపాయి. వారికి ధన్యవాదాలు చెబుతున్నాం. ఏపీకి అన్యాయం జరిగిందని భావించినవారు మాకు మద్దతు తెలుపుతారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ సీపీపై నమ్మకం లేకే తాము అవిశ్వాస తీర్మానం పెడుతున్నామని టీడీపీ చేసిన ప్రకటనపై స్పందించారు. నమ్మకం ఉండాల్సింది టీడీపీ వాళ్లకు కాదని, ప్రజలకు ఉండాలని చెప్పారు. చిత్తశుద్ధితో నాలుగేళ్లుగా పోరాడుతున్నది ఎవరో ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు తమను నమ్ముతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని, అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలని గురువారం నాడు టీడీపీని అభ్యర్థించామని, అప్పుడు మద్దతిస్తామని చెప్పారని, శుక్రవారం నాడు మాట మార్చి వాళ్లే అవిశ్వాసం పెడతామన్నారని చెప్పారు. అసలు మంత్రులు రాజీనామా చేసినప్పుడే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి అవిశ్వాసం పెట్టి ఉండవచ్చు కదా అని వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమితో వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని భావించి, రాష్ట్రంలో టీడీపీపై ఉన్న ప్రజావ్యతిరేకతను బీజేపీ వైపు నెట్టే కార్యక్రమంలో భాగంగా ఈ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇంతచేసినా కేంద్రం దిగిరాకపోతే పార్లమెంటు సమావేశాల చివరి రోజు రాజీనామా చేస్తామని పునరుద్ఘాటించారు. ఎంపీ వరప్రసాదరావు మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లుగా తాము చేసిన పోరాటాలతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, అది గ్రహించి ఇప్పుడు ప్రజాగ్రహాన్నుంచి తప్పించుకునేందుకు చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారు.

ప్యాకేజీకి టీడీపీ ఎందుకు అంగీకరించినట్లో: బీజేపీ

ఎన్డీఏ నుంచి తాము వైదొలుగుతున్నట్టు టీడీపీ ప్రకటించగానే బీజేపీ ఆ పార్టీపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టింది. 2016లో ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి ఇప్పుడు టీడీపీ యూటర్న్ తీసుకుందని ఆపార్టీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం నాటకాలు ఆడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత ఖర్గే మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని తాము మొదటి నుంచీ చెబుతున్నామని, తమ నాయకురాలు సోనియాగాంధీ ఈమేరకు ప్రధానికి లేఖ రాశారని చెప్పారు. సభ పూర్తిగా సజావుగా లేని సందర్భంలో ఆర్థిక బిల్లును ఆమోదించుకున్న ప్రభుత్వం.. కేవలం రెండు పార్టీలు వెల్‌లో ఉన్నప్పుడు సభ సజావుగా లేదంటూ అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనలేకపోయిందని కాంగ్రెస్ ఎంపీలు వీరప్పమొయిలీ, శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'ప్రభుత్వం ఎందుకు భయపడిందో అర్థం కావడం లేదు. సంఖ్యాబలం ఉన్నా అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనలేకపోయింది. ప్రత్యేక హోదా అంశాన్ని చర్చకు కూడా రానివ్వడానికి భయపడింది' అని వారు వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా డిమాండ్‌కు మద్దతుగా, అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తూ పలు పార్టీల నేతలు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేశారు.

మీతో కలిసి ఉండలేం

అమిత్‌షాకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: విభజన చట్టంలోని హామీలు అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని, అందుకే ఎన్డీఏ నుంచి వైదొలుగుతున్నామని సీఎం చంద్రబాబు.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చంద్రబాబు నాలుగు పేజీల లేఖ రాశారు. బీజేపీ, టీడీపీ కలిసి ఎన్నికలకు వెళ్లాయని, ఆ ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చామని, వాటిని ఇప్పుడు నెరవేర్చక పోవడం బాధాకరమన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల్లో చెప్పామని, రాజ్యసభ సాక్షిగా కొన్ని హామీలను నెరవేర్చేందుకు ఒప్పుకున్నారని అందులో పేర్కొన్నారు. కానీ ఇటీవల కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడిన తీరు బాధ కలిగించిందని అందుకే కూటమి నుంచి వైదొలుగుతున్నామని తెలిపారు. ప్రత్యేక హోదా వద్దన్నందుకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఎక్కువ సాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో కుదరదని చెబుతున్నారన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌ను విభజించడంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుకు ఏపీ ప్రజలు ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేశారని గుర్తు చేశారు. 29 సార్లు ఢిల్లీకి వచ్చి విభజన హామీల గురించి అడిగానని, అయినా స్పందన లేదని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వెల్లడించారు. మీతో కలిసి ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగదని ప్రజలు భావిస్తున్నారని, వారి సెంటిమెంట్ మేరకే మీతో విడిపోతున్నామని లేఖలో స్పష్టం చేశారు.

పైసా ఖర్చు లేకున్నా అసెంబ్లీ సీట్లు పెంచలేదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు హామీని అమలు చేసేందుకు ఒక్క పైసా ఖర్చు చేసే పని లేకున్నా కేంద్రం అది కూడా పట్టించుకోలేదని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. రాజకీయంగా టీడీపీ బలపడుతుందనే ఉద్దేశంతోనే సీట్లను పెంచలేదని ఆరోపించారు. శుక్రవారం బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ నుంచి వైదొలుగు తున్నట్టు ప్రకటించిన అనంతరం చంద్రబాబు శాసనమండలిలో మాట్లాడుతూ కేంద్రం, బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. నాలుగేళ్ల గడిచినా ఏ సమస్యా పరిష్కారం కాలేదని, హామీలన్నీ నీరుగార్చారని చెప్పారు. ఇది తన అసమర్థత కాదని, కేంద్రం ఇవ్వక పోవడమే దీనికి కారణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అడగకపోయినా కేంద్రమే అప్పగించిందని ప్రకటించారు.ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి అన్యాయం చేశారని పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు వల్ల గత ఎన్నికల్లో టీడీపీ తీవ్రంగా నష్టపోయిందని చెప్పారు. అంతకుముందు జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే టీడీపీకి 120కి పైగా అసెంబ్లీ సీట్లు రావాల్సి ఉండగా పొత్తుల వల్ల 106 స్థానాలకు పడిపోయిందన్నారు.

సభ సజావుగా లేదు

అందుకే అవిశ్వాస తీర్మానాన్ని తీసుకోలేకపోతున్నా.. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చాయని, అయితే సభ సజావుగా లేనందున తీర్మానాన్ని తీసుకోలేకపోతున్నానంటూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే యూపీ, బిహార్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎంపీలు బోళ్ల బులిరామయ్య సహా నలుగురికి సభ నివాళులు అర్పించింది. అనంతరం ప్రశ్నోత్తరాలు ప్రారంభిస్తున్నట్టు సభాపతి ప్రకటించగానే వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే తదితర పార్టీల సభ్యులు వెల్‌లోకి వెళ్లి విభిన్న అంశాలపై ఆందోళన చేపట్టారు. ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ నినదించగా, విభజన అంశాలపై టీడీపీ, రిజర్వేషన్ కోటా పెంపుపై టీఆర్ఎస్, కావేరి బోర్డు కోసం ఏఐఏడీఎంకేలు పట్టుపట్టాయి. దీంతో సభాపతి వెంటనే సభను వాయిదా వేశారు.

50 మంది సభ్యులను లెక్కించలేను..

సభ తిరిగి 12 గంటలకు ప్రారంభం కాగానే వివిధ విభాగాలకు సంబంధించిన పత్రాలను మంత్రులు, సభ్యులు సభలో ప్రవేశపెట్టారు. ఈ సమయంలో వెల్‌లో కేవలం టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే సభ్యులు మాత్రమే ఉన్నారు. ఈ సమయంలో సభాపతి తనకు వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ సభ్యుడు తోట నరసింహం నుంచి అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నోటీసులు వచ్చాయని ప్రకటించారు. అయితే సభ సజావుగా లేకపోవడంతో తీర్మానం తీసుకోలేకపోతున్నానన్నారు. 'గౌరవ సభ్యులారా.. కేంద్ర మంత్రి మండలిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం నాకు నోటీసు ఇచ్చారు. ఈ నోటీసులను సభ ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత నాపై ఉంది. అయితే సభ సజావుగా సాగనంతవరకు నేను 50 మంది సభ్యులను లెక్కించలేను. తీర్మానం ప్రవేశపెట్టేందుకు మద్దతుగా సభ్యులు తమకు కేటాయించిన స్థానాల్లో లేచి నిలబడాల్సి ఉంటుంది. తద్వారా నేను లెక్కించి తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వొచ్చా లేదా నిర్ణయించవచ్చు. మీరంతా మీ మీ స్థానాలకు వెళ్లండి.. ఐ ఆమ్ సారీ.. సభ ఆర్డర్‌లో లేనందున నోటీసును సభ ముందుకు తీసుకురాలేకపోతున్నాను' అని పేర్కొంటూ సభను సోమవారానికి వాయిదా వేశారు.

మద్దతుగా నిలబడిన పలు పార్టీల సభ్యులు

అవిశ్వాస తీర్మానానికి నోటీసులు వచ్చాయని సభాపతి ప్రకటిస్తున్న సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీలకు చెందిన సభ్యులతో పాటు విపక్షాలన్నీ తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన బలాన్ని ఇచ్చేందుకు వీలుగా లేచి నిలబడ్డాయి. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో పాటు ఆ పార్టీ ఎంపీలు, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు, సీపీఎం, ఎంఐఎం, సీపీఐ, ఆర్జేడీ, ఎన్సీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీల సభ్యులు లేచి నిలుచున్నారు. దాదాపు 90 నుంచి 100 మంది సభ్యులు ఈ సమయంలో మద్దతుతెలిపారు.

దలేర్ మెహందీకి రెండేళ్ల జైలు



పటియాలా: 2003లో జరిగిన 'ఇమ్మిగ్రేషన్ స్కాండల్' కేసులో పంజాబ్ పాప్ సింగర్ దలేర్ మెహందీని కోర్టు దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. శుక్రవారం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి దలేర్‌కు రూ.1,000 జరిమానా విధించారు. తర్వాత వ్యక్తిగత పూచీకత్తు మీద బెయిలుపై విడుదలయ్యారు. అమెరికాకు అక్రమంగా వెళ్లేందుకు సహాయం చేస్తామని చెప్పి దలేర్, షమ్షేర్ మెహందీ తమ వద్ద డబ్బు తీసుకుని మోసం చేశారని ఆరోపిస్తూ బక్షీష్ సింగ్ అనే వ్యక్తితోపాటు మరో 35 మంది ఫిర్యాదు చేశారు. 1998, 1999ల్లో రెండు బృందాలను అమెరికాకు తీసుకెళ్లిన మెహందీ సోదరులు అందులో 10 మందిని అక్కడే అక్రమంగా వదిలి వచ్చినట్లు ఆరోపణలున్నాయి. మరోసారి శాన్‌ఫ్రాన్సిస్కోలో ముగ్గురు అమ్మాయిలను వదిలి వచ్చినట్లు ఆరోపణలున్నాయి. 1999 అక్టోబర్‌లో సోదరులిద్దరూ కొందరు నటులతో వెళ్లి న్యూజెర్సీలో ముగ్గురిని అక్కడ వదిలి వచ్చారు.

విడాకులు కోరిన ట్రంప్ కోడలు



న్యూయార్క్: వరుస వివాదాలతో ఇబ్బందులు పడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబంలో కలకలం చెలరేగింది. ఆయన పెద్దకొడుకు ట్రంప్ జూనియర్ భార్య వనెస్సా హేడన్ ట్రంప్ (40).. తనకు తక్షణమే విడాకులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ మన్‌హట్టన్‌లోని కోర్టును ఆశ్రయించారు. జూనియర్ ట్రంప్ కుటుంబాన్ని అస్సలు పట్టించుకోవట్లేదని ఆరోపిస్తూ ఆమె పిటిషన్‌వేశారు. 2005 నవంబర్‌లో జూనియర్ ట్రంప్‌ను వనెస్సా పెళ్లాడారు. వీరికి ఐదుగురు సంతానం. చర్చించుకుని విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు భార్యాభర్తలిద్దరూ సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

కేజ్రీవాల్ క్షమాపణలు.. మన్ రాజీనామా

ఛండీగఢ్: శిరోమణి అకాలీదళ్ నేత, మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియాను ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ క్షమాపణలు కోరటం ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాల్లో ప్రకంపనలు రేపింది. కేజ్రీవాల్ చర్యకు నిరసనగా ఆ పార్టీ పంజాబ్ విభాగం అధ్యక్ష పదవికి భగవంత్ మన్ రాజీనామా చేశారు. 'పంజాబ్ ఆప్ అధ్యక్షుడిగా తప్పుకుంటున్నా. కానీ, రాష్ట్ర పౌరునిగా అవినీతి, డ్రగ్స్ మాఫియాపై పోరాటం కొనసాగిస్తా' అని ట్వీట్‌చేశారు. డ్రగ్స్ మాఫియాతో మజీతియాకు సంబంధాలున్నాయని కేజ్రీవాల్ గతంలో ఆరోపించారు. దీనిపై మజీతియా కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. దీంతో కేజ్రీవాల్ ఆయనను క్షమాపణలు కోరుతూ లేఖ రాశారు. కాగా, ఎల్ఐపీ నేతలు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఆప్‌కు దూరం కావాలని తీర్మానించారు.

20 ఏళ్లకు పైబడిన వాహనాలకు నో ఎంట్రీ!

న్యూఢిల్లీ: 20 ఏళ్లకు పైబడిన వాణిజ్య వాహనాలను తప్పనిసరిగా వినియోగం నుంచి తప్పించడానికి ఉద్దేశించిన విధానానికి ప్రధాని కార్యాలయం(పీఎంఓ) సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ విధానం 2020 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. కాలుష్యాన్ని కట్టడి చేయడానికి 'వెహికల్ స్క్రాపింగ్ పాలసీ' తుది దశకు చేరుకుందని రవాణా మంత్రి గడ్కరీ గతంలో చెప్పారు. ప్రధాని మోదీ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పీఎంఓలో జరిగిన భేటీలో ఈ విధానానికి సూత్రప్రాయంగా ఆమోదం లభించినట్లు సీనియర్ అధికారి చెప్పారు.

దేశంలో పొగతాగుతున్న పిల్లలు 6.25 లక్షలు

న్యూఢిల్లీ: దేశంలో 6.25 లక్షల కన్నా ఎక్కువ మంది పిల్లలు రోజూ సిగరెట్ తాగుతున్నారట. భారత్‌లో ధూమపానం దురలవాటు వల్లే ప్రతివారం 17,887 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అమెరికన్ కేన్సర్ సొసైటీ, వైటల్ స్ట్రాటజీస్ రూపొందించిన 'గ్లోబల్ టొబాకో అట్లాస్' నివేదికలో విస్మయకర అంశాలున్నాయి. స్మోకింగ్ వల్ల ఏటా భారత్‌కు వాటిల్లుతున్న నష్టం సుమారు రూ. 1,81,869 కోట్లుగా తేలింది. నివేదిక ప్రకారం, భారత్‌లో రోజూ సుమారు 4 లక్షల మంది బాలురు, 2 లక్షల మంది బాలికలు సిగరెట్ తాగుతున్నారు. వయోజనుల్లో పురుషులు 9 కోట్లు, మహిళలు సుమారు కోటిన్నర మంది పొగతాగుతున్నారు.

● కాఫీ చిత్రం



ఓ జంట దిగిన ఫొటోను అచ్చంగా కాఫీ కప్పులో గీసిన దృశ్యమిది. దక్షిణ కొరియాకు చెందిన లీ కాంగ్ బిన్ అనే చిత్రకారుడు సియోల్‌లోని తన కాఫీ షాప్ కొచ్చే వారి ఫొటోలను వారు తాగే కాఫీపై ఇలా గీసి ఇస్తాడు

హెచ్-4 వీసాల్ని కొనసాగించండి

వాషింగ్టన్: హెచ్1-బీ వీసాదారుల జీవిత భాగస్వాములు అమెరికాలో చట్టబద్ధంగా పనిచేసేందుకు వీలుకల్పించే హెచ్-4 వీసా నిబంధనను కొనసాగించాలని సిలికాన్ వ్యాలీకి చెందిన పలువురు డెమొక్రాట్ చట్టసభ్యులు డిమాండ్ చేశారు. 2015లో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమల్లోకి తెచ్చిన ఈ నిబంధనతో భారతీయ-అమెరికన్లు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు. హెచ్-4 వీసా నిబంధన అమల్లోకి వచ్చిన తర్వాత 1,04,000 మందికి అమెరికాలో పనిచేసేందుకు అనుమతి లభించింది. ట్రంప్ సర్కారు హెచ్-4 వీసాల్ని రద్దు చేసే ప్రయత్నాల్లో ఉందన్న వార్తల నేపథ్యంలో డెమొక్రాట్ ఎంపీలు స్పందిస్తూ.. మార్చి 5న అమెరికా హోం ల్యాండ్ విభాగానికి లేఖ రాశారు.

మా పార్టీలో డబ్బే ముఖ్యం: వీరప్ప మొయిలీ

బెంగళూరు: త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడింది. తమ పార్టీలో అభ్యర్థుల ఎంపికలో డబ్బు కీలక పాత్ర పోషిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలీ శుక్రవారం చేసిన ఓ ట్వీట్‌తో వివాదం చెలరేగింది. 'రాజకీయాల్లో డబ్బు సమస్యను కాంగ్రెస్ పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రజా పనుల విభాగం మంత్రి (మహదేవప్ప)తో కాంట్రాక్టర్లకున్న సంబంధాలను బట్టి అభ్యర్థులను ఎంపిక చేసే పరిస్థితి సరైంది కాదు' అని మొయిలీ ఖాతా నుంచి వచ్చిన ఓ ట్వీట్ పేర్కొంది. అయితే ఇది ధ్రువీకృత ఖాతా కాదు. 'ఆ ట్వీట్‌ను నేను చేయలేదు. అది వేరెవరో చేసిన తప్పు. ఆ ట్వీటర్ ఖాతా నా నియంత్రణలో లేదు' అని చెప్పారు. కర్ణాటక ఎన్నికల్లో పోటీ చేసేందుకు మొయిలీ కుమారుడు హర్షకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకూడదంటూ ఆ రాష్ట్ర ప్రజా పనుల విభాగం మంత్రి మహదేవప్ప ఇటీవల ఓ సమావేశంలో వ్యాఖ్యానించారు.

ఇర్ఫాన్ ఖాన్‌కు అరుదైన కేన్సర్

ముంబై: ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ (51) అత్యంత అరుదైన న్యూరోఎండోక్రైన్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం చికిత్స కోసం తాను విదేశాల్లో ఉన్నానని ఇర్ఫాన్ చెప్పారు. కేన్సర్‌ను తట్టుకోవడం చాలా కష్టంగా ఉందనీ, కానీ తన చుట్టూ ఉన్నవారు వ్యాధితో పోరాడటానికి అవసరమైన మద్దతును తనకు ఇచ్చి ఆశలు నింపుతున్నారని ఆయన పేర్కొన్నారు. మార్గరెట్ మిచెల్ రాసిన 'గాన్ విత్ ద విండ్' పుస్తకంలోని 'మనం ఏది కోరుకుంటే అది ప్రసాదించాల్సిన బాధ్యత జీవితానికి లేదు' అన్న మాటలతో ఆయన తన మీడియా ప్రకటనను ప్రారంభించారు. అభిమానులు తమ దీవెనలను పంపుతూనే ఉండాలని ఇర్ఫాన్ ఖాన్ కోరారు. న్యూరోఎండోక్రైన్ కేన్సర్ కణతులు ఊపిరితిత్తులు, జీర్ణాశయం సహా శరీరంలోని ఏ భాగంలోనైనా మొదలవుతాయి. ఎక్కువగా పేగుల్లో ఇవి ఏర్పడతాయి. ఆ తర్వాత క్రమక్రమంగా ఇతర భాగాలకు విస్తరిస్తాయి. హార్మోన్లను ఉత్పత్తి చేసే నాడీ కణాలపై క్రమరహితంగా కణతులు పెరగడమే ఈ కేన్సర్. ఇది అత్యంత అరుదైన కేన్సర్ రకం. ఈ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చు.



125 కోట్ల ప్రజల ఆత్మగౌరవమే

రైజింగ్ ఇండియా!



- వారి మద్దతుతోనే ధైర్యంగా నిర్ణయాలు
- స్వచ్ఛ భారత్, డిజిటల్ లావాదేవీల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరువలేం
- న్యూస్ 18 సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: రైజింగ్ ఇండియా అంటే ఆర్థిక వ్యవస్థ, జీడీపీ, విదేశీ పెట్టుబడులు మొదలైనవి మాత్రమే కాదని.. రైజింగ్ ఇండియా అంటే 125కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజలు మద్దతుగా నిలుస్తున్నందునే కేంద్ర ప్రభుత్వం ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. 'న్యూస్ 18' గ్రూప్ ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రసంగించారు. నోట్లరద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరిగాయన్నారు. తమ ప్రభుత్వ విజయాలతోపాటు రాబోయే కాలంలో తమ లక్ష్యాలను ఈ ప్రసంగంలో మోదీ వెల్లడించారు. 'చాలా తక్కువ సమయంలోనే స్వచ్ఛభారత్ మిషన్ ఓ ప్రజా ఉద్యమంగా మారింది. ప్రజలు నగదురహిత లావాదేవీలను ఓ ఆయుధంగా మలుచుకున్నారు. ప్రజల మద్దతు కారణంగానే మా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోగలిగింది. ప్రజలు, వారి ఆకాంక్షలకు అనుగుణంగా భారతదేశం ఓ సానుకూల మార్పు దిశగా వెళ్తోంది' అని మోదీ పేర్కొన్నారు. 'నేడు దేశవ్యాప్తంగా 13కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లున్నాయి. నాలుగేళ్లలో దేశంలో పారిశుద్ధ్య పరిధి 38 శాతం నుంచి 80 శాతానికి పెరిగింది' అని మోదీ వెల్లడించారు.

ఉజ్వల జీవితానికి..: 'ఉజ్వల పథకం ద్వారా పేదల వంటింట్లో వెలుగులతోపాటు కోట్ల కుటుంబాల్లో పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. భారత్ అభివృద్ధి చెందేందుకు అందరూ సమానమనే భావన రావాలి. అందుకే అసమానతలను రూపుమాపేందుకు మేం ప్రయత్నిస్తున్నాం' అని మోదీ అన్నారు. 'యాక్ట్ ఈస్ట్, యాక్ట్ ఫాస్ట్' అనేది తమ నినాదమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం దృష్టిలో తూర్పు రాష్ట్రాలు అంటే ఈశాన్య రాష్ట్రాలతోపాటు పశ్చిమబెంగాల్, ఒడిశా, ఇతర రాష్ట్రాలూ ఉన్నాయన్నారు. అస్సాంలో 31 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్యాస్ క్రాకర్ ప్రాజెక్టును తాము అధికారంలోకి రాగానే ప్రారంభించామన్నారు.

వైద్య సమస్యల పరిష్కారం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మెడికల్ సీట్లను గణనీయంగా పెంచాం. ప్రతి మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనుకుంటున్నాం. ప్రతి పంచాయతీని ఆరోగ్యంగా మార్చటం మా లక్ష్యం. మన తల్లులు, చెల్లెళ్ల ఆరోగ్యం కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత' అని ప్రధాని తెలిపారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా 3వేలకు పైగా పబ్లిక్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభమయ్యాయన్నారు. రూ. లక్షకోట్లతో విద్యారంగాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

నాడు కొరత.. నేడు మిగులు: 'అంతకుముందు, పునరుత్పాదక విద్యుత్ విభాగానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏం చేస్తుందో తెలిసేది కాదు. దీని ద్వారా చాలా సమస్యలు తలెత్తేవి. కానీ ఆ పరిస్థితిని అధిగమించి నేడు మిగులు విద్యుత్‌తో దూసుకెళ్తున్నాం. ఒక దేశం-ఒక గ్రిడ్ స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా దూసుకెళ్తున్నాం' అని ఆయన వెల్లడించారు. 'స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా దేశంలోని 18వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. మేం 16వేల గ్రామాలకు ఇప్పుడు వెలుగులు తీసుకొచ్చాం' అని నరేంద్రమోదీ వెల్లడించారు. నాలుగేళ్లుగా భారత్ అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాల కారణంగా ప్రపంచదేశాలపై భారత్ ప్రభావం పెరిగింది. యెమెన్‌లో సంక్షోభం తలెత్తినపుడు.. అక్కడున్న భారతీయులతోపాటు 48 దేశాల ప్రజలను మనం క్షేమంగా బయటకు తీసుకొచ్చాం.

ఆర్థిక వ్యవస్థపై..: 'భారత్ తన సంకెళ్లను తెంచుకుని 21వ శతాబ్దంతో పోటీపడి ముందుకెళ్తోందని ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన భాగస్వామ్యం గతంతో పోలిస్తే ఏడురెట్లు పెరిగింది. ప్రపంచంలో ఎక్కడైనా భారత్ గురించి సానుకూలంగా చర్చిస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న తొలి రెండు దేశాల్లో మనం ఉన్నాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గతంలో సానుకూల వాతావరణం ఉండేది కాదు. కానీ కొన్ని నిబంధనలను సరళీకరించటంతో ఎఫ్‌డీఐల ప్రవాహం పెరిగింది' అని ప్రధాని తెలిపారు.



క్షేత్రస్థాయికి పరిశోధనలు

ఇంఫాల్: ప్రజలకు మరింత మేలుకలిగేలా పరిశోధనల పరిధిని విస్తృతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రయోగశాలలనుంచి క్షేత్రస్థాయికి ఈ పరిశోధనలు మారాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)ని పునర్నిర్వచించి.. దేశాభివృద్ధికి ప్రయోగాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించిన అనంతరం శాస్త్రవేత్తలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. శాస్త్ర, సాంకేతికతను కనుగొనటం, వినియోగించటంలో భారత్‌కు సుదీర్ఘమైన చరిత్ర ఉందన్నారు.

ఫలితాలు సామాన్యుడికి అందేలా: సాంకేతికత ద్వారా విద్య, వైద్యం, బ్యాంకింగ్ తదితర రంగాల్లో పౌరులకు మరింత విస్తృతమైన సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. 'శాస్త్ర, సాంకేతికత ద్వారా ఇప్పటికీ చేరుకోలేని వర్గాలను చేరుకోవటం' అనేది ఈసారి సైన్స్ కాంగ్రెస్ ఇతివృత్తం. 'మన చిన్నారులకు ప్రయోగశాలలను అందుబాటులోకి తీసుకురావాలి. పాఠశాల విద్యార్థులతో శాస్త్రవేత్తలు తరచూ సంభాషించే వ్యవస్థను రూపొందించాలని కోరుతున్నాను. ఒక్కో శాస్త్రవేత్త.. ఏడాదిలో 100 గంటల సమయాన్ని కనీసం 100 మంది 9-12 తరగతుల విద్యార్థులతో గడిపి వారిని ప్రోత్సహించాలి' అని ప్రధాని కోరారు. భారతీయ సైన్స్ కాంగ్రెస్ సభలకోసం ముందుగా నిర్ణయించుకున్నట్లుగా హైదరాబాద్ కాకుండా చివరి నిమిషంలో ఇంఫాల్‌కు మారటంతో డెలిగేట్ల సంఖ్య పలుచగా కనిపించింది.




తీర్మానాలకు తుదిరూపు

ప్లీనరీలో నేడు కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం ● పార్టీ శ్రేణుల్ని ఉద్దేశించి రాహుల్ ప్రసంగం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. వచ్చే ఐదు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణకు పార్టీ సీనియర్ నేతలు తొలిరోజు తుది రూపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భావ సారుప్యత కలిగిన పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని రాజకీయ తీర్మానంలో పొందుపర్చారు. ఏఐసీసీ, పీసీపీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనే నేటి ప్లీనరీని ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు రాహుల్ ప్రారంభోపన్యాసం చేస్తారు. ప్లీనరీలో నేతల కంటే కార్యకర్తలపైనే ఎక్కువ దృష్టి పెడతామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించగా.. నేటి సమావేశంలో కార్యకర్తలు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనున్నారు. నేడు రాజకీయ తీర్మానంతో పాటు వ్యవసాయం, ఉద్యోగాలు, పేదరిక నిర్మూలనపై మరొక తీర్మానాన్ని ఆమోదిస్తారు. పార్టీకి దిశానిర్దేశం చేయడంతో పాటు మోదీ ప్రభుత్వ వైఫల్యాల్ని ఈ సమావేశాల్లో ప్రధానంగా ఎండగడతారని తెలుస్తోంది. అలాగే 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తల్ని కార్యోన్ముఖుల్ని చేసేలా ఈ ప్లీనరీని వినియోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ ప్లీనరీలో సోనియా గాంధీ కూడా ప్రసంగిస్తారని సమాచారం. శుక్రవారం రాహుల్ నేతృత్వంలో జరిగిన సబ్జెక్ట్స్ కమిటీ సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు సహ సీనియర్ నేతలతో పాటు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా, మన్మోహన్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో అనేక సలహాలు, సూచనలు వచ్చాయని, తీర్మానాల్లో వాటిని పొందుపర్చాలని కమిటీల చైర్మన్లను రాహుల్ గాంధీ ఆదేశించారని పార్టీ తెలిపింది.

14న రజనీకాంత్ పార్టీ ఆవిర్భావం

పార్టీలో యువతకు ప్రాధాన్యం



సాక్షి ప్రతినిధి, చెన్నై: ప్రముఖ నటుడు, సూపర్‌స్టార్ రజనీకాంత్ కొత్త పార్టీ పేరును ఏప్రిల్ 14వ తేదీ తమిళ ఉగాది నాడు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. పార్టీలో 35 ఏళ్ల లోపు యువతకు ప్రాధాన్యమిచ్చేలా వివిధ విభాగాల ఏర్పాట్లు సాగుతున్నాయి. ఏ పార్టీతో పొత్తు లేకుండా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 234 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు రజనీ ఇప్పటికే ప్రకటించారు. 'రజనీ మక్కల్ మంద్రం' పేరుతో సభ్యత్వ నమోదు, జిల్లా ఇన్‌చార్జీల నియామకం సాగుతోంది. పార్టీ అనుబంధ యువజన విభాగంలో 35 ఏళ్ల లోపువారికి మాత్రమే స్థానం కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. పార్టీ అధ్యక్షుడిగా రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శులుగా రాజు మహాలింగం, సుధాకర్ పేర్లు ఖరారయ్యాయి. పార్టీ జిల్లా విభాగాలకు అధ్యక్షులు బదులు కార్యదర్శులు మాత్రమే ఉంటారు. కార్యదర్శి కింద ఇద్దరు సహాయ కార్యదర్శులు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులను నియమిస్తారు. అలాగే, యువజన, మహిళ, వాణిజ్య, మత్స్య, న్యాయ, వ్యవసాయ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా ఈ ఆరు అనుబంధ విభాగాల నియామకాలు పూర్తి చేయాలని రజనీ భావిస్తున్నారు. హిమాలయాల్లో ఆధ్యాత్మిక పర్యటన ముగించుకుని త్వరలో చెన్నైకి రానున్న రజనీ, ఏప్రిల్ 14న తమిళ ఉగాది సందర్భంగా పార్టీ ఆవిర్భావ ప్రకటన చేస్తారని విశ్వసనీయ సమాచారం. ఇలా ఉండగా, సినీ పరిశ్రమలో స్నేహితులైన రజనీ, కమల్‌ల రాజకీయ ప్రవేశం తనకు ఎంతో సంతోషంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో ఇద్దరి తరఫునా ఎన్నికల ప్రచారం చేస్తానని దివంగత శివాజీ గణేశన్ కుమారుడు, నటుడు ప్రభు శుక్రవారం వేలూరులో ప్రకటించారు.

వేదాలు గొప్పవని హాకింగే చెప్పారు

కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి హర్షవర్ధన్



ఇంఫాల్: ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం($E=mc^2$) కంటే మెరుగైన సిద్ధాంతం వేదాల్లో ఉన్నట్లు కేంద్ర శాస్త్ర,సాంకేతిక శాఖమంత్రి హర్షవర్ధన్ వ్యాఖ్యానించారు. ఇటీవల కన్నుమూసిన ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ఈ విషయాన్ని చెప్పారన్నారు. ఇంఫాల్‌లో 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హర్షవర్ధన్ మాట్లాడారు. 'ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం కంటే మెరుగైన సిద్ధాంతం మన వేదాల్లో ఉండొచ్చని హాకింగ్ గతంలో పత్రికాముఖంగా తెలిపారు' అని చెప్పారు. సమావేశం అనంతరం ఈ వాదనలకు ఆధారమేంటని విలేకరులు ప్రశ్నించగా.. వాటిని కనుక్కోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. 'హిందూ మతంలోని ఆచార, సంప్రదాయాల్లో సైన్స్ మెండుగా ఉంది. ఆధునిక భారత్‌లో ప్రతీ ఆవిష్కరణ మన పూర్వీకులు సాధించిన వాటికి కొనసాగింపే' అని సమావేశం అనంతరం హర్షవర్ధన్ ట్వీట్ చేశారు. ఇంతకుముందు 2015లో ముంబైలో జరిగిన 102వ సైన్స్ కాంగ్రెస్‌లోనూ భారత్‌లో 7,000 ఏళ్ల క్రితం విమానాలు ఉండేవనీ, వాటిద్వారా ప్రజలు వేర్వేరు దేశాలకు, గ్రహాలకు వెళ్లేవారని వేదాల్లో ఉన్నట్లు ఓ పత్రాన్ని దాఖలుచేయడం వివాదానికి దారితీసింది.

నిర్భయ ఇంకెంత అందంగా ఉండేదో..

మాజీ డీజీపీ సంగ్లియానా చెత్త వ్యాఖ్యలు



బెంగళూరు: దేశరాజధానిలో 2012లో కామాంధుల చేతిలో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన నిర్భయతో పాటు ఆమె తల్లి ఆశాదేవిపై కర్ణాటక మాజీ డీజీపీ హెచ్‌టీ సంగ్లియానా చెత్త వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో పలు రంగాల్లో కృషిచేసిన మహిళలను సన్మానించేందుకు నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆశాదేవితో కలిసి పాల్గొన్న సంగ్లియానా.. 'నేను నిర్భయ తల్లి ఆశాదేవిని చూశాను. ఈ వయసులోనే ఆమె ఇంత మంచి శరీరాకృతితో ఉందంటే.. నిర్భయ ఇంకెంత అందంగా ఉండేదో ఊహించుకోగలను' అని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా రేపిస్టులకు దొరికిపోతే ప్రతిఘటించకుండా వారికి లొంగిపోవాలనీ, తద్వారా ప్రాణాలు నిలుపుకోవచ్చని ఆయన సదస్సుకు హాజరైన మహిళలకు సూచించారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగడంతో తాను ఆశాదేవి, నిర్భయలను పొగిడాననీ, ఎవ్వరినీ అవమానించలేదని సంగ్లియానా వివరణ ఇచ్చారు. మరోవైపు దీనిపై స్పందించిన ఆశాదేవి.. వ్యక్తిగత వ్యాఖ్యలకు బదులుగా సంగ్లియానా తమ పోరాటంపై మాట్లాడి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. ప్రజల ఆలోచనా విధానం మారలేదని తాజా ఘటన రుజువు చేస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

మైనర్‌ను రేప్ చేస్తే మరణశిక్షే

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో మహిళలపై నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడే మృగాళ్లకు మరణశిక్ష లేదా 14 ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించేలా రూపొందించిన బిల్లుకు అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ శుక్రవారం ఆమోదముద్ర తెలిపింది. క్రిమినల్ లాస్(అరుణాచల్ ప్రదేశ్) సవరణ బిల్లు-2018ను రాష్ట్ర హోంమంత్రి కుమార్ వాయి సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం 12 ఏళ్లలోపు బాలికల(మైనర్)పై అత్యాచారానికి పాల్పడే వ్యక్తులకు మరణశిక్ష లేదా 14 ఏళ్లకు తగ్గకుండా కఠిన కారాగారశిక్ష విధిస్తారు. ఈ శిక్షను యావజ్జీవశిక్షగా కూడా మార్చవచ్చు. వీటితో పాటు దోషులకు జరిమానా కూడా విధించవచ్చు. 2015 నుంచి 2017 నవంబర్ వరకూ రాష్ట్రంలో 225 రేప్ కేసులు నమోదుకాగా.. ఒక్క 2016లోనే 91 అత్యాచార కేసులు నమోదయ్యాయి. దీంతో మహిళలకు తగిన రక్షణ కల్పించడంలో భాగంగా పలువురు సభ్యుల సిఫార్సుతో అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసింది.

మీరు చాలా అందంగా ఉన్నారు

మహిళా విలేకరిపై తమిళనాడు మంత్రి వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు ఆరోగ్యమంత్రి సి.విజయభాస్కర్ తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. అన్నాడీఎంకే పార్టీ గురువారం నిర్వహించిన సమావేశానికి హాజరైన విజయభాస్కర్ బయటికొస్తుండగా.. భేటీలో తీసుకున్న నిర్ణయాల విషయమై ఓ మహిళా జర్నలిస్ట్ ఆయన్ను ప్రశ్నించారు. దీంతో ప్రశ్నల్ని తప్పించుకునేందుకు 'మేడమ్ మీరు కళ్లద్దాల్లో చాలా అందంగా ఉన్నారు' అని విజయభాస్కర్ వ్యాఖ్యానించారు. తానెప్పుడూ కళ్లద్దాలు ధరిస్తానన్న ఆమె సమావేశంలో పార్టీ నిర్ణయాలపై మళ్లీ మంత్రిని ప్రశ్నించింది. దీంతో విజయభాస్కర్ 'మీరు ఈరోజు చాలా అందంగా ఉన్నారు' అని జవాబిచ్చారు. సమావేశం విషయమై పార్టీ త్వరలోనే ప్రకటన విడుదల చేస్తుందనీ, దీనిపై అన్నాడీఎంకే సీనియర్ నేతలు మాట్లాడతారని స్పష్టం చేశారు. అయినా ఆ మహిళా జర్నలిస్ట్ ప్రశ్నలు అడగటం మానకపోవడంతో 'మీరు చాలా అందంగా ఉన్నారు' అని మంత్రి మరోసారి చెప్పారు. తన వ్యాఖ్యలపై తీవ్రదుమారం చెలరేగడంతో విజయభాస్కర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రశ్నల్ని తప్పించుకునే క్రమంలోనే తానలా అన్నట్లు చెప్పారు. వ్యాఖ్యలు ఆమెను బాధపెట్టి ఉంటే క్షమాపణలు కోరుతున్నానన్నారు.

అమెరికాలో కుప్ప కూలిన వంతెన

ఆరుగురు మృతి ● మయామిలో దుర్ఘటన

మయామి: అమెరికాలోని మయామిలో వారం క్రితమే నిర్మాణం పూర్తయిన పాదచారుల వంతెన కూలిన దుర్ఘటనలో ఆరుగురు మృతిచెందారు. ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీని విద్యార్థుల వసతి గృహంతో కలుపుతున్న ఈ బ్రిడ్జి గురువారం రద్దీగా ఉన్న రహదారిపై అమాంతం కుప్ప కూలింది. దీని కింద పలు కార్లు, వాహనాలు నలిగిపోయాయి. ఇప్పటి వరకు ఆరుగురి మృతదేహాలు లభించాయని, రక్షణ చర్యలు కొనసాగుతున్నాయని స్థానిక అధికారులు వెల్లడించారు. మరో పది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. బ్రిడ్జి రెండు చివరలకు మద్దతుగా ఉన్న నిర్మాణాలు కూడా ఏ క్షణమైనా కింద పడిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి ఉన్నపళంగా నేలకొరుగుతున్న వీడియోను సీఎన్ఎన్ విడుదల చేసింది. సుమారు 950 టన్నుల బరువున్న బ్రిడ్జి కింద కనీసం 8 కార్లు, రెండు ట్రక్కులు చిక్కుకున్నట్లు తెలిసింది. వంతెన కూలిపోయినప్పుడు పెద్ద శబ్దం వచ్చిందని, తొలుత బాంబు పేలిందని అనుకున్నామని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బ్రిడ్జిని మోస్తున్న కేబుల్స్ వదులయ్యాయని, వాటిని బిగుతు చేస్తుండగా అది కూలిపోయిందని ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియో ట్వీట్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అటుగా వెళ్తున్న వారు వెంటనే స్పందించి శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను బయటికి తీసుకొచ్చేందుకు సాయం చేసినట్లు తెలిపారు. గత శనివారమే పూర్తిస్థాయిలో సిద్ధమైన ఈ బ్రిడ్జిని 2019లో పాదచారులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విచారం వ్యక్తం చేశారు.



రాజ్యసభకు 'కళింగ' సామంత



భువనేశ్వర్: విద్యాసంస్థలు స్థాపించి వేలాది మందికి ఉచితంగా విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న ఒడిశాకు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త అచ్యుత సామంత ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యులందరిలోకి పేద ఎంపీగా నిలిచారు. గురువారం బీజేడీ తరపున ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. సామంత సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన పేరు మీద సొంత ఆస్తిపాస్తులు లేవు. బ్యాంకు ఖాతాలోరూ. 3.6 లక్షల నగదు, ఊరిలో 84 వేల విలువైన వారసత్వ ఆస్తే ఉంది. ఒడిశాలో కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కేఐఐటీ), కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(కేఐఎస్ఎస్) విద్యాసంస్థల ద్వారా ఒకటో తరగతి నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అందిస్తున్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్యసేవలందిస్తున్నారు.

టీఎస్ ఎడ్‌సెట్-2018

తెలంగాణలోని వివిధ బీఈడీ కళాశాలల్లో 2018-19కి గానూ బీఈడీ కోర్సులో ప్రవేశానికి 'తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ ఎడ్‌సెట్)-2018' ద్వారా దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మార్చి 18, 2018 నుంచి ఏప్రిల్ 20, 2018 వరకు ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.650 (ఎస్సీ/ఎస్టీ-450). పూర్తి వివరాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యే రోజు నుంచి https://edcet.tsche.ac.in వెబ్‌సైట్లో చూడొచ్చు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్... 16 ఖాళీలు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)... 16 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర అణుశక్తి విభాగం ఆధ్వర్యంలోని ప్రీమియర్ పబ్లిక్ సెక్టార్ కంపెనీ.
❖ **పోస్టు-ఖాళీలు:** మెడికల్ ఆఫీసర్/'డి' (స్పెషలిస్ట్స్)-7 (ఫిజీషియన్-3+ఆప్తాల్మాలజిస్ట్-1+జనరల్ సర్జన్-2+రేడియాలజిస్ట్-1); మెడికల్ ఆఫీసర్/సి (జీడీఎంవో)-9. ❖ **అర్హతలు:** మెడికల్ ఆఫీసర్/డి (స్పెషలిస్ట్స్)కు సంబంధిత స్పెషాలిటీలో ఎంఎస్/ఎండీ; మెడికల్ ఆఫీసర్/సి (జీడీఎంవో)కు ఎంబీబీఎస్+పీజీ డిప్లొమా (డీఆర్ఎం సహా)/తత్సమాన విద్య (లేదా) ఎంబీబీఎస్‌తోపాటు కనీసం ఏడాది అనుభవం. ❖ **వయసు:** మెడికల్ ఆఫీసర్/డి (స్పెషలిస్ట్స్)కు 40 ఏళ్లు; మెడికల్ ఆఫీసర్/సి (జీడీఎం వో)కు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ.
❖ **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/డీవోడీపీకేఐఏ/మాజీ సైనికోద్యోగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు. ❖ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** మార్చి 21, 2018. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 19, 2018.
❖ **వెబ్‌సైట్:** www.npcil.nic.in , npcilcareers.co.in

ఎయిమ్స్ భోపాల్‌లో 11 ఖాళీలు

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్: ఎయిమ్స్)... 11 బోధనేతర ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
❖ **పోస్టు-ఖాళీలు:** డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ (డీఎంఎస్)-6; పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్‌వో)-1; అకౌంట్స్ ఆఫీసర్ (ఏవో)-2; లా ఆఫీసర్-1; సీనియర్ డైటీషియన్ (అసిస్టెంట్ ఫుడ్ మేనేజర్)-1.
❖ **వేతనశ్రేణి:** రూ.15,600-రూ.39,100. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి ఎంబీబీఎస్+ఎండీ/ఎంహెచ్ఏ/ఎండీ/ఎంఎస్/ పీజీ/డిప్లొమా/లా డిగ్రీ/ఎంఎస్సీ. అలాగే నిబంధనల మేర అనుభవం.
❖ **వయసు:** డీఎంఎస్, సీనియర్ డైటీషియన్‌కు 21-40 ఏళ్ల లోపు; పీఆర్‌వో, లా ఆఫీసర్‌కు 30-45; అకౌంట్స్ ఆఫీసర్‌కు 21-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
❖ **దరఖాస్తు రుసుం:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలకు ఫీజు లేదు.
❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి. ❖ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1, 2018. ❖ **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 11, 2018.
❖ **వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in

ఏపీ సీఆర్‌డీఏలో 7 ఖాళీలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీ సీఆర్‌డీఏ).. కాంట్రాక్టు పద్ధతిలో రెండేళ్ల కాలానికి 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
❖ **పోస్టు-ఖాళీలు:** సీనియర్ ప్లానర్-1, అసోసియేట్ ప్లానర్-2; అసిస్టెంట్ ప్లానర్-4. ❖ **విభాగం:** ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ (టీటీపీ).
❖ **అర్హతలు:** సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్‌లో గ్రాడ్యుయేషన్‌తోపాటు ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ. అలాగే సంబంధిత రంగంలో సీనియర్ ప్లానర్‌కు పదేళ్లు, అసోసియేట్ ప్లానర్‌కు ఐదేళ్లు, అసిస్టెంట్ ప్లానర్‌కు రెండేళ్లు అనుభవం ఉండాలి.
❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** మార్చి 22, 2018.
❖ **వెబ్‌సైట్:** crda.ap.gov.in

నేషనల్ డోప్ టెస్టింగ్ లేబొరేటరీ... 5 ఖాళీలు

నేషనల్ డోప్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)... 5 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ.
❖ **పోస్టు:** సైంటిస్ట్ 'బి'. ❖ **వేతనం:** రూ.60,000.
❖ **అర్హతలు:** ఎంఎస్సీ (కెమికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్/అప్లైడ్ సైన్సెస్)/తత్సమాన విద్యతోపాటు సంబంధిత రంగంలో కనీసం రెండేళ్ల అనుభవం. (లేదా) సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ. ❖ **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 40 ఏళ్లు మించకూడదు. ❖ **ఎంపిక:** ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్, ఈ-మెయిల్.
❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 2, 2018. ❖ **వెబ్‌సైట్:** ndtlindia.com

ఏపీ పీజీఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వృత్తి విద్యాకళాశాలల్లో 2018-19కి గాను ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి 'ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీఈ సెట్)-2018' ద్వారా దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మార్చి 21, 2018 నుంచి ప్రారంభమవుతుంది. చివరి తేదీ: ఏప్రిల్ 20, 2018. దరఖాస్తు రుసుం రూ.1,000(ఎస్సీ/ఎస్టీ-రూ.500). పూర్తి వివరాలకు వెబ్‌సైట్: **sche.ap.gov.in**

ఏపీఆర్‌జేసీ-ఆర్‌డీసీ సెట్ 2018

ఆంధ్రప్రదేశ్‌లోని 7 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, రెండు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో 2018-19కి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ 'ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్-రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ ఆర్‌డీసీ సెట్)-2018' ప్రకటన విడుదలైంది. దీనిద్వారా ఏపీలోని 7 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు.. నాగార్జున సాగర్ (గుంటూరు); కొడిగెనహళ్లి (అనంతపురం), నిమ్మకూరు (కృష్ణా), వెంకటగిరి (నెల్లూరు), గ్యారంపల్లి (చిత్తూరు), తాటిపూడి (విజయనగరం), బనవాసి (కర్నూలు)లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలోకి; రెండు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు.. నాగార్జునసాగర్ (పురుషుల), గుంటూరు; సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల (కో-ఎడ్యుకేషన్), కర్నూలులో డిగ్రీ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశాలకు కల్పిస్తారు. అలాగే అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లోనూ ఎంసెట్, ఐఐటీ/నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ కూడా ఇస్తారు. ❖ **కోర్సులు:** ఇంటర్మీడియెట్ (ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్), డిగ్రీ. ❖ **అర్హతలు:** ఇంటర్మీడియెట్‌కు ఏపీలో పదోతరగతి మార్చి, 2018 పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు; డిగ్రీకి.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏపీ, తెలంగాణ విద్యార్థులు అర్హులు. ❖ **ఎంపిక:** ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ల ద్వారా. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.150. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 10, 2018. ❖ **వెబ్‌సైట్:** https://aprjdc.apcfss.in

హయ్యర్ ఎడ్యుకేషన్

ఇంటర్‌తోనే.. ఇంటిగ్రేటెడ్ పీజీ!

ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఇంటిగ్రేటెడ్ పీజీ).. ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న మాట! సంప్రదాయ విభాగాల నుంచి ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల వరకు.. పలు ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటివైపు దృష్టిసారించే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇంటర్‌తోనే పీజీలో చేరేందుకు వీలుండటమే అందుకు కారణం! ఇంటర్ పరీక్షలు పూర్తయి.. ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లపై విశ్లేషణ...



ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్

ఇంటర్మీడియెట్ అర్హతతోనే కోర్సులో చేరి.. పీజీ సర్టిఫికెట్‌తో బయటికి వచ్చే అవకాశం కల్పించే ప్రోగ్రామ్‌లు.. ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్స్. వాస్తవానికి అన్ని యూనివర్సిటీల్లోనూ ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టాలని 2008లోనే జాతీయ స్థాయిలో నిర్ణయించారు. క్రమేణా వీటిని అందిస్తున్న వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అమల్లోకి వస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ.. పీజీ స్థాయిలో కొత్త సబ్జెక్టులను కూడా ఆఫర్ చేస్తున్నారు.

అర్హత... ఇంటర్

ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులతో విద్యార్థులకు ప్రధాన ప్రయోజనం.. ఇంటర్మీడియెట్‌తోనే పీజీలో ప్రవేశం పొందే అవకాశం ఉండటం. ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌ల వల్ల విద్యార్థులకు కలిగే మరో ఉపయోగం... సమయం ఆదా అవడం. ఉదాహరణకు టెక్నికల్ కోర్సుల పరంగా ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. అదే సంప్రదాయ విధానంలో.. బీటెక్ నాలుగేళ్లు, ఆ తర్వాత ఎంటెక్‌కు మరో రెండేళ్లు చదవాలి. అంటే.. రెగ్యులర్ విధానంలో బీటెక్, ఎంటెక్ పూర్తిచేయాలంటే ఆరేళ్లు పడుతుంది. ఇంటిగ్రేటెడ్ పీజీ ద్వారా ఐదేళ్లలోనే అటు బీటెక్ పట్టాతోపాటు ఇటు ఎంటెక్ సర్టిఫికెట్ కూడా చేతికి అందుతుంది. ఎంతో విలువైన ఒక ఏడాది సమయం కలిసొస్తుంది. ఇది వారు తమ కెరీర్ పరంగా ముందంజలో నిలిచేందుకు అవకాశం కల్పిస్తుంది.

రెండు డిగ్రీలు

అయిదేళ్ల వ్యవధి ఉండే ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌ల్లో అడుగు పెట్టిన విద్యార్థులు.. తొలి మూడేళ్లు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి సబ్జెక్టులను చదవాల్సి ఉంటుంది. ఆ తర్వాత రెండేళ్లు పీజీ స్థాయి సబ్జెక్టులను అభ్యసించాలి. తొలి మూడేళ్లు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి సబ్జెక్టులను చదివిన విద్యార్థులు.. పీజీ స్థాయిలో అందుబాటులో ఉన్న స్పెషలైజేషన్లలో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. మూడేళ్ల తర్వాత బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్, అయిదేళ్ల తర్వాత పీజీ సర్టిఫికెట్ లభిస్తుంది. మూడేళ్ల తర్వాత పీజీ ప్రోగ్రామ్‌లో కొనసాగడం ఇష్టం లేకపోతే.. బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్ అందుకోవచ్చు.

బీటెక్+ఎంబీఏ

ప్రస్తుతం మన దేశంలో ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌ల పరంగా మేనేజ్‌మెంట్ కోర్సులు ముందంజలో నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎక్కువ మంది విద్యార్థులు బీటెక్ పూర్తికాగానే.. ఎంబీఏ వైపు అడుగులు వేస్తున్నారు. అందుకే పలు ఇన్‌స్టిట్యూట్‌లు, బీస్కూల్స్‌లో బీటెక్+ఎంబీఏ పేరుతో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లకు శ్రీకారం చుట్టాయి. ఫలితంగా విద్యార్థులకు ఒకవైపు టెక్నికల్ స్కిల్స్, మరోవైపు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు రెండూ లభిస్తున్నాయి.

సైన్స్ కోర్సులు

సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలు.. సైన్స్ విభాగంలో.. ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ+ఎంఎస్సీ వంటి ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను అందిస్తున్నాయి. వీటిద్వారా విద్యార్థులకు ఐ.ఎమ్మెస్సీ పేరుతో సర్టిఫికెట్ లభిస్తోంది. ఈ విధానంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు.. సదరు యూనివర్సిటీలోనే పీహెచ్‌డీ ప్రవేశంలో ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా సెంట్రల్ యూనివర్సిటీల్లో ఈ విధానం అమలవుతోంది.

సోషల్ సైన్సెస్

ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల పరంగా క్రమేణా క్రేజ్ పెరుగుతున్న మరో విభాగం.. సోషల్ సైన్సెస్. సంప్రదాయ బీఏ కోర్సుల ఔత్సాహికులు.. భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవడానికి ఇవి అవకాశం కల్పిస్తున్నాయి. టిస్, జేఎన్‌యూ వంటి ప్రముఖ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు.. ఇంటిగ్రేటెడ్ ఎంఏ పేరుతో పలు ప్రోగ్రామ్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. వీటిలో ఎంఏ స్థాయిలో సోషల్ వర్క్, సోషియాలజీ, రూరల్ డెవలప్‌మెంట్, ఎన్‌జీవో మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజేషన్లు అందిస్తున్నాయి.

అయిదేళ్ల 'లా' కోర్సు

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కెరీర్ పరంగా చక్కటి బాట వేస్తున్న మరో కోర్సు.. అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ. ఇంటర్మీడియెట్ అర్హతతో లాసెట్, క్లాట్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణత ఆధారంగా రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, నేషనల్ లా యూనివర్సిటీల్లో న్యాయశాస్త్ర పట్టా చేతికందుతుంది. ఇటీవల కాలంలో విద్యార్థుల వైపు నుంచి కూడా ఈ కోర్సుల పట్ల ఆదరణ పెరుగుతోంది.

ఐఐటీలు, ఐఐఎంల్లోనూ



టెక్నికల్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అంతర్జాతీయంగా మంచి పేరున్న ఐఐటీలు, ఐఐఎంలు కూడా పలు ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నాయి.
- ఐఐటీ-చెన్నై 2006లోనే ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సును అందుబాటులోకి తెచ్చింది.
- ఐఐటీ-ఖరగ్‌పూర్ ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంబీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది.
- ఐఐటీ-కాన్పూర్, రూర్కీలు కూడా ఈ తరహా ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి.
- ఐఐఎం-ఇండోర్ కూడా ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ పేరుతో ఇంటర్మీడియెట్ అర్హతగా ప్రత్యేక కోర్సును నిర్వహిస్తోంది.
- సైన్స్ కోర్సులకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఐఐఎస్ఈఆర్‌ల్లో సైతం బీఎస్+ఎంఎస్ పేరుతో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది.

లాంగ్వేజ్ ప్రోగ్రామ్స్

లాంగ్వేజ్ ప్రోగ్రామ్స్‌లోనూ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను పలు యూనివర్సిటీలు అందిస్తున్నాయి. ఆయా లాంగ్వేజ్ కోర్సుల పరంగా ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ-హైదరాబాద్, జేఎన్‌యూ, ఢిల్లీ యూనివర్సిటీలు ముందంజలో నిలుస్తున్నాయని చెప్పొచ్చు.

ప్రముఖ యూనివర్సిటీలు

- సెంట్రల్ యూనివర్సిటీలు
- ఐఐటీ-ఖరగ్‌పూర్, చెన్నై, రూర్కీ
- ఐఐఎం-ఇండోర్
- ఢిల్లీ యూనివర్సిటీ
- బిట్స్-పిలానీ
- ఎక్స్‌ఎల్ఆర్ఐ
- నేషనల్ లా యూనివర్సిటీస్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్

ఎన్నో ప్రయోజనాలు

ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్స్‌తో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయి నుంచే వారు పీజీ స్థాయిలో ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్లకు సంబంధించిన కోర్సులను చదివే వెసులుబాటు లభిస్తుంది. అలాగే ఇంజనీరింగ్, సైన్స్ విద్యార్థుల కోణంలో ఆలోచిస్తే.. బ్యాచిలర్ స్థాయి నుంచే విద్యార్థుల్లో రీసెర్చ్ ఆప్టిట్యూడ్ పెరుగుతుంది.
–ప్రొఫెసర్.వి.ఎస్.రావు, డైరెక్టర్, ఎన్ఐఐటీ యూనివర్సిటీ

India's GDP growth at 7.3 per cent: World Bank

INTERNATIONAL

Modi announces solar technology mission
Prime Minister Narendra Modi and French President Emmanuel Macron on 11th March co-chaired the first Founding Conference of International Solar Alliance, ISA in New Delhi. The one-day summit seeks to mobilise one trillion dollars of investments needed by 2030 for massive deployment of solar energy.

Xi Jinping set to rule China for life
China's Parliament on 11th March abolished the decades-old two-term limit for the President, allowing Xi Jinping to remain as the country's leader for life. In one swift vote, legislature opened up the possibility of Xi being president for life, returning China to the one-man-rule system that prevailed during the era of Mao Zedong and the emperors who preceded him. The package of constitutional amendments passed the nearly 3,000-member National People's Congress almost unanimously, with just two opposing votes and three abstentions.

World Hindi Secretariat building opened in Mauritius
President Ram Nath Kovind on 13th March inaugurated the World Hindi Secretariat building in Mauritius on the third day of his visit to the country. He also launched the World Hindi Secretariat's logo, an Early Digital Learning Programme as well unveiled foundation stones of a social housing project and a large ENT hospital being built with Indian assistance.

NATIONAL

Supreme Court allows passive euthanasia
The Supreme Court on 9th March held that the right to die with dignity is a fundamental right, saying that an individual could make an advance



"living will" that would authorise passive euthanasia under certain circumstances. The apex court's Bench held that passive euthanasia and living will were legally valid. A five-judge Constitution bench, headed by Chief Justice of India Dipak Misra, said that advance directives for terminally-ill patients could be issued and executed by the next friend and relatives of such person after which a medical board would consider it.

PM launches campaign to eradicate TB from India by 2025
Prime Minister Narendra Modi on 13th March launched a campaign to eradicate Tuberculosis(TB) from India by 2025, five years ahead of a globally-set deadline. A target has been set to end TB globally by 2030 and Government of India has set aim to eradicate it from India five years ahead by 2025. TB was declared emergency by WHO 25 years ago and India has come a long way in the fight against Tuberculosis. TB is responsible for 1.7 million deaths in 2016, despite most cases being curable while over 10 million people contract TB every year.

BILATERAL

India and France exchange 14 agreements
India and France exchange 14 agreements in key strategic areas including defence, maritime security and technology following bilateral talks between Prime Minister Narendra Modi and French President Emmanuel Macron
Other agreements: Curbing illicit trade in narcotics, agreement on migration and Mobility Partnership, Agreement to facilitate mutual recognition of academic qualifications, Technical Co-operation in the field of Railways, creation of Permanent Indo-French Railway Forum etc.

ECONOMY

1.36 lakh jobs added in July-Sept., says survey
Employment in eight key sectors, including manufacturing, IT and transport, rose by 1.36 lakh on net basis in July-September this fiscal compared to the previous quarter, says a survey. Construction sector was the only segment that reported job losses of 22,000 in the second quarter of FY2017-18.
Estimates from present quarterly employment survey reveal that there was an overall positive change of 1.36 lakh workers [in July-September] over the previous quarter [April-June], across eight sectors at all-India level.
- The quarterly employment survey by the Labour Bureau for July-September stated the above statistics.
- The Labour Bureau, a wing of Labour Ministry, stated that there were positive changes in seven out of eight sectors.
- Manufacturing sector added 89,000 jobs, education sector added 21,000 jobs while transport sector saw addition of 20,000 jobs.
- Trade (14,000), health (11,000), accommodation and restaurant (2,000) and IT/BPO sector (1,000) also reported job additions.
- According to the survey, female workers accounted for 74,000 and male workers 62,000.

Civils, Groups Special
Current Affairs

World Bank projects India's GDP growth at 7.3 per cent
The World Bank on 14th March projected India's GDP growth at 7.3 per cent for the next financial year and accelerate further to 7.5 per cent in 2019-20. The World Bank's biannual publication, India Development Update - India's Growth Story, expects the economy to clock a growth rate of 6.7 per cent in the current fiscal ending March 31. The report….
- Observed that a growth of over 8 per cent will require continued reform and a widening of their scope, aimed at resolving issues related to credit and investment and enhancing the competitiveness of exports.
- Said that accelerating the growth rate will also require continued integration into global economy.
- Pitched for making growth more inclusive and enhancing the effectiveness of the Indian public sector.

PERSONS IN NEWS

Biplab Kumar Deb: In Tripura, the first ever BJP-led government headed by Biplab Kumar Deb assumed office on 9th March.
Neiphiu Rio: Nagaland Chief Minister, Neiphiu Rio on 13th March won the vote of confidence to prove majority on the floor of the House. Rio won the confidence of the House with all 33 NDPP-led PDA members in the 60 member House voting in his favour, while the 26 NPF legislators voted against him. The Speaker did not cast his vote.

OBITUARY



Stephen Hawking: Renowned British scientist Stephen Hawking passed away on 14th March. The theoretical physicist is known for his groundbreaking work with black holes and relativity. He contracted motor neurone disease in 1963 and was given two years to live but he went on to study at Cambridge and became one of the most brilliant theoretical physicists since Albert Einstein. Mr. Hawking was the author of several popular science books, including 'A Brief History of Time', which sold more than 10 million copies and was translated into 40 different languages.

Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad



స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
510 ▼	165 ▼
33,176	10,195

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,491	▲	10
డోజోన్స్	25,005	▲	132
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,164	▲	24
డాక్స్	12,390	▲	44
షాంఘై	3,270	▽	21
నికాయ్	21,677	▽	127

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.70	65.83
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.82	92.00
€	యూరో	ఎస్‌బీఐ	81.14	81.30
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.25	62.37
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.41	51.51
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.15	50.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.71	18.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.08	18.80
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.26	11.77

మార్కెట్‌పై రాజకీయ పంజా!

ఎన్‌డీఏ కూటమి నుంచి జారిపోతున్న మిత్రపక్షాలు

- వచ్చే ఎన్నికల్లో మోదీ విజయంపై సంశయాలు
- బలహీనంగా ఆసియా మార్కెట్లు
- అనిశ్చితిని పెంచిన అమెరికా పరిణామాలు
- ఇండెక్స్ షేర్లలో భారీ అమ్మకాలు
- కీలకమైన 10,200 పాయింట్ల దిగువకు నిఫ్టీ
- 165 పాయింట్ల నష్టంతో 10,195 వద్ద క్లోజ్
- 510 పాయింట్లు పతనమై 33,176కు సెన్సెక్స్



రాజకీయ అనిశ్చితి, వాణిజ్య యుద్ధభయాలు, ఇండెక్స్ షేర్లలో భారీ అమ్మకాల కారణంగా శుక్రవారం స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. ఆసియా మార్కెట్లు నష్టపోవడం కూడా తోడవడంతో బీఎస్‌ఈ సెన్సెక్స్ 33,200 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,200 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డీఏ) నుంచి వైదొలుగుతున్నామని, మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నామని తెలుగుదేశం పార్టీ ప్రకటించడం స్టాక్ మార్కెట్లో ప్రకంపనలు పుట్టించింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 510 పాయింట్లు(1.51 శాతం) పతనమై 33,176 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 165 పాయింట్లు (1.59 శాతం)నష్టపోయి 10,195 పాయింట్ల వద్ద ముగిశాయి. గత నెల 6 తర్వాత సెన్సెక్స్ ఒక్క రోజులో ఇన్ని పాయింట్లు పడిపోవడం ఇదే మొదటిసారి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. అయితే చివర్లో ఐటీ షేర్లలో కొనుగోళ్లు చోటు చేసుకోవడంతో ఐటీ ఇండెక్స్ నష్టాలు తగ్గాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 566 పాయింట్ల వరకూ నష్టపోయింది.

నాలుగో రోజూ నష్టాలు..

అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలు తలెత్తే అవకాశాలున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో ఆసియా మార్కెట్లు నష్టపోవడంతో మన మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ వరుసగా నాలుగో రోజూ నష్టపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 33,120, 33,691 పాయింట్ల కనిష్ఠ, గరిష్ఠ స్థాయిల మధ్య కదలాడింది. లోహ, ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ, విద్యుత్తు, వాహన, బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 742 పాయింట్లు నష్టపోయింది. ఇక వారం పరంగా చూస్తే, సెన్సెక్స్131 పాయింట్లు(0.39%), నిఫ్టీ 32 పాయింట్లు(0.30%) నష్టపోయాయి. వారం పరంగా స్టాక్ సూచీలు నష్టపోవడం ఇది వరుసగా మూడో వారం.

10,000 దిగువకు నిఫ్టీ !

అమెరికాలో సమస్యలు, వాణిజ్య యుద్ధాల భయాలకు తోడు దేశీయంగా రాజకీయ అనిశ్చితి పరిస్థితులు తలెత్తడంతో మార్కెట్ పతనమైందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు చోటు చేసుకోవడంతో మద్దతు స్థాయిల వద్ద ప్రధాన స్టాక్ సూచీలు కన్సాలిడేట్ కావడం కష్టమవుతోందని పేర్కొన్నారు. శుక్రవారం 10,195 పాయింట్ల వద్ద ముగిసిన నిఫ్టీ 10,000 పాయింట్ల దిగువకు పడిపోయే అవకాశాలు ప్రబలంగా ఉన్నాయని రెలిగేర్ బ్రోకింగ్ ప్రెసిడెంట్ జయంత్ మాంగ్లిక్ అంచనా వేస్తున్నారు.

తాజా ఏడాది కనిష్ఠానికి టాటా మోటార్స్...

- టాటా మోటార్స్ షేర్ 3.67 శాతం క్షీణించి రూ.340 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ తాజా ఏడాది కనిష్ఠ స్థాయి, రూ.339ని తాకింది. ఈ షేర్‌తో పాటు టాటా మోటార్స్ డీవీఆర్, ఫోర్స్ మోటార్స్, బీఈఎమ్‌ఎల్, ఇక్రా, గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు కూడా ఏడాది కనిష్ఠాన్ని తాకాయి.
- సెన్సెక్స్ షేర్లలో నాలుగు షేర్లు–మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, యస్ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలివర్‌లు లాభపడ్డాయి.
- నిఫ్టీ షేర్లలో ఆరు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, అరబిందో ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, యస్‌బ్యాంక్‌లు ట్రెండ్‌కు ఎదురీదాయి. నిఫ్టీ, సెన్సెక్స్ షేర్లలో అధికంగా నష్టపోయిన షేర్ ఇదే.
- అమెరికా దిగుమతి సుంకాలు వృద్ధికి విఘాతం కలిగిస్తాయనే భయాలతో లోహ షేర్లు వెలవెలబోయాయి. సెయిల్, వేదాంత, హిందుస్తాన్ కాపర్, తదితర షేర్లు 3–5 శాతం రేంజ్‌లో పడిపోయాయి.
- ఏషియన్ పెయింట్స్ 3 శాతం క్షీణించింది. అదానీ పోర్ట్స్, హీరో మోటోకార్ప్, ఎన్‌టీపీసీ, సన్ ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ, డాక్టర్ రెడ్డీస్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్, ఇన్ఫీ, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐషేర్లు 3శాతం వరకూ నష్టపోయాయి.
- నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1% లాభపడింది. సిండికేట్ బ్యాంక్ 5%, ఓబీసీ, అలహాబాద్ బ్యాంక్, పీఎన్‌బీ షేర్లు 3% వరకూ పెరిగాయి.
- ఏస్ ఇన్వెస్టర్ రాకేశ్ జున్‌జున్‌వాలాకు చెందిన రేర్ ఎంటర్‌ప్రైజెస్ మూడు కోట్ల షేర్లను కొనుగోలు చేసిందన్న వార్తల కారణంగా జేపీ అసోసియేట్స్ 9 శాతం పెరిగింది.
- బీఎస్‌ఈలో 36 షేర్లు ఏడాది గరిష్ఠ స్థాయిని తాకగా, 108 షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయిని తాకాయి.

రూ. 1.86 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ భారీ పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.1.86 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,86,415 కోట్లు దిగజారి... రూ.1,43,17,308 కోట్లకు పడిపోయింది.

పతనానికి ప్రధాన కారణాలు

రాజకీయ కారణాలు: పార్లమెంట్‌లో 16 మంది సభ్యులు గల తెలుగుదేశం పార్టీ(బీజేపీకి మద్దతిస్తున్న రెండో అతి పెద్ద పార్టీ ఇదే) ఎన్‌డీఏ నుంచి తెగదెంపులు చేసుకుంది. అంతే కాకుండా మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు కూడా ఇచ్చింది. ఈ అవిశ్వాస తీర్మానం నుంచి మోదీ ప్రభుత్వం గట్టెక్కుతుందని.. అయితే 2019 ఎన్నికల్లో మోదీకి విజయం నల్లేరు మీద నడక కాదన్న విశ్లేషణల కారణంగా మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తాయని నిపుణులంటున్నారు.

అమెరికా అనిశ్చితి: చైనా నుంచి దిగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలు విధించాలని అమెరికా యోచిస్తోందని, దీనికి ప్రతిగా అమెరికా వస్తువులపై కూడా సుంకాలు విధించాలని ఇతర దేశాలు భావిస్తున్నాయనే వార్తలు వచ్చాయి. దీంతో అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలపై ఆందోళనలు పెరిగాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్... జాతీయ భద్రతా సలహాదారు పదవి నుంచి మ్యాక్‌మస్టర్‌ను తొలగించాలని నిర్ణయించడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ వ్యాపారాలకు సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించాలని అక్కడి జడ్జి ఒకరు ఆదేశాలు ఇవ్వడం అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ఆసియా మార్కెట్ల పతనం: అమెరికా సుంకాల విధింపు, తాజాగా చైనా వస్తువులపై అమెరికా సుంకాలు విధించనున్నాయన్న వార్తల కారణంగా అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలపై ఆందోళనలు పెరిగాయి. ఫలితంగా ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. జపాన్ నికాయ్ 0.5 శాతం, హాంగ్‌కాంగ్ హాంసెంగ్ 0.1 శాతం, షాంగై కాంపొజిట్ 0.6 శాతం చొప్పున నష్టపోయాయి.

ఇండెక్స్ షేర్లలో అమ్మకాలు: సూచీల్లో అధిక వెయిటేజ్ ఉన్న షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లలో భారీ అమ్మకాలు జరిగాయి. వీటితో పాటు టాటా మోటార్స్, టాటా స్టీల్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, టీసీఎస్, హీరో మోటో తదితర ఇండెక్స్ షేర్లలోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి.

సాంకేతిక కారణాలు: నిఫ్టీ వంద రోజుల ఎక్స్‌పోనెన్షియల్ మూవింగ్ యావరేజ్(డీఈఎమ్ఏ) 10,410 దిగువకు పడిపోవడం ప్రతికూల ప్రభావం చూపించిందనేది విశ్లేషకుల మాట.



ఆడి కార్లు 9 లక్షల వరకు ప్రియం!!

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి తాజాగా తన కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి వాహన ధరలు రూ. 1 నుంచి రూ. 9 లక్షల వరకు పెరుగుతాయని పేర్కొంది. బడ్జెట్‌లోని కస్టమ్స్ సుంకం పెంపు దీనికి ప్రధాన కారణమని ఆడి ఇండియా తెలిపింది. కాగా ఆడి కంపెనీ ఎస్‌యూవీ క్యూ3 దగ్గరి నుంచి స్పోర్ట్స్ కారు ఆర్8 వరకు పలు రకాల కార్లను భారత్‌లో విక్రయిస్తోంది. వీటి ధర శ్రేణి రూ.35.35 లక్షలు–రూ.2.63 కోట్లుగా ఉంది.

ఎల్‌వోయూలు అన్నింటినీ గౌరవిస్తాం

- సమస్య నుంచి బయటపడతాం
- వాటాదారులకు తెలిపిన పీఎన్‌బీ
- ప్రిఫరెన్షియల్ షేర్ల జారీకి ఆమోదం



న్యూఢిల్లీ: నీరవ్‌మోదీ కంపెనీలకు వాస్తవంగా జారీ చేసిన అన్ని ఎల్‌వోయూలను గౌరవిస్తామని (చెల్లింపులు చేయడం) పంజాబ్ నేషనల్ బ్యాంకు స్పష్టం చేసింది. ఈ పరిస్థితి నుంచి బయటపడగలిగే సామర్థ్యం బ్యాంకుకు ఉందని తెలిపింది. వాటాదారుల అసాధారణ సమావేశం (ఈజీఎం)లో ఎదురైన ప్రశ్నలకు కంపెనీ ఈ మేరకు బదులిచ్చింది. బ్యాంకు జారీ చేసిన ఎల్‌వోయూల ఆధారంగా వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ విదేశీ బ్యాంకు శాఖల నుంచి రూ.13,000 కోట్ల మేర రుణాలు పొంది ఎగవేసిన విషయం తెలిసిందే. ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణపై వాటాదారుల ఆమోదం కోసం ఏర్పాటు చేసిన ఈజీఎంలో స్కామ్‌పై బ్యాంకు యాజమాన్యం ప్రశ్నలను ఎదుర్కొన్నది. తనిఖీ, నియంత్రణలను మెరుగుపరిచేందుకు బహుళ అంచెల విధానాన్ని అనుసరించనున్నట్టు బ్యాంకు తెలిపింది. అంతర్గత నియంత్రణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు గాను తరచుగా ఇంటర్నల్ ఆడిట్, అవసరమైనప్పుడు ఎక్స్‌టర్నల్ ఆడిట్ చేపట్టనున్నట్టు బ్యాంకు వర్గాలు తెలిపాయి. దీనికితోడు కరెంట్, సేవింగ్స్ ఖాతా (కాసా)లు, చిన్న డిపాజిట్లపై దృష్టి సారించాలని నిర్ణయించింది. బ్యాంకు వనరుల్లో 40 శాతం కాసా నుంచే వస్తుండటం గమనార్హం. మరోవైపు 33.49 కోట్ల షేర్లను ఒక్కో షేరు (రూ.2 ముఖ విలువ)ను రూ.161.38 ధరకు కేంద్ర ప్రభుత్వానికి జారీ చేసే ప్రతిపాదనకు వాటాదారులు ఆమోదం తెలిపినట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు పీఎన్‌బీ సమాచారం ఇచ్చింది. ఈ వాటాల జారీ తర్వాత బ్యాంకులో కేంద్రం వాటా ప్రస్తుతమున్న 57 శాతం నుంచి 62.25 శాతానికి పెరుగుతుంది.

పీఎన్‌బీ స్కామ్... వ్యవస్థాపరమైన వైఫల్యం కాదు

- ప్రపంచబ్యాంకు అభిప్రాయం
- ప్రభుత్వం విధానాలకే పరిమితం కావాలి
- మిగిలింది నియంత్రణ సంస్థలకు వదిలేయాలని సూచన



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకులో చోటు చేసుకున్న రూ.13,000 కోట్ల స్కామ్‌ను ప్రపంచ బ్యాంకు చిన్న అంశంగా తీసేసింది. ఇది వ్యవస్థాపరమైన సమస్య కాదంటూనే ఈ తరహా స్కామ్‌లు తిరిగి జరగకుండా పాలనా పరంగా మరిన్ని మార్పులు అవసరమని అభిప్రాయపడింది. ''ఓ కుంభకోణం అన్నది నియంత్రణపరమైన పర్యవేక్షణ విధానం లేదా బ్యాంకింగ్ రంగం పూర్తి సామర్థ్యంతో ఉన్నదా లేదా అన్నది పరిశీలించేందుకు ముఖ్యమైనది. ఒక స్కామ్ వ్యవస్థ వైఫల్యానికి సంకేతంగా నేను చూడటం లేదు'' అని ప్రపంచ బ్యాంకు భారత డైరెక్టర్ జునైద్ కమల్ అహ్మద్ అన్నారు. పట్టణ నీటి సరఫరాను ఉదహరిస్తూ దేశంలో సేవల పంపిణీ నమూనాపై పునరాలోచన అవసరమని సూచించారు. భారత్‌లో ప్రభుత్వమే విధానకర్తగాను, నియంత్రించే వ్యవస్థగా, సేవల పంపిణీ ఏజెంట్‌గా ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వం కేవలం విధానాల రూపకల్పనకే పరిమితమై, మిగిలినది నియంత్రణ సంస్థలకు, థర్డ్ పార్టీ సర్వీసు ఏజెంట్లకు విడిచిపెట్టాలని సూచించారు. అధికారాల్లో విభజన చేయడం ద్వారానే సేవల్లో పారదర్శకత తీసుకురాగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, మరింత పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఇప్పటికే కొన్ని మార్పులు చేపట్టడం జరిగిందన్నారు. అందరికీ ఆర్థిక సేవలు, ప్రత్యక్ష నగదు బదిలీ, ఆధార్ అన్నవి దీర్ఘకాలంలో పారదర్శకత తీసుకురాగలవన్నారు.

తరచుగా బాస్‌లను మార్చడం వల్లే: అరుంధతి



ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులను తరచుగా మార్చడంపై ఎస్‌బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల నాయకత్వంలో నెలల తరబడి శూన్యత ఏర్పడటంతోపాటు, కొత్తగా వచ్చే వారికి నియంత్రణ లోపించి బ్యాంకుల సాఫీ నిర్వహణపై ప్రభావం పడుతుందన్నారు. పీఎన్‌బీలో రూ.13,000 కోట్ల నీరవ్‌మోదీ స్కామ్ నేపథ్యంలో ముంబై యూనివర్సిటీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకుల నాయకత్వంలో కొన్ని మార్పులు చేశారని, దీంతో వాటికి చాలా నెలలుగా అధిపతులు లేని పరిస్థితి నెలకొందన్నారు. నేరుగా పీఎన్‌బీ స్కామ్ గురించి ఆమె ప్రస్తావించకుండా, ఇటీవల బయపడిన స్కామ్ దురదృష్టకరమని, కోర్ బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్, స్విఫ్ట్ ప్లాట్‌ఫామ్ మధ్య అనుసంధానత లేకపోవడమే కారణమన్నారు.

అట్టపెట్టెలో అందం!

- బాక్స్‌లో నెలకు సరిపడే సౌందర్య ఉత్పత్తులు
- నెలకు 50 వేల ఆర్డర్లు; ఏడాదిలో రూ.6 కోట్ల వ్యాపారం
- జూన్ నుంచి విడిగా బ్రాండెడ్ ఉత్పత్తుల అమ్మకాలు
- వచ్చే ఏడాది పురుషుల సౌందర్య ఉత్పత్తులు కూడా..
- ఈ ఏడాది రూ.19 కోట్ల నిధుల సమీకరణ పూర్తి
- 'స్టార్టప్ డైరీ'తో గ్లామ్‌ఈగో కో–ఫౌండర్ లావణ్య సుంకరి

glamego

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:

ఆడవాళ్లతో షాపింగ్ మీద బోలెడన్ని జోకులున్నాయి. ఎందుకంటే ఓ పట్టాన వదలరని! అందులోనూ కాస్మెటిక్స్ షాపింగ్‌కైతే మరీనూ! తోడు వెళ్లినవాళ్లకు నచ్చితే కొంటారు.. లేకపోతే బ్రాండ్ మేనేజర్ చెబితే ఓకే చేస్తారు. మహిళగా స్వయంగా ఇవన్నీ చూసే కాబోలు... హైదరాబాదీ అమ్మాయి లావణ్య సుంకరి దీన్నే ఓ వ్యాపార వేదికగా మలచుకుంది. నెలకు సరిపడే ఆయుర్వేద సౌందర్య ఉత్పత్తులను బాక్స్‌లో పెట్టి విక్రయించడం మొదలెట్టింది. నెలకు 500 ఆర్డర్లతో మొదలైన గ్లామ్‌ఈగో ప్రస్థానం.. ఏడాదిలో 50 వేల ఆర్డర్లకు విస్తరించింది. వివరాలు లావణ్య మాటల్లోనే..

ఉస్మానియా వర్సిటీ నుంచి ఎంబీఏలో మార్కెటింగ్ చేశాక.. జెట్ ఎయిర్‌వేస్‌లో హోస్టెస్‌గా చేరా. అక్కడి నుంచి దుబాయ్, ఐర్లాండ్‌లకు చెందిన రెండు నిర్మాణ సంస్థల్లో పనిచేశా. తర్వాత సొంతంగా ఏదైనా చేయాలని నిర్ణయించుకొని.. కో–ఫౌండర్ ప్రభాకర్ దారక్‌పల్లితో కలిసి రూ.60 లక్షల పెట్టుబడితో గతేడాది మార్చిలో టీ–హబ్ కేంద్రంగా



గ్లామ్‌ఈగోను ప్రారంభించాం.

బాక్స్‌లో నెలకు సరిపడే ఉత్పత్తులు..: గ్లామ్‌ఈగో బాక్స్‌ల ఎంపిక పూర్తి శాస్త్రీయంగా జరుగుతుంది. నమోదు చేసుకున్న కస్టమర్‌ను ముందుగా చర్మం రంగు, జుట్టు తీరు, శరీర ఆకృతి వంటి వాటిపై 8 ప్రశ్నలడుగుతాం. వాటి సమాధానాలను బట్టి ఎలాంటి మేకప్ కిట్స్ నప్పుతాయో ఎంపిక చేసి వాటినే పంపిస్తాం. గ్లామ్ ఈగో వద్ద నెల, 3 నెలలు, 6 నెలలు, ఏడాది సబ్‌స్క్రిప్షన్ బాక్స్‌లుంటాయి. వీటి ధరలు వరుసగా నెలకు రూ.399, రూ.329, రూ.299, రూ.289. ఒక్కో బాక్స్‌లో మేకప్ కిట్స్, స్కిన్, ఫేస్, బాడీ కేర్ ఉత్పత్తులు 4–5 వరకూ ఉంటాయి. అన్నీ ఆయుర్వేదిక్ బ్రాండెడ్ ఉత్పత్తులే. ఉదాహరణకు అమెరికాకు చెందిన మన్నాకాదర్, రష్యాకు చెందిన స్వేర్ సీక్రెట్, ఎంకెఫైన్ బ్రాండ్‌లున్నాయి. ప్రతి నెలా బ్రాండ్లు మారుతాయి కూడా. గత ఏడాది కాలంలో 40 బ్రాండ్ల ఉత్పత్తులను వినియోగించాం.

రూ.19 కోట్ల నిధుల సమీకరణ..



హైదరాబాద్‌లోని చిరెక్ పబ్లిక్ స్కూల్ దగ్గర 8 వేల చ.అ.ల్లో గిడ్డంగి ఉంది. త్వరలోనే షాద్‌నగర్‌లో మరో వేర్‌హౌజ్‌ను ప్రారంభిస్తున్నాం. వచ్చే ఏడాది పురుషుల సౌందర్య ఉత్పత్తులను కూడా విక్రయిస్తాం. జూన్ నాటికి గ్లామ్‌ఈగోలో ఆయా బ్రాండ్ల ఉత్పత్తులను విడిగా కొనొచ్చుకూడా. ఇందుకోసం ప్రత్యేకంగా ఈ–కామర్స్ ప్రారంభిస్తున్నాం. ప్రస్తుతం మా సంస్థలో 22 మంది ఉద్యోగులున్నారు. త్వరలోనే మరింత మందిని నియమిస్తున్నాం. ఈ ఏడాది చివరికి రూ.19 కోట్లు సమీకరిస్తాం. వెంచర్ క్యాపిటలిస్ట్‌లతో చర్చిస్తున్నాం.

హైదరాబాద్ వాటా 18-20 శాతం..

ప్రస్తుతం నెలకు 50 వేల ఆర్డర్లు వస్తున్నాయి. హైదరాబాద్ నుంచి 18–20 శాతం వాటా ఉంటుంది. మా కస్టమర్లలో ఎక్కువ 18–34 ఏళ్ల మధ్య వయస్సు వారు.. అందులోనూ కార్పొరేట్ మహిళా ఉద్యోగులే. మాకొచ్చే సబ్‌స్క్రిప్షన్లలో 6 నెలల వాటా 50 శాతం వరకుంటుంది. బ్లూడార్ట్, డీటీడీసీ, ఫస్ట్ ఫ్లయిట్, డెల్హివెరి వంటి అన్ని ప్రధాన కొరియర్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం. 38 వేల పిన్‌కోడ్స్‌లో డెలివరీ అందిస్తున్నాం. ఏడాదిలో రూ.6 కోట్ల వ్యాపారాన్ని చేరాం. వచ్చే ఏడాది ఆర్డర్ల సంఖ్య లక్షకు, వ్యాపారం రూ.18 కోట్లకు చేర్చాలని లక్ష్యించాం.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే **startups@sakshi.com** కు మెయిల్ చేయండి...

జియో.. మా అమ్మాయి ఆలోచనే

4జీ లీడర్‌గా ఎదగనున్న భారత్

- పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ వెల్లడి
- రిలయన్స్‌కు ప్రతిష్టాత్మక 'డ్రైవర్స్ ఫర్ చేంజ్' పురస్కారం





లండన్: దేశ టెలికం రంగంలో సంచలనం సృష్టించిన జియో ఆవిర్భావానికి తన కుమార్తె ఈషానే కారణమని వెల్లడించారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ. 'మా అమ్మాయి ఈషా 2011లో యేల్ విశ్వవిద్యాలయంలో (అమెరికా) విద్యార్థినిగా ఉన్నప్పుడు.. ఒకసారి సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చింది. అప్పుడు ఏదో కోర్స్ వర్క్ ఆన్‌లైన్లో పంపాల్సి వచ్చింది. కానీ ఇంటర్నెట్ వేగం తనకు విసుగు తెప్పించింది. నాన్నా.. మన దగ్గర ఇంటర్నెట్ వేగం చాలా దారుణంగా ఉంది అంటూ ఆ విషయాన్ని నాతో పంచుకుంది. ఈలోగా.. ఆకాశ్ (ఈషా కవల సోదరుడు) గతంలో టెలికం అంటే కేవలం వాయిస్ కాల్స్‌కి మాత్రమే పరిమితమని... ప్రస్తుతం కొత్త ప్రపంచం అంతా డిజిటల్ మయమేనని చెప్పుకొచ్చాడు. ఈ సంభాషణే జియో ఆవిర్భావానికి బీజం వేసింది' అని అంబానీ వివరించారు. ప్రతిష్టాత్మక ఫైనాన్షియల్ టైమ్స్ ఆర్సెలర్ మిట్టల్ బోల్డ్‌నెస్ ఇన్ బిజినెస్ అవార్డ్స్ కార్యక్రమంలో 'మార్పు చోదకులు' పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. హైడ్రోకార్బన్స్ అన్వేషణ, ఉత్పత్తి.. పెట్రోలియం రిఫైనింగ్..మార్కెటింగ్, పెట్రోకెమికల్స్, రిటైల్, 4జీ డిజిటల్ సర్వీసుల విభాగంలో అత్యుత్తమ పనితీరునకు గాను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి ఈ పురస్కారం దక్కింది. ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయిలో నిలవాలనే ఆకాంక్ష గల భారత నవతరానికి ఈషా, ఆకాశ్‌లాంటి వారు ప్రతినిధులని ముకేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కీలకమని, ఈ విషయంలో భారత్ వెనుకబడి పోకూడదంటూ వారే తనను ఒప్పించారని ఆయన తెలిపారు.

మూడేళ్లలోనే భారీ నెట్‌వర్క్..

మొత్తం భారత టెలికం రంగం దేశవ్యాప్తంగా 2జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడానికి పాతికేళ్లు తీసుకోగా.. తాము కేవలం మూడేళ్లలో అత్యాధునిక 4జీ ఎల్‌టీఈ నెట్‌వర్క్‌ను నిర్మించామని.. ఇది ప్రస్తుతం 5జీ టెక్నాలజీకి కూడా ఉపయోగపడనుందని ముకేశ్ అంబానీ చెప్పారు. అమెరికాలో రేటుతో పోలిస్తే పదో వంతుకే ఇక్కడ ఇంటర్నెట్ అందిస్తున్నామన్నారు. ''గతంలో డేటా వేగం చాలా తక్కువగా ఉండటంతో పాటు రేట్లు భారీగా ఉండటం వల్ల మెజార్టీ జనాభాకు ఇంటర్నెట్ అందుబాటులో ఉండేది కాదు. కానీ జియో రాకతో ఇదంతా మారిపోయింది. దేశమంతటా ఇపుడు ఇంటర్నెట్ లభ్యత పుష్కలంగా ఉంది. పైగా అత్యంత చౌక రేటుకే లభిస్తోంది'' అని వివరించారు. కార్యకలాపాలు ప్రారంభించిన 170 రోజుల్లోనే తాము 10 కోట్ల మంది కస్టమర్లను సాధించామన్నారు. ఈ నేపథ్యంలో 1జీ నుంచి 3జీ దాకా అమెరికా, యూరప్, చైనా ఆధిపత్యం కనబరిచినప్పటికీ.. 4జీ విషయంలో మాత్రం తమ భారీ నెట్‌వర్క్ ఊతంతో 2019లో భారత్ లీడర్‌గా నిలుస్తుందని అంబానీ చెప్పారు. 2016లో కార్యకలాపాలు ప్రారంభించిన జియో.. చౌక ఇంటర్నెట్‌తో పాటు ఉచిత కాల్స్ అందిస్తూ ప్రస్తుతం దేశీయంగా నాలుగో అతి పెద్ద టెలికం కంపెనీగా మారింది.

ప్రపంచంలోనే అత్యంత చౌకైన 4జీ ఎల్‌టీఈ స్మార్ట్‌ఫోన్‌ని తాము ప్రవేశపెట్టామని.. దీనితో రోజుకు 3 లక్షల నుంచి 5 లక్షల మంది జియో ఫోన్‌కి మారుతున్నారని అంబానీ చెప్పారు. వచ్చే కొన్నేళ్లలో మొత్తం యూరప్ జనాభాలో మూడింట రెండొంతుల మందికి సమానమైన భారత జనాభాకి ప్రపంచ స్థాయి డిజిటల్ సర్వీసులు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ డేటా వినియోగంలో ప్రపంచంలో 155వ ర్యాంకులో ఉన్న భారత్.. కేవలం రెండేళ్ల వ్యవధిలో నంబర్ వన్ స్థాయికి ఎదిగిందని చెప్పారు. భారత చరిత్రలోనే అత్యంత భారీ స్టార్టప్‌గా జియో ఎదిగిందన్నారు. ప్రతిష్టాత్మక డ్రైవర్స్ ఆఫ్ చేంజ్ అవార్డు అందుకున్న దిగ్గజ సంస్థల్లో .. ఆలీబాబా, హెచ్‌బీవో, అమెజాన్, యాపిల్, ఫియట్, ర్యాన్ ఎయిర్ తదితర సంస్థలున్నాయి.

రోజూ 5 లక్షల మంది జియోకి మారుతున్నారు..

ఉబెర్, ఓలాకు డ్రైవర్ ఓనర్ల గుడ్‌బై!

సగానికి సగం కొత్త ఉపాధి వైపు

- ఇన్సెంటివ్‌లు లేకపోవటమే ప్రధాన కారణం
- ఆదివారం అర్ధరాత్రి నుంచి డ్రైవర్ల దేశవ్యాప్త సమ్మె

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్యాక్సీ అగ్రిగేటర్లు ఉబెర్, ఓలాకు డ్రైవర్ ఓనర్లు గుడ్‌బై చెబుతున్నారు. బుకింగ్‌లు తగ్గడం, రాబడి విషయంలో కంపెనీ హామీ ఇచ్చిన మొత్తం రాకపోవడంతో ట్యాక్సీ సేవల నుంచి వీరు తప్పుకుంటున్నట్టు సమాచారం. దీంతో ఐటీ కంపెనీలకు కారును లీజుకిచ్చేవారు, రెంటల్స్‌కు నడుపుకుంటున్న వారి సంఖ్య ఈ మధ్య గణనీయంగా పెరిగింది కూడా. బుకింగ్‌ల విషయంలో తాను లీజుకిచ్చిన వాహనాలకు ఓలా అధిక ప్రాధాన్యమిస్తూ డ్రైవర్ ఓనర్లకు బుకింగ్‌లు పెద్దగా ఇవ్వటం లేదని, ఇక ఇన్సెంటివ్‌లు దాదాపు కనుమరుగయ్యాయని... అందుకే తాము తప్పుకోవాల్సి వస్తోందని వీరు చెబుతున్నారు.

ట్రిప్పులు లేక ఇన్సెంటివ్‌లు జీరో...

తొలినాళ్లలో కస్టమర్ ఇచ్చే మొత్తం కాకుండా ఇన్సెంటివ్ రూపంలో డ్రైవర్ ఓనర్లకు 10 ట్రిప్పులకుగాను ఓలా రూ.5,000 నగదును చెల్లించింది. ఉబెర్ ఒక ట్రిప్పుకు రూ.250 అందించింది. ఈ స్థాయి ప్రోత్సాహకాలను చూసి వేల మంది కార్లను కొనుగోలు చేశారు. ఇప్పుడు ప్రోత్సాహకాల కింద ఇచ్చే నగదు భారీగా తగ్గడంతోపాటు, అవి అందుకోవడానికి చేయాల్సిన ట్రిప్పులు పెరిగి తలకు మించిన భారమయ్యాయి. దీంతో అదనపు ఆదాయం దాదాపు లేనట్టేనని శ్రీనివాస్ అనే డ్రైవర్ ఓనర్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'ఏడాదిన్నర కిందట డ్రైవర్ జీతం రూ.15 వేలుంటే, ఇప్పుడు రూ.18 వేలకు చేరింది. డీజిల్ లీటరుకు రూ.10 పెరిగింది. ట్యాక్సీలు ఎక్కువై డిమాండ్ పడిపోయింది. ట్రాఫిక్ రోజు రోజుకూ అధికం కావడం కూడా మా సమస్యను పెంచింది' అని చెప్పారాయన.

రుణాలు చెల్లించలేక..

ఒకానొక దశలో హైదరాబాద్‌లో ఉబెర్, ఓలా వద్ద దాదాపు 75,000 వాహనాలు తిరిగాయని తెలంగాణ క్యాబ్స్, బస్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిజాముద్దీన్ 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ప్రస్తుతం సగం మంది బయటకు వచ్చారని తెలిపారు. 'అప్పులు చేసి మరీ చాలామంది కార్లను కొనుక్కున్నారు. ఆదాయాలు లేక డ్రైవర్ ఓనర్లు బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు. వేల వాహనాలను బ్యాంకులు తీసుకెళ్లిపోయాయి. ఇపుడు ఉబెర్, ఓలాకు ట్యాక్సీ నడపాలనుకుంటున్న అభ్యర్థులకు బ్యాంకులు రుణాలివ్వటం లేదు. దీంతో చాలా మంది కార్లను అమ్మేసి డ్రైవర్లుగా మారారు'' అని ఆయన వివరించారు.

దేశవ్యాప్తంగా సమ్మె!

ఈ ఆదివారం (మార్చి 18) అర్ధరాత్రి నుంచి ఉబెర్, ఓలా డ్రైవర్ ఓనర్లు సమ్మెకు దిగుతున్నారు. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈ రెండు కంపెనీలు సర్వీసులందిస్తున్న నగరాల్లో సమ్మె ఉంటుందని సమాచారం. తమ డిమాండ్లకు యాజమాన్యాలు దిగిరాకపోతే సమ్మెను కొనసాగించాలని యూనియన్లు భావిస్తున్నాయి. కంపెనీల నుంచి నగదు ప్రోత్సాహకాలు తగ్గడమే సమ్మెకు ప్రధాన కారణం. వాహనాలను ఇబ్బడిముబ్బడిగా నమోదు చేస్తుండడంతో ట్రిప్పులు లేక ఆదాయాలు పడిపోతున్నాయని డ్రైవర్ ఓనర్లు చెబుతున్నారు.





రెడ్డీస్ ప్లాంట్‌లో ఉల్లంఘనలు!

యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన హైదరాబాద్ సమీపంలోని జిన్నారం యూనిట్‌లో ఇటీవల యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టింది. యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్లు తయారు చేసే ఈ కేంద్రం నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టుగా లేదంటూ నాలుగు లోపాలను ఎఫ్‌డీఏ ఎత్తిచూపింది. రెడ్డీస్‌కు ఫామ్ 483 జారీ చేసింది. శుక్రవారం రెడ్డీస్ షేరు క్రితం ముగింపుతో పోలిస్తే 2.07 శాతం తగ్గి రూ.2,138.10 వద్ద ముగిసింది.

క్యాడ్ భారం!

క్యూ3లో జీడీపీలో 2 శాతం

ముంబై: వాణిజ్యలోటు (ఎగుమతులు–దిగుమతులు మధ్య నికర వ్యత్యాసం) పెరగడం దేశంపై కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) భారం పెరగడానికి దారితీస్తోంది. క్యాడ్‌ను మూడవ త్రైమాసికంలో (2017 అక్టోబర్–డిసెంబర్) స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో పోల్చి చూస్తే 2 శాతంగా నమోదయ్యింది. విలువ రూపంలో ఇది 13.5 బిలియన్ డాలర్లు. ఎగుమతులకన్నా దిగుమతులు పెరగడంతో ఇదే త్రైమాసికంలో వాణిజ్యలోటు 44.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా గణాంకాలను విడుదల చేసింది. నిర్దిష్ట కాలంలో ఎఫ్ఐఐ, ఎఫ్‌డీఐ, ఈసీబీ మినహా దేశంలోకి వచ్చీ–పోయే మొత్తం విదేశీ మారకద్రవ్య నికర వ్యత్యాసమే క్యాడ్. దీనిని నిర్దిష్ట కాలానికి సంబంధించి జీడీపీతో పోల్చి చూడ్డం జరుగుతుంది. దీని తీవ్రత వల్ల మారక విలువల్లో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. 2016 మూడవ త్రైమాసికంలో భారత్ క్యాడ్ 1.4 శాతం. విలువ రూపంలో 8 బిలియన్ డాలర్లు. ఇక ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ చూస్తే క్యాడ్ 0.7 శాతం నుంచి 1.9 శాతానికి పెరిగింది.

హిందుస్తాన్ జింక్ డివిడెండ్ ఒక్కో షేర్ 6

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్‌కు చెందిన హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేర్‌కు రూ.6 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నది. ఒక్కో షేర్‌కు 300 శాతం (రూ.6) చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ చెల్లించడానికి తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని హిందుస్తాన్ జింక్ పేర్కొంది. మొత్తం డివిడెండ్ చెల్లింపులు రూ.3,051 కోట్లని పేర్కొంది. జింక్, లెడ్, వెండి లోహాలను ఈ కంపెనీ తయారు చేస్తోంది. కంపెనీ కేంద్ర కార్యాలయం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉంది. డివిడెండ్ వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో ఈ షేర్ 1 శాతం నష్టపోయి రూ.315 వద్ద ముగిసింది.

పార్లమెంటులో బిజినెస్



ఎనిమిదేళ్లుగా పెరుగుతున్న ఎన్‌పీఏలు

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ మొండిబకాయిలు (ఎన్‌పీఏ) గత ఎనిమిదేళ్లుగా క్రమంగా పెరుగుతూవస్తున్నట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్ ప్రతాప్ శుక్లా శుక్రవారంనాడు లోక్‌సభకు తెలిపారు. 2017 డిసెంబర్ నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.7.77 లక్షల కోట్లను దాటినట్లు వివరించారు. ఒక్క భారీ పరిశ్రమల విషయం చూస్తే, 2015 మార్చి 31న రూ.1.23 లక్షల కోట్లు ఉన్న మొండిబకాయిలు 2017 డిసెంబర్ నాటికి రూ.5.27 లక్షల కోట్లకు పెరిగాయన్నారు.

2017లో 1,785 కార్డు, నెట్ బ్యాంకింగ్ మోసాలు

2017లో రూ.లక్షకు పైబడి విలువకు సంబంధించి 1,785కుపైగా కార్డులు (క్రెడిట్/డెబిట్), నెట్ బ్యాంకింగ్ మోసాలు నమోదయినట్లు ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి కేజే ఆల్ఫోన్స్ తెలిపారు. ఈ కేసుల వల్ల జరిగిన మొత్తం నష్టం విలువ రూ.71.48 కోట్లని వివరించారు. ఒక్క డిసెంబర్ 2017లో 187 ఈ తరహా కేసులు నమోదుకాగా, విలువలో ఇది రూ.33.73 కోట్లని తెలిపారు. అయితే ఈ నెలలో ఏటీఎంలు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్‌లో కార్డ్ వినియోగ విలువ రూ.3,46,997 కోట్లని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ బ్యాంకుల విదేశీ బ్రాంచీలు పేలవమే!

ప్రభుత్వ రంగ బ్యాంకుల విదేశీ బ్రాంచీల పనితీరు పేలవంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. 2016–17ల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల విదేశీ బ్రాంచీలు 25 శాతం నష్టాలనే నమోదు చేసుకున్నాయని ఆర్థికశాఖ సహాయమంత్రి శుక్లా తెలిపారు. 2016–17లో 159 ప్రభుత్వ రంగ విదేశీ బ్రాంచీల్లో 41 నష్టాల్లోనే నమోదుచేసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ వరుసలో 9 బ్రాంచీలతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదటి స్థానంలో నిలవగా, తరువాత 8,7 బ్రాంచీలతో వరుసగా బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాలు ఉన్నాయి.

ప్రత్యేక ఫార్మా క్లస్టర్లకు సిఫార్సు!

చైనాకు ఫార్మా ముడి పదార్థాల ఎగుమతులపై దృష్టి

- ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

సాక్షి, విశాఖపట్నం: దేశంలో ఫార్మా సిటీల మాదిరిగా ప్రత్యేక (ఎక్స్‌క్లూజివ్) ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు ప్రభుత్వరంగ ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఫార్మెక్సిల్) డైరెక్టర్ జనరల్ ఆర్. ఉదయ్ భాస్కర్ తెలిపారు. దీనివల్ల ఫార్మారంగం వృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో ఫార్మా ఇండస్ట్రీ సదస్సుకు వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మందుల ఎగుమతుల్లో అంతర్జాతీయంగా భారత్ మూడో స్థానంలోను, వాల్యూలో 10వ స్థానంలో ఉందని చెప్పారు. చైనా నుంచి ఫార్మా దిగుమతుల స్థాయి నుంచి ఎగుమతుల స్థాయికి భారత్ ఎదుగుతోందన్నారు. చైనాలో మనకన్నా తక్కువ ధరలకే చాన్నాళ్లుగా యాంటీబయాటిక్స్, తదితర మందుల తయారీకి అవసరమయ్యే ముడిపదార్థాల లభ్యమవుతుండడం వల్ల అక్కడ నుంచి వాటి దిగుమతికి ఎక్కువగా భారత్ ఆధారపడుతోందన్నారు. కానీ కొన్నాళ్లుగా చైనాలో ఔషధాల ఉత్పత్తి వ్యయం పెరగడంతో భారత్ నుంచి అక్కడకు ఎగుమతులు మొదలయ్యాయని, ఇది మనకు మంచి పరిణామమని తెలిపారు. ఇలాంటి వాటిని మనదేశంలో విస్తృతం చేస్తే ఇతర దేశాలకు గణనీయంగా ఎగుమతి చేయడానికి వీలుంటుందని, దీంతో ఫార్మా కంపెనీలు లాభాలు ఆర్జిస్తాయని వివరించారు. ప్రస్తుతం ఫార్మెక్సిల్ దృష్టి సారిస్తోందన్నారు. చాలా దేశాలు ఔషధ వ్యయాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని, అందుకు తక్కువ ధరలకే మందుల లభ్యత తప్పనిసరన్నారు.

మందుల ఎగుమతుల్లో భారత్‌కు చైనాతో పాటు అమెరికా, యూరప్ దేశాలు ప్రధాన పోటీదార్లుగా ఉన్నారని చెప్పారు. రెగ్యులేటెడ్ మార్కెట్‌కి భారత్ 50 శాతం మందులను ఎగుమతి చేస్తోందన్నారు. ఔషధాల దిగుమతులపై ఉన్న నిషేధంపై ప్రభుత్వం, సంబంధిత సంస్థలతో సంప్రదింపులు జరుపుతుందని, ఎగుమతిదార్లకు ప్రయోజనకరంగా ఉండేలా ఫార్మా పాలసీ రూపొందించడంలో ఫార్మెక్సిల్ ప్రభుత్వానికి సలహా ఇస్తుందని వివరించారు.



ఢిల్లీలో ఫార్మా, హెల్త్‌కేర్ ఎగ్జిబిషన్..

కొన్ని దేశాల్లో మన దేశ ఔషధ ఉత్పత్తుల ఎగుమతులకు రిజిస్ట్రేషన్ అవసరమని ఉదయ్ భాస్కర్ తెలిపారు. అందుకయ్యే ఖర్చులో 50 శాతం గాని, లేదా రూ.50 లక్షలు మించకుండా రాయితీలిచ్చి ప్రోత్సహిస్తామన్నారు. త్వరలో ఢిల్లీలో ఫార్మా, హెల్త్‌కేర్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని చెప్పారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ ఫార్మా కంపెనీల స్టాళ్లు ఏర్పాటు చేస్తామని, ఎగుమతులు, ఆయా దేశాలకు అవసరాలేమిటన్న దానిపై ప్రతినిధులతో చర్చలుంటాయని వివరించారు. దేశంలో ఫార్మెక్సిల్‌కు ఔషధ ఎగుమతులు చేసే 3500 మంది సభ్యులున్నారని ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

పీఎన్‌బీ స్కామ్‌తో వ్యవస్థకు చెడ్డపేరు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన స్కామ్ వ్యవస్థకు చెడ్డ పేరు తీసుకొచ్చిందని, మరింత పారదర్శకత, కార్పొరేట్ పాలనలో నైతికతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేసిందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ''పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఇతర బ్యాంకుల్లో జరిగినవి మన కళ్లు తెరిపించేవి. అక్కడ వ్యవస్థ వైఫల్యం ఉంది. కొందరు వ్యక్తుల వల్ల అలా జరిగి ఉండొచ్చు. కానీ అది మనకు, వ్యవస్థకు చెడ్డ పేరు తెచ్చింది'' అని వెంకయ్యనాయుడు అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 58వ నేషనల్ కాస్ట్ కన్వెన్షన్ సదస్సులో వెంకయ్యనాయుడు మాట్లాడారు. మరింత పారదర్శకత, జవాబుదారీతనం, నైతికతతో కూడిన కార్పొరేట్ పాలన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. మనం ఎల్‌పీజీ దశకంలో (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)లో ఉన్నామని తెలుసు. దీన్ని సరిగ్గా వినియోగించకపోతే పేలిపోవచ్చు'' అని అన్నారు.

సుజుకీ ఇన్‌ట్రూడర్‌లో అడ్వాన్స్‌డ్ వెర్షన్

ధర రూ.1,06,896

ముంబై: వాహన తయారీ కంపెనీ 'సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా' తాజాగా తన ఇన్‌ట్రూడర్ బైక్‌లో ఫ్యూయెల్ ఇన్‌జెక్షన్ ఆప్షన్‌తో అడ్వాన్స్‌డ్ వెర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.1,06,896. క్రూయిజర్ విభాగంలో తన వాటాను మరింత పెంచుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ వేరియంట్‌ను ఆవిష్కరించింది. కాగా కంపెనీ గత నవంబర్‌లో ఈ ఇన్‌ట్రూడర్ బైక్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇప్పటిదాకా 15,000 యూనిట్లను విక్రయించామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) సంజీవ్ రాజశేఖరన్ తెలిపారు.

సంపద సృష్టిపై యువతరం ఆసక్తి

ఆదాయంలో 11 శాతం పొదుపు

ఫిన్‌టెక్ సంస్థ సేవ్‌అభీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: సంపద సృష్టికి తోడ్పడేలా పెట్టుబడులు పెట్టడంపై యువతరం ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. ఇందులో భాగంగా నెలకు రూ. 25,000 కన్నా తక్కువగా ఆర్జిస్తున్న మిలీనియల్స్ (22–30 ఏళ్ల మధ్య వయస్సు వారు).. తమ ఆదాయంలో 11 శాతాన్ని పొదుపు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఫైనాన్షియల్ టెక్నాలజీ స్టార్టప్ సంస్థ సేవ్‌అభీ నిర్వహించిన ఒక సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మరోవైపు నెలకు రూ. 25,000–రూ. 50,000 మధ్య ఆదాయం అందుకుంటున్న మిలీనియల్స్ 7.9 శాతం, రూ. 50,000కు మించి ఆదాయం ఉంటున్న మిలీనియల్స్ 8.1 శాతం మేర పొదుపు చేస్తున్నారు. ఈ మూడు వర్గాలకు చెందిన వారు అత్యధికంగా ఇళ్లు, కిరాయిలపై ఖర్చు చేస్తున్నారు. మొదటి కేటగిరీ 35 శాతం, రెండో వర్గం 21.5 శాతం, మూడో వర్గం 33.5 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇక ఆ తర్వాత డైనింగ్ మొదలైన వాటిపై 12.3 శాతం, 21 శాతం, 11 శాతం మేర వ్యయం చేస్తున్నారు. మొత్తం 5,000 మంది మిలీనియల్స్ గణాంకాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. మిలీనియల్స్ ఇన్వెస్టర్స్‌లో 97 శాతం మంది పురుషులే ఉన్నారు. యువతరం ఎంత సేపూ తాత్కాలికమైన వాటివైపే మొగ్గు చూపుతుందని, భవిష్యత్ కోసం పొదుపు పట్టించుకోదని ఉన్న అపోహలను పోగొట్టేలా సర్వే ఫలితాలు ఉన్నాయని సేవ్‌అభీ వ్యవస్థాపకుడు ప్రియాంక్ బర్త్‌వాల్ పేర్కొన్నారు. ఆటోమేటిక్ పొదుపును ప్రోత్సహించే దిశగా సేవ్‌అభీ సంస్థ తాజాగా సేవ్ ది చేంజ్ పేరిట యాప్‌ను రూపొందించింది.



సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా సంజయ్ సింగ్

వైస్ చైర్మన్‌గా డాక్టర్ రాజు నియామకం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 2018–19 సంవత్సరానికి గాను కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ చైర్మన్‌గా సంజయ్ సింగ్, వైస్ చైర్మన్‌గా డాక్టర్ డీ రాజు నియమితులయ్యారు. సంజయ్ ఐటీసీ లిమిటెడ్‌లో డివిజినల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, కిర్బి బిల్డింగ్ సిస్టమ్స్ ఇండియా సీఈవో, ఎండీగా ఉన్నారు.

ఈవీల ప్రోత్సాహకానికి పాలసీ అవసరం

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్

న్యూఢిల్లీ: భారత్‌లో ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ)ను ప్రోత్సహించడానికి ఒక పాలసీ అవసరమని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ తెలిపారు. సమగ్రమైన పాలసీ అభివృద్ధికి నీతి ఆయోగ్ సిద్ధంగా ఉందన్నారు. ఆయన ఇక్కడ జరిగిన ఇండియా ఎనర్జీ ఫోరమ్–ఓఆర్ఎఫ్‌లో మాట్లాడారు.


తలకు మించిన ఖర్చు..

హెయిర్ కేర్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత

- దేశీయంగా ఏటా రూ.19,000 కోట్ల ఖర్చు
- ఫార్మా, ఆయుర్వేదం సహా 100కు పైగా కంపెనీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కొప్పున్నవాళ్లు ఏ ముడి వేసినా అందమేనంటారు. అంటే... ఏ స్టయిల్ చెయ్యడానికైనా ముందు జుట్టుండాలి కదా!! బహుశా... అందుకేనేమో!! భారతీయులు తల వెంట్రుకల సంరక్షణకు (హెయిర్ కేర్) ఏటా ఏకంగా రూ.19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. సౌందర్య పోషణ (పర్సనల్ కేర్) ఉత్పత్తుల్లో హెయిర్ కేర్ వాటా అధికమనేది మార్కెట్ వర్గాల మాట. ఈ ప్రాధాన్యాన్ని చూసే... ఫార్మాస్యూటికల్ కంపెనీలతోపాటు ఎఫ్ఎంసీజీ, ఆయుర్వేద ఉత్పత్తుల తయారీ సంస్థలు సైతం ఈ రంగంలో పోటీపడుతున్నాయి.

నిజానికిపుడు జుట్టు రాలిపోవడం, పలుచబారడం, కొత్త వెంట్రుకలు రాకపోవడం వంటి సమస్యలు సర్వసాధారణం. దీనికి సమతుల ఆహార లేమి, ఒత్తిడి, లైఫ్‌స్టైల్, హార్మోన్ల అసమతౌల్యం, వాతావరణ కాలుష్యం వంటి చాలా కారణాలున్నాయి. ప్రధానంగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోకపోవడం వల్లే అధిక సమస్యలు వస్తున్నాయన్నది ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ రజిత దామిశెట్టి మాట. దేశంలో ఐదుగురు మహిళల్లో ఒకరు కేశ సంబంధ సమస్యతో బాధపడుతున్నారని ఆమె చెప్పగా... పురుషుల్లో 11 శాతం మంది బాధితులున్నట్లు ఫార్మా సంస్థ గ్లెన్‌మార్క్ తెలియజేసింది.




ఇదీ...హెయిర్ కేర్ మార్కెట్..

తల వెంట్రుకల సంరక్షణకు భారతీయులు ఏటా రూ.19,000 కోట్లు ఖర్చు చేస్తున్నారట. ఇక సాధారణ హెయిర్ ఆయిల్స్, షాంపూలు, క్రీమ్స్, జెల్స్ కోసం చేసే వ్యయం దీనికి అదనం. భారత్‌లో 100కుపైగా ప్రముఖ కంపెనీలు ఈ మార్కెట్లో పోటీ పడుతున్నాయి.''కేశ సంరక్షణపై ప్రజల్లో అవగాహన రావడం, మధ్యతరగతి ప్రజలు అధికమవడం కూడా ఈ మార్కెట్ పెరుగుదలకు దోహదం చేస్తోంది'' అని గ్లెన్‌మార్క్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) రాజేశ్ కపూర్ 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. కేశ సంరక్షణకు వైద్యులు సిఫార్సు చేసిన మందులు, చికిత్సలకు భారతీయులు ఏటా కనీసం రూ.600 కోట్లకుపైగా వెచ్చిస్తున్నట్లు చెప్పారాయన.

డ్రాప్ అయ్యేవారే ఎక్కువ..

కేశ సమస్యల పరిష్కారానికి కనీసం 6–8 నెలల పాటు సంరక్షణ ఉత్పత్తులు వాడాల్సి ఉందని రాజేశ్ కపూర్ వెల్లడించారు. 'విద్య, డిజిటల్ మాధ్యమాలు, టీవీల కారణంగా అందంగా కనపడాలన్న తపన అందరిలోనూ వచ్చింది. అయితే చికిత్సను ఉత్సాహంగా మొదలు పెట్టినా.. మధ్యలోనే మానేసేవారే ఎక్కువ. వాస్తవానికి కేశ సంరక్షణ విషయంలో భారత్‌లో సరైన ఉత్పత్తులు తక్కువే ఉన్నాయి. 20 ఏళ్ల ట్రాక్ రికార్డును గమనించే 50 దేశాల్లో విజయవంతంగా అమ్ముడవుతున్న నూర్‌క్రిన్ ట్యాబ్లెట్లను మహిళల కోసం భారత్‌లో ప్రవేశపెట్టాం' అని వివరించారు.



బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	30,460	
బంగారం (99.5, 10గ్రా)	30,310	
వెండి (కిలో)	38,275	
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	– –	
బంగారం (22 క్యారెట్లు)	28,950	▼ 50
వెండి (కిలో)	– –	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,400	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	28,950	▼ 50
వెండి (కిలో)	41,300	▼ 100
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	31,230	▼ 170
బంగారం (22 క్యారెట్లు)	28,950	▼ 170
వెండి (కిలో)	39,500	▼ 300
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	31,020	0
బంగారం (22 క్యారెట్లు)	29,000	0
వెండి (కిలో)	41,500	0
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	31,250	▼ 150
బంగారం (22 క్యారెట్లు)	28,750	▼ 400
వెండి(కిలో)	39,100	▼ 300
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	31,300	▼ 60
బంగారం (22 క్యారెట్లు)	28,950	▼ 50
వెండి (కిలో)	39,300	▼ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.23 (రాత్రి 11.00కు)	$61.19 (గురువారం ముగింపు)
బ్రెంట్	66.05 (రాత్రి 11.00కు)	$65.12 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 17-3-2018

విశాఖ	325–00
చిత్తూరు	363–00
వరంగల్	332–00
ముంబై	370–00
చెన్నై	370–00
విజయవాడ	317–00
గోదావరి	317–00
నమక్కల్	360–00
16–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365–00
కోల్‌కతా	360–00
ఢిల్లీ	310–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	370.5	382.15
AMBUJA CEME	234.75	242.3
ASIAN PAINT	1122.75	1160.8
AXIS BANK L	522.6	529.65
BAJAJ AUTO	2910.45	2948.75
BAJAJ FINAN	1687.9	1726.25
BHARTI AIRT	416.75	420.45
BOSCH LIMIT	17921.7	18025.2
BHARAT PETR	447.55	462.05
CIPLA LTD	559.4	571.15
COAL INDIA	278.2	295.5
EICHER MOTO	28079.15	28695.55
GAIL (INDIA	441	450.35
HCL TECHNOL	967.6	959.15
HDFC LTD	1791.4	1830
HDFC BANK L	1853	1880.8
HERO MOTOCO	3546.1	3640.8
HINDALCO I	221.7	224.9
HINDUSTAN P	364.75	371.55
HINDUSTAN U	1299.15	1299.95
INDIABULLS	1207.45	1237.95
ICICI BANK	298.1	301.45
INDUSIND BA	1724.7	1741.75
BHARTI INFR	334.45	337.9
INFOSYS LIM	1171.9	1182.5
INDIAN OIL	184.75	192.05
ITC LTD	260.5	265.55
KOTAK MAHIN	1060.75	1085.65
LARSEN & TO	1269.3	1295.1
LUPIN LIMIT	761.85	776.65
MAHINDRA &	740.75	734.85
MARUTI SUZU	8676.55	8837.55
NTPC LTD	164.85	169.9
OIL AND NAT	177.15	180.3
POWER GRID	192.25	194.8
RELIANCE IN	900.05	911.8
STATE BANK	252.3	253.7
SUN PHARMAC	503.05	516.45
TATA MOTORS	339.75	353.1
TATA STEEL	600.2	611.75
TATA CONSUL	2825.7	2869.7
TECH MAHIND	634.7	631.85
ULTRATECH C	4026.3	4189.4
UPL LIMITED	719.7	721.15
VEDANTA LIM	308.9	316.95
WIPRO LTD	295.75	293.4
YES BANK LI	312.9	311.85
ZEE ENTERTA	570.35	570.4
నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ		
ABB INDIA L	1336.8	1373.1
ACC LIMITED	1567.95	1603.15
ASHOK LEYLA	147.15	150.55
BAJAJ FINSE	5011.35	5034.5
BANK OF BAR	143.8	143.75
BHARAT ELEC	149.2	151.3
BHEL	86.4	87.05
BRITANNIA I	4860.6	4868.25
CADILA HEAL	379.1	385.1
COLGATE PAL	1044.45	1042.35
CONTAINER C	1208.5	1243.25
CUMMINS IND	765.65	783
DABUR INDIA	321.25	325.05
DLF LIMITED	226.3	225.45
AVENUE SUPE	1365.8	1359.8
EMAMI LIMIT	1022	1050.05
GLAXOSMITHK	2228.25	2291.55
GLENMARK PH	546.2	553.8
GODREJ CONS	1056	1072.9
GLAXOSMITHK	6516.6	6521.75
HAVELLS IND	516.6	520.75
HINDUSTAN Z	314.9	318.45
ICICI PRU L	377.95	382.8
IDEA CELLUL	81.05	80.15
INTERGLOBE	1263.45	1265.7
JSW STEEL L	290.25	295.15
LIC HOUSING	513.45	523.2
MARICO LIMI	301.25	301.1
UNITED SPIR	3121.55	3189.35
MOTHERSON S	307.45	314.05
MRF LTD	70211.65	71737.95
NHPC LTD	26.6	26.8
NMDC LTD.	126.3	124.3
ORACLE FIN	3888.35	3922.7
OIL INDIA L	337.25	337.7
PIRAMAL ENT	2491.75	2450.85
PETRONET LN	235	237.4
POWER FIN C	88	88.05
P&G HYGIENE	9427.5	9449
PIDILITE IN	916.3	909.55
PUNJAB NATI	98.85	98.55
RURAL ELEC	128.5	128.95
STEEL AUTHO	72.85	75.3
SHREE CEMEN	16424.4	16815.65
SIEMENS LTD	1105.1	1132.6
SHRIRAM TRA	1445.8	1460.65
SUN TV NETW	903.15	920.7
TATA POWER	79.95	80.25
TITAN COMPA	879.25	872.5
TORRENT PHA	1268.45	1279.8

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	9.09	8.66
Alphageo	763	765.45
Alu Flouride	108.45	106.65
Amar Raja Bat	783	793.55
And Bank	41.8	43
And Cemen	10.99	10.53
And Paper	297.25	302.5
And Petro	57.4	58.05
Anjani Portl	183.5	180.3
Aries Agro Ltd	195.15	200.6
Aurobindo Ph	572.7	572.8
Avantel Soft	538	541.5
Avanti Feeds	2351.2	2379.7
AvonOrg	10.9	11.06
BN Rathi Sec	38.9	40.9
Balaji Amin	597.35	626.5
Bambino Agro	228	225.3
Bartronics	11.75	12.08
Bhagira Chem	288	291
Bhagya Nag	47.45	49
Bhagya Wood	26	26
Brilliant Sec	9.69	10.05
CIL Securi	27.9	27.85
Color Chip	35	36.6
Cont Coffee	295	294.8
CoroFert	525.15	527.7
Cosboard Ind	32.5	32.75
Country Club	13.35	13.52
Cubex Tub	21.85	23
Cybermate	2.85	3.04
DR Reddy	2138.1	2183.2
Danlaw Tec	73.5	73.6
DecCement	548.95	552.25
Divi's Lab	1097	1086.1
Divya Granit	98	94.8
Dolphin Medi	1.3	1.3
Dredgin Corp	672.2	682.2
Empee Sugars	3.02	3.17
Everest Org	132	136
Fortune Info	78.7	78.35
Four Soft	73.85	74.4
GMR Ferro	3	3.2
GMR Infra	17.9	18.5
GVK Power	15.25	16
Gati Corpn	104.85	105.15
Gayatri Bio	6.76	7
Gayatri Proj	198.35	201.45
Gayatri Sugrs	9.5	9.79
Gennex Lab	4.27	3.94
GodavDru	33.1	33
Goldstn Tele	204.35	203.6
Goldstone Tech	13.43	14.02
Granules (I)	110	112.65
HBL Nife Pow	51.5	50.55
HYDIndus	1598	1628.65
Heritage Food	746.35	761
HindFlurocarb	10.5	10
ICSA Ltd	3.37	3.26
IDL Industrs	525	529.6
IKF Soft	0.6	0.61
IQMS Soft	14.5	15.2
IVRCL Infras	3.75	3.73
Incap	84	82.2
IndoNationl	845	858.7
Infotech En	631.5	629.55
Innaredy Com	3.37	3.26
JSTL	40.5	42
KCP LTD	115	117.2
KNR Constructio	293.7	294.7
KakatiCem	268.35	270.9
Kallam Spg	31.9	32.05
Karan Woo-sn	1.91	1.82
Kernex Micro	38	38.7
Krebs Bio	184.95	189.05
LGS Global	5.2	5.15
LancoIndus	333.45	343.4
Lokesh Mach	58.7	59.05
Lotus Choc	50.95	51.3
MIC Elec	6.15	6.12
Madhucon Proje	24.2	24.5
Maytas Infra	36	36.75
Mold-tek	54	54.95
Moldtek Plastic	317.4	327.1
Moschip Semi	38.4	37.05
NCLInd	223.5	229.35
NETTLINX	78.95	75.25
NMDC Ltd	125.95	124.55
NagarAgrich	43.2	44.35
NagarAgrite	6.3	6.35
NagarConst	122.5	126.45
Natco Pharma	784.5	786.85
Nava Bh Ventur	138.65	139.6
Neha Inter	6.38	6.8
Neocure Ther	3.47	3.65
Neuland Lab	722.55	702.05
Nihar Info Glo	14.1	13.48
Nile	746	756
Oil Country	37.8	39.3
Padmalaya Tele	3.2	3.1
Pankaj Poly	9	8.82
Panyam Cemen	42.9	44.35
PennInd	54.65	55.9
Phytochem I	65.8	63.9
Pitti Lamin	86.6	87.6
Pokarna	193	194.75
Prajay Engs	12.71	12.59
PremiExpl	352.15	362.1
Prism Cement	115.4	115.9
Rain Industries	386.5	390.35
Raj Packagin	41.3	40
Ram Informat	41.85	41.65
Reg.Ceramic	4.96	5.1
Restile Cer	7.84	7.97
Roopa Indus	15.25	16.4
SS Organics	8	8
Sagar Cem	908.85	906.75
Sai Wires(I)	1.04	1.04
Samkrg Pist	293.85	290.1
Sampre Nutri	52	53
SangInd	123.65	124.6
Satvah. Ispat	19.9	19.7
Saven Techno	24.2	25.4
Softsol	35.25	33.6
South Bio Tech	2.38	2.5
SrRayAlk	55.15	56.55
Srinivasa Ship	56.65	58.2
Starchik Sp	23.55	23.55
Sujana Metal	1.25	1.26
Sujana Towers	3.87	3.7
Sujana Univers	0.7	0.69
Surana Strip	2.45	2.39
Surana Tele	5	4.93
Suryachakra Pow	0.9	0.9
Suryalata Sp	146	145.8
SuvarCem	130.9	126.35
Suven Pharma	178.7	183.05
TCI Finance	26.15	26.9
Taj Gvk Hotel	158.05	161.15
Tanla Solutions	35	34.7
Trans Biotek	2.19	2.29
Transport Co	268	266.45
Usher Agro	5.1	5.11
VBC Ferro	42.1	40.1
VST Indus	2970	2975
Vamshi Rubb	45.6	49
Viceroy Hotels	15.6	15.2
VijayTextil	44.5	44.95
Vimta Labs	199	201.45
Virat Crane	60.5	63.65
Virinchi Con	108.5	108.75
VisakaInd	691.5	693
Vision Tech	1.46	1.46
Vista Pharma	41.85	42.3
Vivimed Labs	77.8	78.75
Vjil Consult	17.2	17.1
ZenoTech Lab	44	45.65

● సిద్దిపేట జిల్లా గుండారెడ్డిపల్లికి చెందిన రాజయ్య తన పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పులు చేశాడు. అలాగే వ్యవసాయంలో సైతం నష్టాలు రావడంతో కలతచెంది శుక్రవారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణం చెందాడు.



శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

పుంజుకున్న మిర్చి ధర

ఖమ్మం మార్కెట్‌లో రూ.9,950 పలికిన ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మిర్చి ధర రూ.9,950 పలికింది. జనవరిలో రూ.11,275 వరకు ధర పలుకగా.. ఫిబ్రవరిలో క్రమంగా పతనమైంది. మార్చి మొదటి రెండు వారాలు కూడా రూ.9,100 నుంచి రూ. 9,400 వరకు మాత్రమే పలికింది. శుక్రవారం ఏకంగా రూ.9,950 చేరింది. మరో రెండు, మూడు రోజుల్లో మరికొంత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు తెలిపాయి.

– ఖమ్మం వ్యవసాయం

భారీగా నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

రూ.1.06 కోట్ల విత్తనాలను పట్టుకున్న పోలీసులు

- వివరాలు వెల్లడించిన కమిషనర్ దుగ్గల్
- ప్రకాశం జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వెల్లడి

తాండూర్ (బెల్లంపల్లి): ఆంధ్రా ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. రూ.1.06 కోట్ల విలువైన నకిలీ పత్తి విత్తనాలను మంచిర్యాల జిల్లా తాండూర్ పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ ఈ కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి తాండూర్ ఎస్‌ఐ కె.రవి సిబ్బందితో కలసి రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఉప్పు బస్తాల లోడ్‌తో వస్తున్న లారీని ఆపి తనిఖీలు చేశారు. అందులో ఉప్పు బస్తాల కింద 51.50 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1.06 కోట్ల వరకు ఉంటుందని సీపీ తెలిపారు. లారీని తాండూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తరలించామని, పూర్తి స్థాయిలో సోదాలు నిర్వహించగా 29 క్వింటాళ్ల లూజ్ పత్తి విత్తనాలు, కావ్య అనే పేరుగల ప్యాకెట్లు 22.50 క్వింటాళ్లు గుర్తించామని తెలిపారు. ఈ విత్తనాలను బెల్లంపల్లి వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ పరిశీలించి నకిలీ విత్తనాలుగా ధ్రువీకరించారని తెలిపారు. విత్తనాలను తరలిస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన మారుబోయిన కృష్ణారెడ్డి, కాకాని సత్యనారాయణ, కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన జిల్లా రాఘవులను అరెస్టు చేసి విచారించగా.. ప్రకాశం జిల్లా ఇనుకుల్ల గ్రామం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వెల్లడించారని తెలిపారు. విత్తనాలను తయారు చేసి ఇక్కడికి తరలించిన కర్నూలు జిల్లాకు చెందిన మద్దెల సాంబారెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన బుజ్జితో పాటు విత్తనాలను కొనుగోలు చేసిన కాగజ్‌నగర్‌కు చెందిన సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, దహెగాంకు చెందిన సూర మహేశ్, మహారాష్ట్రకు చెందిన జె.శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేశామన్నారు. వీరంతా పరారీలో ఉన్నారని సీపీ పేర్కొన్నారు.



పట్టుబడిన నకిలీ విత్తనాల బస్తాలు. (ఇన్‌సెట్)లో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీపీ దుగ్గల్

బాధ్యులెవరైనా ఉపేక్షించం: సీపీ

నకిలీ పత్తి విత్తనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని, ఈ కేసుల్లో ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తిలేదని సీపీ విక్రమ్‌జిత్ దుగ్గల్ అన్నారు. మంచిర్యాల డీసీపీ వేణుగోపాల్‌రావును విచారణ అధికారిగా నియమించామని తెలిపారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. తాండూర్ ఎస్సై కె.రవి, సిబ్బంది తిరుపతి, నెహ్రూ, రమేశ్ తదితరులను కమిషనర్ అభినందించారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి సరెండర్

ఇంజనీర్లకు కడియం హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హన్మకొండ: విధులు సక్రమంగా నిర్వహించని ఇంజనీర్లపై కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి కలెక్టర్లను ఆదేశించారు. మిషన్ భగీరథ, కాకతీయ, డబుల్ బెడ్ రూమ్, హరితహారం కార్యక్రమాల ప్రగతిపై శుక్రవారం హన్మకొండలో మంత్రి చందూలాల్‌తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పథకాల అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల పనులపై అవగాహన లేకుండా ఇంజనీర్లు మాట్లాడటంపై కడియం మండిపడ్డారు. ఎస్‌ఈ, ఈఈ, డీఈ, ఏఈల మధ్య గ్యాపు ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమీ నాన్సెన్స్ పద్ధతి అంటూ అధికారులను మందలించారు. కాకతీయ పనులకు సంబంధించి నీటిపారుదల శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సీరియస్ అయ్యారు. నీటిపారుదల శాఖ మంత్రి చెప్పినా పనిచేయడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. మంత్రి హరీశ్‌రావు చెప్పినా ఇంజనీర్లు పెడచెవిన పెట్టారని శాసన మండలి ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఇంజనీర్లు నిర్లక్ష్యం, అలసత్వం వీడాలని, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. భగీరథ పనులను ఏప్రిల్ వరకు పూర్తి చేసి గ్రామాల్లోకి బల్క్ వాటర్ సరఫరా చేయాలని, జూలై వరకు ఇంట్రా పైపులైన్ పూర్తి చేసి ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేయాలని కడియం సూచించారు. మిషన్ కాకతీయ నాలుగు దశల పనులను జూలై వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పట్ల జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జూన్, జూలైలో హరితహారం కార్యక్రమం చేపట్టనున్నందున ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.


సంక్షోభంలో వ్యవసాయ రంగం

బడ్జెట్ అంకెలగారడీ: కోదండరాం

సూర్యాపేట వ్యవసాయం: రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. శుక్రవారం ఆయన స్వరాజ్ అభియాన్ పార్టీ నేత యోగేంద్రనాథ్‌తో కలసి సూర్యాపేట జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, అప్పుడే రైతుల బతుకులు బాగు పడతాయని అన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలగారడీని తలపిస్తోందని, రాబడి లక్షా ముప్పై వేల కోట్లని పేర్కొంటూ.. లక్షా డెబ్బై నాలుగు వేల కోట్లకు బడ్జెట్ ప్రవేశ పెట్టారని విమర్శించారు. కందులు అమ్ముకున్న రైతులకు ఇంకా డబ్బులు జమకాలేదని పేర్కొన్నారు.

బీజేపీకో హటావో.. దేశ్‌కో బచావో

- ఈ నినాదంతో ముందుకెళ్తాం: చాడ
- వామపక్షాలు ఏకతాటిపైకి రావాలని పిలుపు



పాల్వంచ రూరల్: బీజేపీకో హటావో.. దేశ్‌కో బచావో అనే నినాదంతో ముందుకెళ్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. అందుకోసం వామపక్ష పార్టీలు ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక.. చేసిన అద్భుతాలు, తెచ్చిన మార్పులు ఏమీ లేవని, దేశాన్ని దోచుకుతినడమే వారికి తెలుసన్నారు. విదేశాల్లోని ఉన్న నల్లధనాన్ని ఎందుకు రప్పించలేదని ప్రశ్నించారు. అవినీతి రహిత పాలన, మేక్ ఇన్ ఇండియా అంటూ ఊదరగొట్టి మోసం చేశారన్నారు. దేశంలో ప్రమాదకరమైన మతోన్మాద ఫాసిస్టు ప్రభుత్వం అధికారంలో ఉందని, తన వికృత చేష్టలను ఇటీవల మరింత పెంచిందని విమర్శించారు. లెనిన్, అంబేడ్కర్, పెరియార్ వంటి నేతల విగ్రహాలను ధ్వంసం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం ఎన్నికల బడ్జెట్‌గా ఆయన అభివర్ణించారు.

'పాలమూరు' పనుల పరిశీలన

ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల సందర్శన



'పాలమూరు పథకం నమూనాను వివరిస్తున్న మంత్రి జూపల్లి

సాక్షి, నాగర్ కర్నూల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శరవేగంగా సాగుతున్న పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల, ఇతర ప్రాజెక్టులను రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి పలువురు మీడియా ప్రతినిధులతో శుక్రవారం ఉదయం 11 గంటలకు నాగర్ కర్నూల్‌కు చేరుకున్న అల్లం నారాయణకు మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కొల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎల్లూరు రిజర్వాయర్ పనులను పరిశీలించారు. 0 పాయింట్ వద్ద పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నమూనాను అల్లం నారాయణకు ఇంజనీర్లు వివరించారు. అనంతరం ఆయన గుడిపల్లి గట్టు రిజర్వాయర్‌తోపాటు మిషన్ భగీరథ పనులను, కోతిగుండు వద్ద శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ పంపుహౌజ్, నార్లాపూర్ జలాశయం పనులు, ఏదుల జలాశయం పనులను మీడియా ప్రతినిధులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు సీఈఓ లింగరాజు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే పాలమూరు ప్రాజెక్టు ఓ రికార్డు సృష్టించనుందని, 41 అధునాతన పంపులతో దీనిని చేపట్టామని వివరించారు. మంత్రి జూపల్లి ఈ ప్రాజెక్టు టన్నెల్ పనులను దగ్గరుండి అల్లం నారాయణకు చూపించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర టన్నెల్‌లో ప్రయాణించి సొరంగం నిర్మాణం, అక్కడ పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులు, ప్రాజెక్టు ప్రగతి.. తదితర అంశాలకు సంబంధించి అల్లం నారాయణ బృందం అక్కడి వారితో ముచ్చటించింది.



ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

వసతులు ఎలా ఉన్నాయ్?

- ఎస్సీ, బీసీ హాస్టళ్లలో సంగారెడ్డి కలెక్టర్ తనిఖీ
- సౌకర్యాలపై ఆరా ● విద్యార్థినులతో కలసి భోజనం

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణం నేతాజీనగర్‌లోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలోని సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులతో కలసి భోజనం చేశారు.

– సంగారెడ్డి టౌన్



వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న వేరుశనగను దగ్గరకు చేస్తున్న మహిళ

వేరుశనగ వర్షం పాలు

అచ్చంపేట రూరల్/కల్వకుర్తి: నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రైతులు నష్టపోయారు. కల్వకుర్తి మార్కెట్‌కు రైతులు సుమారు 2,455 బస్తాల వేరుశనగను తీసుకురాగా, మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతాల్లో అకాల వర్షం ప్రారంభమైంది. కాగా, రైతుల వద్ద టార్పాలిన్లు లేకపోవడం, మార్కెట్ అధికారులు కూడా సకాలంలో స్పందించకపోవడంతో అరగంట పాటు కురిసిన వానతో వేరుశనగ తడిసి ముద్దయింది. తడిసిన వేరుశనగను కూడా కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనకు దిగగా.. అధికారుల హామీతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇక ఇదే జిల్లా అచ్చంపేట మార్కెట్‌యార్డులో కూడా వేరుశనగ తడిసిపోయింది. మధ్యాహ్నం వాన కురవడంతో అధికారులు హడావుడిగా కవర్లను సమకూర్చి రైతులకు అందించారు. అప్పటికే స్వల్పంగా తడిసింది. అలాగే వంగూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం వచ్చింది. ఇదే సమయంలో మండలంలోని పోల్కంపల్లికి చెందిన రైతు జంగయ్య తన పొలంలో ఆవును మేపుతుండగా పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది.

పిల్లలతో కలసి తల్లి ఆత్మహత్యాయత్నం


ఇద్దరు చిన్నారుల మృతి ● ప్రాణాలతో బయటపడిన తల్లి

ఖిలా వరంగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటనలో ఇద్దరు పిల్లలు మృతి చెందగా, ఆమె ప్రాణాలతో బయటపడింది. శుక్రవారం సాయంత్రం వరంగల్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ అర్బన్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన పత్తిపాక పున్నం చందర్, స్వాతి దంపతులకు కుమారుడు రిత్విక్‌సాయి(5) కూతురు తన్మయ్(11 నెలలు) ఉన్నారు. పున్నం చందర్ వరంగల్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో కలతలు ఏర్పడ్డాయి. దీంతో స్వాతి మనోవేదనకు గురై ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకునేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఏకశిల చిల్డ్రన్ పార్కుకు చేరుకుంది. సాయంత్రం అందరూ వెళ్లిపోయే వరకు పార్కులో ఓ మూలన ఉన్న స్వాతి.. ఆ తర్వాత పక్కనే ఉన్న చెరువు వద్దకు వెళ్లి ఇద్దరు పిల్లలను నీట ముంచింది. పిల్లలు మృతి చెందాక.. తాను కూడా ఆత్మహత్య చేసుకునేందుకు చెరువు లోపలికి వెళ్లింది. అయితే ప్రాణభయంతో వెంటనే బయటకు వచ్చి రోదిస్తూ జరిగిన విషయాన్ని స్థానికులకు వివరించింది. మిల్స్‌కాలనీ సీఐ నందిరాం సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. నీట మునిగిన ఇద్దరు పిల్లలను వెలికి తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

'హమ్‌దో.. హమారే దో' యాత్రకు బ్రేక్

- ఇద్దరు పిల్లలు చాలన్న నినాదంతో భారత్ బచావో సంస్థ యాత్ర
- ప్రభుత్వ అనుమతి లేదని అడ్డుకున్న సంగారెడ్డి పోలీసులు
- ఐదు గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం


సంగారెడ్డిక్రైం/కొండాపూర్(సంగారెడ్డి): దేశ హితం కోరుతూ భారత్ బచావో సంస్థ 'హమ్‌దో..హమారే దో.. సబ్‌కో దో'నినాదంతో దేశవ్యాప్తంగా చేపట్టిన యాత్రకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో సంగారెడ్డి పోలీసులు బ్రేక్ వేశారు. భారత్ బచావో సంస్థ రాష్ట్ర నిర్మాణ అధ్యక్షుడు సురేశ్ చౌహాన్‌జీ నేతృత్వంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. అక్కడి నుంచి మళ్లీ ఢిల్లీకి చేరుకునేలా ఈ యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా శుక్రవారం వారు సంగారెడ్డికి చేరుకున్నారు. అయితే యాత్రకు అనుమతి లేదని, పోలీసులు మల్కాపూర్ చౌరస్తా వద్ద 65వ జాతీయ రహదారిపై వారిని అడ్డుకున్నారు. దీంతో సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని యాత్ర నిర్వహిస్తున్న కాన్వాయ్‌ని, నిర్వాహకులను కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏప్రిల్ 15 వరకు ఢిల్లీకి చేరుకొని 'ఇద్దరు పిల్లలే ముద్దు .. అదనపు సంతానం వద్దు'అన్న నినాదంపై ప్రధాని మోదీని కలసి ఇద్దరు పిల్లలను మాత్రమే కనే విధంగా చట్టం తేవాలని విజ్ఞప్తి చేయనున్నట్లు యాత్ర నిర్వాహకులు తెలిపారు. ఈ దిశలో ఇప్పటికే కోటి సంతకాలు సేకరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ యాత్రను అడ్డుకోవడం తగదన్నారు. కాగా, విషయం తెలుసుకున్న హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంగారెడ్డికి చేరుకున్నారు. ఇప్పటి వరకు చాలా రాష్ట్రాల్లో ఈ యాత్రను నిర్వహించినప్పటికీ ఎక్కడా అడ్డుకోలేదని ఆయన అన్నారు. మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో చివరికి అనుమతించింది. దీంతో అదుపులోకి తీసుకున్న నిర్వాహకులను విడిచిపెట్టారు. ఈ విషయంపై ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం యాత్రకు అనుమతినిచ్చిందని, అదుపులోకి తీసుకున్న కాన్వాయ్‌ను పంపించామని తెలిపారు.



ఏసీయూ నివేదిక తర్వాతే షమీపై నిర్ణయం

పీకల్లోతు కేసుల్లో ఇరుక్కున్న పేసర్ మొహమ్మద్ షమీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి సెంట్రల్ కాంట్రాక్టు రావాలన్నా, ఈ సీజన్‌లో ఐపీఎల్ ఆడాలన్నా అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) నుంచి క్లీన్‌చిట్ కావాల్సిందేనని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. బీసీసీఐ నియమావళిలోని క్రికెటర్ల ఎథిక్స్ కోడ్ ప్రకారం కేవలం అవినీతి, అనుచిత ఆర్థిక వ్యవహారాల్లో మాత్రమే బోర్డు జోక్యం చేసుకుంటుంది. వ్యక్తిగత, వైవాహిక అంశాలు బోర్డు పరిధిలోకి రావని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఏసీయూ చీఫ్ నీరజ్ కుమార్... షమీ భార్య హసీన్ జహాన్ పేర్కొన్న ఆర్థిక లావాదేవీపైనే విచారణ జరుపుతామని ఆయన చెప్పారు. ఏసీయూ షమీకి క్లీన్‌చిట్ ఇస్తే సెంట్రల్ కాంట్రాక్టుతో పాటు ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు ఆడే అవకాశమిస్తామని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా చెప్పారు.

శభాష్ సింధు...



తొలి రెండు మ్యాచ్‌ల్లో స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయిన తెలుగు తేజం పీవీ సింధు అసలు సిసలు పోరులో మాత్రం అబ్బురపరిచింది. తన ముందు ప్రపంచ చాంపియన్ ప్రత్యర్థిగా ఉన్నా... మ్యాచ్‌లో పలుమార్లు వెనుకబడినా... తన వ్యూహాలకు దీటుగా ప్రత్యర్థి జవాబు ఇస్తున్నా... ఏదశలోనూ తొణకకుండా... విజయంపై ఆశలు వదులుకోకుండా... చివరి పాయింట్ వరకు పోరాడిన సింధు ఆఖరికి విజయనాదం చేసి ఔరా అనిపించింది.

ప్రపంచ చాంపియన్ ఒకుహారాపై అద్భుత విజయం

- తొలిసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీ సెమీఫైనల్లోకి
- నేడు అకానె యామగుచితో పోరు

బర్మింగ్‌హామ్: కొన్నాళ్లుగా తనకు కొరకరాని కొయ్యగా మారిన ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)పై భారత స్టార్ పీవీ సింధు మరోసారి పైచేయి సాధించింది. ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అద్వితీయ విజయంతో తెలుగు తేజం సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. 84 నిమిషాలపాటు ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ సింధు 20–22, 21–18, 21–18తో ప్రపంచ ఆరో ర్యాంకర్, ప్రస్తుత వరల్డ్ చాంపియన్ ఒకుహారాను ఓడించింది. ఈ మెగా ఈవెంట్‌లో ఆరో ప్రయత్నంలో తొలిసారి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇప్పటివరకు సింధు, ఒకుహారా 10 సార్లు తలపడగా... ఇద్దరూ 5–5తో సమఉజ్జీగా ఉన్నారు. ఈ టోర్నీలో సింధు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ మూడు గేమ్‌లు ఆడి విజయాన్ని దక్కించుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో అకానె యామగుచి (జపాన్)తో సింధు తలపడుతుంది. యామగుచితో ముఖాముఖి రికార్డులో సింధు 6–3తో ఆధిక్యంలో ఉంది.



గతేడాది ఒకుహారాతో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండింటిలో గెలిచి, మరో రెండు ఓడిన సింధు ఈ మ్యాచ్‌లో మాత్రం పట్టుదలతో పోరాడింది. మూడు గేమ్‌లూ నువ్వా నేనా అన్నట్లు సాగాయి. తన ఎత్తు కారణంగా పదునైన స్మాష్‌లు సంధించే వీలున్న సింధుకు ఒకుహారా ఆ అవకాశం ఇవ్వలేదు. ర్యాలీ సుదీర్ఘంగా కొనసాగేలా చూస్తూ అవకాశం దొరకగానే డ్రాప్ షాట్‌లు సంధిస్తూ పాయింట్లు రాబట్టింది. సింధు కూడా ఏమాత్రం తీసిపోకుండా ఆడుతూ ఆమె వ్యూహాలకు తగినరీతిలో జవాబిచ్చింది. దాంతో స్కోరు పలుమార్లు సమమైంది. తొలి గేమ్‌లో స్కోరు 20–20 వద్ద సింధు వరుసగా రెండు పాయింట్లు కోల్పోయి గేమ్ చేజార్చుకుంది.

మ్యాచ్‌లో నిలవాలంటే తప్పనిసరిగా రెండో గేమ్‌లో నెగ్గాల్సిన స్థితిలో సింధు ఆరంభంలోనే 3–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం 6–4తో.. 9–7తో... 11–9తో...14–11, 16–13తో సింధు ఈ ఆధిక్యాన్ని కొనసాగించింది. ఈ దశలో సింధు తప్పిదాలతో స్కోరు 18–18 వద్ద సమమైంది. కానీ ఈ హైదరాబాద్ అమ్మాయి సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా మూడు పాయింట్లు నెగ్గి రెండో గేమ్ దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు మూడుసార్లు (1–4, 11–14, 12–16)తో వెనుకబడినా... ఒత్తిడి దరిచేరనీయకుండా ఆడింది. 12–16తో వెనుకంజలో ఉన్నపుడు సింధు వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి స్కోరును 16–16తో సమం చేసింది. అనంతరం ఇద్దరూ రెండేసి పాయింట్లు సాధించడంతో మళ్లీ 18–18 వద్ద స్కోరు సమమైంది. ఈ దశలో సింధు ఒక్కసారిగా విజృంభించి వరుసగా మూడు పాయింట్లు గెలిచి ఒకుహారాను ఇంటిదారి పట్టించింది.

శ్రీకాంత్‌కు నిరాశ

గురువారం ఆలస్యంగా ముగిసిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ శ్రీకాంత్ 11–21, 21–15, 20–22తో అన్‌సీడెడ్ హువాంగ్ యుజియాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో శ్రీకాంత్ 20–18తో విజయానికి చేరువగా వచ్చాడు. అయితే వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయిన ఈ హైదరాబాద్ ప్లేయర్ ఓటమిని మూటగట్టుకున్నాడు.

ఫెడరర్ 16-0

ఇండియన్ వెల్స్ టోర్నీ సెమీస్‌లో స్విస్ స్టార్



కాలిఫోర్నియా: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ ఇండియన్ వెల్స్ టైటిల్ దిశగా ముందంజ వేశాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ ఫెడరర్ 7–5, 6–1తో హైయోన్ చుంగ్ (దక్షిణ కొరియా)పై గెలుపొందాడు. ఈ ఏడాది ఫెడరర్‌కిది వరుసగా 16వ విజయం కావడం విశేషం. 2006 తర్వాత ఈ స్విస్ దిగ్గజం ఓ సీజన్ ఆరంభంలో 16 వరుస విజయాలు నమోదు చేయడం ఇదే ప్రథమం. సెమీఫైనల్లో కొరిక్ (క్రొయేషియా)తో ఫెడరర్ ఆడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో కొరిక్ 2–6, 6–4, 7–6 (7/3)తో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)ను ఓడించాడు.

మా ద్వీపంలో విహరించండి

విరుష్క జోడీకి శ్రీలంక క్రీడల మంత్రి ఆహ్వానం

కొలంబో: విరాట్ కోహ్లి, అనుష్క శర్మ... అందరినీ ఆకర్షించిన 'ఫైవ్‌స్టార్' సెలబ్రిటీ జోడీ. వారి ప్రేమ నుంచి పెళ్లి దాకా... పుకార్లు, షికార్లు అన్నీ ఇన్నీ కావు. ఏదేమైనా ఓ షాంపూ యాడ్‌తో ఒక్కటైన ఈ జోడీ గతేడాది ఇటలీలో ఏడడుగులు వేసింది. తమ పెళ్లి పుస్తకంలోని తొలి పేజీ 'హనీమూన్'ను స్విట్జర్లాండ్‌లో జరుపుకుంది. కోహ్లి ఏ మాత్రం తీరిక దొరికినా తన ప్రియసఖితో గడిపేందుకే సమయం కేటాయిస్తున్నాడు. ప్రస్తుతం శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు టి20 సిరీస్ నుంచి కోహ్లి తప్పుకున్నాడు. ఇది సింహళ దేశంలోని కోహ్లి అభిమానులను బహుశా బాధించిందేమో! దీంతో ఆటలోని లోటును విహారంతో భర్తీ చేయాలని సాక్షాత్తూ ఆ దేశ క్రీడల మంత్రే స్వయంగా ఆహ్వానించారు. తమ దేశ అతిథిగా తమ ద్వీపంలో గడపాలని మంత్రి దయసిరి జయశేఖర ఆహ్వానం పలికారు. 'కోహ్లిని ఆడేందుకు పిలవట్లేదు. వివాహం తర్వాత ఇక్కడ పర్యటించని కోహ్లి తన సతీమణి అనుష్క శర్మతో కలిసి విహరించాలని ఆహ్వానిస్తున్నా. లంక ద్వీపంలో ఎన్నో అద్భుతమైన ప్రదేశాలున్నాయి. వాటిని చూస్తూ సేదతీరొచ్చు' అని జయశేఖర పేర్కొనట్లు ఓ మీడియా సంస్థ తెలిపింది.



ప్రస్తుతం విరుష్క జంట ముంబైలోని ఓ విలాసవంతమైన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో కాపురం పెట్టింది. దీని అద్దె నెలకు రూ. 15 లక్షలు. రెండేళ్లు ఉండే విధంగా అగ్రిమెంట్ చేసుకొని రూ. కోటి 50 లక్షలు చెల్లించినట్లు సమాచారం. అయితే ఆటతో పాటు బ్రాండింగ్‌తో కోట్లకు పడగలెత్తిన కోహ్లికి కిరాయి ఇంట్లో ఉండే ఖర్మేమిటనే సందేహం కలుగక మానదు. నిజమే! కానీ అతను 2016లోనే ముంబైలోని ఖరీదైన ప్రాంతం వర్లీలో ఓ ఫ్లాట్ కొన్నాడు. 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫ్లాట్ ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవడంతో ప్రస్తుతానికి అద్దె ఇంట్లో ఉంటోంది ఈ జంట.

లంక బేల... బంగ్లా హేల...

లంకను బంగ్లా మళ్లీ దెబ్బకొట్టింది. తొలి లీగ్ మ్యాచ్‌లో వారిపై భారీ స్కోరు ఛేదించి ఆశ్చర్యపరిచిన ఈ జట్టు... ఒత్తిడి, ఉత్కంఠ, వివాదం మధ్య సాగిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ జయభేరి మోగించి ఫైనల్‌కు చేరింది.

చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుకు షాక్

- మహ్మదుల్లా అద్భుత ముగింపు
- ఆదివారం భారత్‌తో బంగ్లాదేశ్ టైటిల్ పోరు

కొలంబో: తమ దేశ 70వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న నిదహస్ ట్రోఫీ ముక్కోణపు టి20 టోర్నీలో శ్రీలంక ఫైనల్‌కు చేరలేకపోయింది. శుక్రవారం ఇక్కడ జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 2 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది. భారీ స్కోర్లు నమోదవకున్నా చివరి ఓవర్ వరకు విజయం దోబూచులాడిన ఈ పోరులో మహ్మదుల్లా (18 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సలు) వీరోచితంగా ఆడి బంగ్లాకు అద్భుత విజయాన్ని అందించాడు. అంతకుముందు లంక 7 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. అనంతరం ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (42 బంతుల్లో 50; 4 ఫోర్లు, 2 సిక్స్), మిడిలార్డర్‌లో ముష్ఫికర్ (25 బంతుల్లో 28; 2 ఫోర్లు)లకు తోడు మహ్మదుల్లా కడవరకూ నిలవడంతో బంగ్లాదేశ్ 8 వికెట్లు కోల్పోయి 19.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. చివరి ఓవర్‌లో 12 పరుగులు చేయాల్సి ఉండగా... తొలి రెండు బంతులకు పరుగు రాలేదు. రెండో బంతికి నాన్ స్ట్రైక్ ఎండ్‌లో ముస్తఫిజుర్ రనౌట్ కావడంతో మహ్మదుల్లాకు స్ట్రైకింగ్ వచ్చింది. ఈ దశలో అతడు వరుసగా 4, 2, 6 కొట్టి మ్యాచ్‌ను ఘనంగా ముగించాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో బంగ్లాదేశ్ ఆడుతుంది.

షార్ట్‌పిచ్ బంతుల వివాదం...

అది బంగ్లా ఇన్నింగ్స్‌లో 20వ ఓవర్. గెలవాలంటే 12 పరుగులు చేయాలి. క్రీజులో ముస్తఫిజుర్. బౌలర్ ఉదాన. తొలి బంతి భుజం కంటే ఎత్తులో వెళ్లినా 'నో బాల్' ఇవ్వలేదేమని మహ్మదుల్లా అంపైర్లను అడిగాడు. మరోవైపు ఇదే తరహాలో వచ్చిన రెండో బంతిని పుల్ చేయలేకపోయిన ముస్తఫిజుర్ పరుగుకు యత్నించి రనౌటయ్యాడు. ఈ సమయంలో మైదానంలోకి వచ్చిన బంగ్లా సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు, శ్రీలంక ఆటగాళ్ల మధ్య వాదన మొదలైంది. అంపైర్లు కలగజేసుకుని బ్యాట్స్‌మెన్‌తో మాట్లాడారు. ఈలోగా కెప్టెన్ షకీబ్ సహా బంగ్లా ఆటగాళ్లంతా బౌండరీ దగ్గరకు వచ్చేశారు. షకీబ్ అంపైర్లతోనూ తీవ్ర వాదులాటకు దిగాడు. మైదానం వీడి వచ్చేయాల్సిందిగా తమ బ్యాట్స్‌మెన్‌ను పదేపదే ఆదేశించాడు. అయితే.. బంగ్లా జట్టు మేనేజర్ ఖాలెద్ శాంతపర్చడంతో మహ్మదుల్లా తిరిగి బ్యాటింగ్‌కు వెళ్లాడు. మ్యాచ్ ముగిశాక సైతం ఆటగాళ్ల మధ్య ఇదే ఉద్రిక్తత కనిపించింది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) షబ్బీర్ (బి) షకీబుల్ హసన్ 4; కుశాల్ మెండిస్ (సి) సౌమ్య సర్కార్ (బి) ముస్తఫిజుర్ 11; కుశాల్ పెరీరా (సి) మెహదీ హసన్ (బి) సౌమ్య సర్కార్ 61; తరంగ (రనౌట్) 5; షనక (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 0; జీవన్ మెండిస్ (సి) ముస్తఫిజుర్ (బి) మెహదీ హసన్ 3, తిసారా పెరీరా (సి) తమీమ్ (బి) రూబెల్ 58; ఉడాన (నాటౌట్) 7; ధనంజయ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1–5, 2–22, 3–31, 4–32, 5–41, 6–138, 7–154. **బౌలింగ్:** షకీబుల్ 2–0–9–1, రూబెల్ 4–0–41–1, ముస్తఫిజుర్ 4–1–39–2, మెహదీ 4–0–16–1, మహ్మదుల్లా 4–0–29–0, సౌమ్య సర్కార్ 2–0–21–1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) పెరీరా (బి) గుణతిలక 50; లిటన్ దాస్ (సి) పెరీరా (బి) ధనంజయ 0; షబ్బీర్ (స్టంప్డ్) పెరీరా (బి) ధనంజయ 13; ముష్ఫికర్ (సి) పెరీరా (బి) అపోన్సొ 28; సౌమ్య సర్కార్ (సి) పెరీరా (బి) మెండిస్ 10; మహ్మదుల్లా (నాటౌట్) 43; షకీబుల్(సి) ధనంజయ (బి) ఉడాన 7; మెహదీ హసన్ (రనౌట్) 0; ముస్తఫిజుర్ (రనౌట్) 0; రూబెల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 160.**
వికెట్ల పతనం: 1–11, 2–33, 3–97, 4–105, 5–109, 6–137, 7–148, 8–148. **బౌలింగ్:** నువాన్ ప్రదీప్ 1–0–10–0, ధనంజయ 4–0–37–2, అపోన్సొ 3–0–19–1, తిసారా పెరీరా 2–0–20–0, గుణతిలక 3–0–24–1, జీవన్ మెండిస్ 4–0–24–1, ఉడాన 2.5–0–26–1.



మహ్మదుల్లా



పెరీరాతో బంగ్లా ఆటగాడు నూరుల్ హసన్ వాగ్వాదం

విదర్భ 702/5

నాగ్‌పూర్: రెస్టాఫ్ ఇండియాతో జరుగుతోన్న ఇరానీ కప్ మ్యాచ్‌లో విదర్భ పటిష్ట స్థితిలో నిలిచింది. మూడో రోజు వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి 5 వికెట్ల నష్టానికి 702 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 588/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ (431 బంతుల్లో 286; 34 ఫోర్లు, 1 సిక్స్) క్రితం రోజు స్కోరుకు కేవలం ఒక్క పరుగు మాత్రమే జతచేసి ట్రిపుల్ సెంచరీకి 14 పరుగుల దూరంలో వెనుదిరిగాడు. మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ అపూర్వ్ వాంఖడే (99 బ్యాటింగ్; 12 ఫోర్లు, 2 సిక్సలు), అక్షయ్ వాడ్కర్ (37; 4 ఫోర్లు)తో కలిసి ఐదో వికెట్‌కు 91 పరుగులు జతచేశాడు. అక్షయ్ అవుటయ్యాక మ్యాచ్‌కు వరణుడు అడ్డుపడటంతో ఆట నిలిచిపోయింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తొలి శతకానికి ఒక్క పరుగు దూరంలో ఉన్న అపూర్వ్‌తో పాటు ఆదిత్య సర్వతే (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రత్యర్థి బౌలర్లలో సిద్ధార్థ్ కౌల్‌కు 2, అశ్విన్, నదీమ్ జయంత్‌లకు తలా ఓ వికెట్ దక్కింది. మూడో రోజు అశ్విన్ ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయకపోవడం గమనార్హం. 28 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైన నేపథ్యంలో నాలుగో రోజు విదర్భ ఎప్పుడు డిక్లేర్ చేస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం, 17-3-2018



ఇప్పుడు కొత్త ఫ్రిజ్‌లు వస్తున్నాయి.
లోపల ఉంచినవి.. ఎన్నిరోజులైనా
ఫ్రెష్‌గానే ఉంటాయట.
అలాంటి ఒక ఫ్రిజ్.. హిమాలయాలు!
అక్కడి నుంచి ఫ్రెష్‌గా రాబోతున్నాడు
తలైవర్... ర.. జ.. నీ.. కాం.. త్!!
దేశమంతా వెయిటింగ్.
తమిళనాడంతా స్వెట్టింగ్!
టెన్షన్ పీక్‌లో ఉంది.
హిమాలయాలంత.. పీక్‌లో!

రజనీకాంత్ లైఫ్‌లో కష్టాలు పడి పైకొచ్చారు. సూపర్ స్టార్ అయ్యారు. ప్రతి కష్టంలోనూ ఆయనకు దేవుడో, దేవుడిలాంటి మనిషో తోడుగా ఉన్నారు. అవమానాలు ఎదురైనప్పుడు దేవుడు, ఆర్థికంగా నష్టపోయినప్పుడు దేవుడు. ఆరోగ్యం బాగోలేనప్పుడు దేవుడు. రాఘవేంద్రస్వామి అంటే ఆయనకు భక్తి. హిమాలయ ప్రాంతపు గురూజీలంటే గురి. అందుకే ఏటా హిమాలయాలకు వెళ్లి వస్తుంటారు. ఇప్పుడు అక్కడే గురు యోగిరాజ్ అమర్ జ్యోతీజీ మహారాజ్ సన్నిధిలో గడుపుతున్నారు.

దేవుడు శాసించాడు



హిమాలయ గుహల్లో రజనీ ధ్యాన యాత్ర ఇంకో వారం పాటు సాగుతుంది. 'ధ్యానం' సంతృప్తికరంగా పూర్తయితే ముందనుకున్న ప్రకారమే ఈ నెల 24న చెన్నై తిరిగి వచ్చిన వెంటనే పార్టీ పేరును ప్రకటిస్తారు రజనీ.

ఎన్నికల వేడి ఉన్నా, లేకున్నా తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ మరుగుతూనే ఉంటాయి. ఆ రాజకీయాలు సూపర్‌స్టార్ రజనీకాంత్‌ని కూడా.. ఆయన ప్రమేయం లేకుండానే ఎప్పుడూ మరిగించే ప్రయత్నం చేస్తుంటాయి. అయితే మరిగిస్తే మరిగిపోయే మనిషి కాదు రజనీ! చుట్టూ ఎంత వేడైనా ఉండనివ్వండి, ఆయనెప్పుడూ కూల్ గానే ఉంటారు. ఇప్పుడు మరింత కూల్‌గా ఉండే హిమాలయాలలోకి రజనీ వెళ్లిపోయారు!

కూల్!

'శివాజీ' సినిమాలో రజనీ పంచ్ డైలాగ్. కూలింగ్ గ్లాసెస్‌ని స్టెయిల్‌గా రెండు చేతుల్తో తీసి కళ్లకు పెట్టుకుంటూ అంటాడు.. 'కూల్' అని, అద్దాల్లోంచి చూస్తూ. ఎవర్ని చూసి అంటాడు కూల్ అని! తనని చూసి ఎవరైతే టెన్షన్ పడుతున్నారో వాళ్లను చూసి!

'శివాజీ' పదేళ్ల క్రితమే వచ్చింది. రజనీ మాత్రం ఇరవై ఏళ్లుగా ప్రత్యర్థుల వైపు చూసి 'కూల్' అని అంటూనే ఉన్నారు.

సినిమాల్లో ఆయనకెవరూ పోటీ కంటెస్టెంట్‌లు లేరు. ఉన్నది రాజకీయాల్లోనే. పాలిటిక్స్‌లో కూడా లీడర్లు రజనీని పోటీ అనుకున్నారు కానీ లీడర్లను రజనీ ఎప్పుడూ పోటీ అనుకోలేదు. వచ్చేస్తాడా! కొంప ముంచేస్తాడా! డీఎంకే, అన్నాడీఎంకేల డౌట్. అపోజిషన్‌తో చేతులు కలిపితే? అదీ ఆ పార్టీల డౌట్.

అప్పుడు నవ్వేవాడు రజనీ.

సేమ్ సినిమాలో నవ్వినట్టే.. 'హహాహాహహా' అని! నవ్వి, 'కూల్' అనే డైలాగ్ కొట్టేవాడు.

అయినా రాజకీయాలు కూల్‌గా ఎందుకుంటాయి? ఉంటే అవి హిమాలయాలు అయి ఉండేవి. అప్పుడు రజనీ తమిళ హిమాలయాల్లోనే ఉండిపోయేవారు. అంత దూరం వెళ్లకుండా. చెన్నై నుంచి హిమాలయాలకు రెండువేల కిలోమీటర్ల దూరం. ఫ్లయిట్‌లో ఆరు గంటల ప్రయాణం. రజనీ అక్కడికి వెళ్లి వారం అయింది. ఇంకోవారం అక్కడే ఉంటారు. అక్కడి మహావతార్ బాబాజీ గుహల్లో! ఆ గుహలు పలంపూర్‌లో ఉన్నాయి. పలంపూర్ హిమాచల్‌ప్రదేశ్‌లో ఉంది.

ఏం చేస్తున్నారు రజనీ ఆ గుహల్లో?!

ధ్యానంలోకి వెళ్లి దారులను శోధిస్తున్నారు.

ఎక్కడికి వెళ్లే దారులవి?


రాజకీయాల్లోకి!

రాజకీయాల్లోకా!! తమిళనాడులో ఉన్నవేమిటి? రాజకీయాలు కాదా?!

• ❖ •

తమిళనాడులో మూడురోజుల క్రితం కూడా ఒక కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఆ పార్టీని పెట్టింది దినకరన్. దినకరన్ అనే పేరు పక్కన ఆవిర్భావం అనే మాట పెద్దది. 'పుట్టుకొచ్చింది' అనాలి. కానీ చాలా శ్రద్ధగా, భక్తిగా మదురైలో తన పార్టీ పేరును ప్రకటించాడు దినకరన్. ఆ భక్తి 'అమ్మ' జయలలిత మీద. ఆ శ్రద్ధ.. రాజకీయాల మీద. ఎంతో భక్తిశ్రద్ధలతో పార్టీకి ఆయన పెట్టుకున్న పేరు 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం'. అన్నాడీయెంకే నుంచి అలా గెంటేయగానే, ఇలా బయటికొచ్చి పార్టీ పెట్టేశాడు. అమ్మ క్యాండిడేట్‌గా, అమ్మలేని నియోజకవర్గం నుండి ఆర్కేనగర్ ఉపఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా గెలిచాడు!

తమిళనాడు ముఖ్యమంత్రికి గానీ, ఉపముఖ్యమంత్రికి గానీ రాజకీయాల్లోకి వచ్చేసిన కమలహాసన్ అంటే భయం లేదు. రాజకీయ పార్టీ పెట్టబోతున్న రజనీ అన్నా భయం లేదు. దినకరన్ అంటే ఉంది. తమిళనాడులో ఎప్పటికైనా సీఎం కాగలిగిన శక్తి.. శశికళకూ ఉంది, దినకరన్‌కూ ఉంది. వాళ్లిద్దరి వెనుకా 'అమ్మ' శక్తి ఉంది.



గురువు అమర్ జ్యోతీజీ మహారాజ్‌తో హిమాలయ గుహల్లో రజనీ.

దినకరన్ పార్టీ ప్రకటించిన మర్నాడే రజనీ అల్లుడు ధనుష్, రజనీ ఇద్దరు కూతుళ్లు ఐశ్వర్య, సౌందర్య.. రజనీ పెట్టబోయే పార్టీలో చేరతారని వార్త వచ్చింది. అయితే ఆ విషయానికి ఎవరూ పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. రాజకీయాల్లోకి రాకుండానే రజనీ ఇరవై ఏళ్ల పాటు రాజకీయాల్లో నలిగారు! వస్తారా? లేదా? అనే ప్రశ్నతో. 'వస్తున్నాను' అని ఇరవై ఏళ్ల తర్వాత, డిసెంబర్ 31న రజనీ ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు ఇంకొక ప్రశ్నతో ఆయన నలిగిపోతున్నారు. పార్టీ పెడతారా? లేదా? అని!

హిమాలయాల నుంచి వచ్చీ రాగానే రజనీ, ఇంట్లోకి కూడా వెళ్లకుండా పార్టీ పేరు ప్రకటిస్తారని అంతా ఎదురుచూస్తున్నారు! అయితే ఆయన మాత్రం ఆ మాట చెప్పలేదు! అసలు ఏమాటా చెప్పలేదు.

'తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తాం' అని మాత్రం అన్నారు ఈ హిమాలయన్ ట్రిప్‌లో. 2021లో ఎలక్షన్స్. ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అయితే ఇంకా పేరే ఖరారు కాని పార్టీకి అది పెద్ద సమయమేం కాదు.

• ❖ •

దినకరన్ తన పార్టీ ప్రారంభించిన మదురైలోనే ఫిబ్రవరి నెలలో కమలహాసన్ తన 'మక్కల్ నీది మయ్యం' పార్టీని స్థాపించారు. రజనీతో పోల్చి చూస్తే, కమల్ చాలా త్వరగా రాజకీయాల్లోకి వచ్చినట్లు! చాలా త్వరగా పార్టీ పెట్టినట్లు. 'రాష్ట్రంలో పేదరికం లేకుండా చెయ్యడమే నా ధ్యేయం' అంటున్నాడు కమల్. ఓ పేదవాడొచ్చి ఈ వ్యవస్థను కుప్పకూలుస్తా అని చాలెంజ్ చెయ్యడం అది! కమల్ దగ్గర క్యాష్ లేదు. తలా ఇంత వేసుకుని పార్టీ కార్యాలయాన్ని నడిపించుకునే పరిస్థితి. అయినా వచ్చాడు. 'వస్తారా?' అని రజనీని అడిగాడు. రజనీ నవ్వారు. 'వస్తాను' అన్నారు కానీ 'నీతో వస్తాను' అనలేదు. అంటే.. రజనీ పార్టీ రాబోతోంది!

రజనీ ఏదీ నేరుగా చెప్పరు. నవ్వుతూ చెప్తారు. నర్మగర్భంగా చెప్తారు. అలా కూడా చెప్పలేనప్పుడు 'ఆ దేవుడు శాసిస్తాడు. ఈ అరుణాచలం పాటిస్తాడు' అన్నట్లు చూపుడు వేలికీ, చిటికెన వేలికీ ఉన్న మధ్యవేళ్లు మడిచి సంకేతమిస్తారు! అయితే సంకేతాలను అర్థం చేసుకుని స్పందించే రాజకీయ పరిస్థితులు ఇప్పుడు తమిళనాడులో లేవు.

''అవినీతి ఉంది. దాన్ని అంతమొందించడానికే వచ్చాను'' అని క్లియర్ కట్‌గా అంటున్నాడు కమల్. ఎలాగైనాసరే ఈసారి అన్నాడీఎంకే పవర్‌ను కట్ చెయ్యాలని కరుణానిధి అండ్ సన్స్ క్యాడర్‌కు ఆల్రెడీ స్కెచ్ గీసి ఇచ్చారు.

ఇక సీఎం పళనిస్వామి, డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం అయితే, బీజేపీ జాతీయభక్తికి దీటుగా 'రాష్ట్రభక్తి'ని ప్రదర్శిస్తున్నారు. గురువారం బడ్జెట్ ప్రసంగంలో పన్నీర్‌సెల్వం బీజేపీని నేరుగానే ఎటాక్ చేశారు. తమిళనాడులో ద్రవిడుల శకం అంతరించింది అని బీజేపీ నాయకులు అన్నమాటకు అది గట్టి జవాబు. ఎందుకు గట్టి జవాబు అయిందంటే.. ఎంజీ రామచంద్రన్, జయలలితలతో పాటు, తమ రాజకీయ ప్రత్యర్థి డీయంకేను కూడా కలుపుకుని.. 'ద్రవిడుల పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందింది' అని అన్నారు సెల్వం.

నాయకులనేవాళ్లు ఇంత స్ట్రాంగ్‌గా ఉండాలి. దినకరన్‌లా స్ట్రెంగ్త్ లేకున్నా స్ట్రాంగ్‌గానే మాట్లాడాలి. అయితే రజనీ స్ట్రెంగ్త్ ఏపాటిదో ఇప్పటికీ బయటపడలేదు. అంతకన్నా ప్రమాదకరమైన సంగతి.. తమిళనాడు ప్రజలు గానీ, దేశంలోని రజనీ అభిమానులు గానీ ఆయన పెట్టపోయే పార్టీ కంటే కూడా.. ఏప్రిల్లో, ఈ ఏడాది దీపావళికి విడుదల కాబోయే ఆయన సినిమాలు.. 'కాలా', '2 పాయింట్ ఓ' కోసమే ఎక్కువ ఆసక్తిగా ఎదురుచూడడం!

• ❖ •

హిమాలయ ధ్యానంలో రజనీ కోరుకుంటున్న సాక్షాత్కారం 'ఆధ్యాత్మిక రాజకీయం'. ఈమాట వింతగా ఉంటుంది. కానీ ఆయనే చెబుతున్నారు. 'స్పిరుచువల్ పాలిటిక్స్'ని సాధనచెయ్యడానికి వచ్చానని!

గత శనివారం ధర్మశాల (హిమాచల్‌ప్రదేశ్) ఎయిర్‌పోర్ట్‌లో దిగడంతో రజనీ హిమాలయ యాత్ర ఆరంభమయింది. ఈ వారం రోజుల యాత్రలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడినవి రెండే మాటలు. స్పిరుచువల్ పాలిటిక్స్, స్పిరుచువల్ గవర్నెన్స్. ఆ రెండు మాటలకూ కలిపి ఆయన ఒకే అర్థం చెప్పారు. శుభ్రమైన, ధర్మబద్ధమైన, వివక్షారహితమైన పాలన అని. మరికొంచెం వివరంగా చెప్పమని అడిగినప్పుడు.. ఆయన ఒకటే మాట చెప్పారు. ఎం.జి.రామచంద్రన్‌లా తమిళులను పరిపాలిస్తాను అని చెప్పారు.

• ❖ •

కష్టాల్లో ఉన్నవాళ్లను దగ్గరకు తీసుకోవడం, నష్టాల్లో ఉన్నవాళ్లను పైకి లేపడం; పేదలకు, అనాథలను ఆదరించే సంస్థలకు ఆర్థిక సహాయం చెయ్యడం; విలయాలు, విపత్తు బాధితులకు అవసరమైన విరాళాల కోసం 'సూపర్‌స్టార్' ఇమేజ్‌ను ఉదారంగా వినియోగించడం.. ఇవన్నీ కూడా రాజకీయాలలో భాగమే అయితే.. రజనీ రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నట్లే.

అయితే ఆయన ఇంకా చెయ్యొచ్చు! 'బాషా'లా వేలెత్తి రాష్ట్రాన్ని శాసించవచ్చు. 'బాబా'లా వేళ్లు మడిచి రాష్ట్రప్రజల్ని మెస్మరైజ్ చెయ్యొచ్చు. అలా చెయ్యాలంటే మాత్రం పార్టీ పెట్టాల్సిందే. ఎన్నికల్లో నిలబడాల్సిందే. •



చెట్టు నీడ


నీ వెలుగే నీకు దారి చూపాలి?

అది జపాన్‌లోని ఒక పల్లెటూరు. అక్కడ ఒకాయనకు కళ్లు కనబడేవి కావు. ఒక రోజు ఆయన ఒక పని మీద ఒక పెద్దమనిషిని కలవడానికి వెళ్లాడు. అన్నీ తనకు అలవాటైన తోవలే. మాట్లాడుతూ ఉండగానే చీకటి పడింది. ఇక బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అయితే, ఈయనను ఒంటరిగా తిరిగి ఇంటికి పంపడం పెద్దమనిషికి ఇష్టం లేదు. నాకేం ఫరవాలేదన్నాడు అంధుడు. ఆ కాలంలో జపాన్‌లో వెదురు, కాగితంతో చేసిన లాంతరు వాడేవారు. లోపల క్యాండిల్ ఉండేది. అట్లాంటి లాంతరు ఒకటి వెలిగించి ఇచ్చి, ఇక బయలుదేరమన్నాడు పెద్దమనిషి.

'నాకు ఎటూ కనబడదుకదా! నా చేతిలో లాంతరు ఉంటేనేం, లేకపోతేనేం' అన్నాడు అంధుడు.

'నీకు కనబడదు సరే, దారిలో ఎవరెవరో వస్తుంటారు. కనీసం నీ చేతిలో లాంతరు చూస్తేనైనా వాళ్లు పక్కనుంచి వెళ్లిపోతారు కదా?' అన్నాడు పెద్దమనిషి. 'సరే'నని లాంతరు తీసుకుని, నమస్కారాలు చెప్పి, వీధిలో నడుచుకుంటూ పోతున్నాడు కళ్లు లేని మనిషి. అలా దారిలో కాసేపు ముందుకు సాగాక, ఒక మనిషి నేరుగా వచ్చి ఈయనకు తగిలాడు. 'అయ్యా, ఎటు నడుస్తున్నావు? కనీసం నా చేతిలోవున్న లాంతరైనా కనబడట్లేదా?' అన్నాడు అంధుడు. 'లాంతరా? అదెప్పుడో ఆరిపోయింది' అంటూ చెప్పి ముందుకు సాగాడు ఆగంతకుడు.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నాను. తనకి ప్రపోజ్ చేస్తే 'నో' అంది. నెల రోజుల తర్వాత తనని కలిసి 'మీ ఇంట్లో ప్రాబ్లమా?' అని అడిగాను. ''ఇలాంటివి నాకు ఇష్టం ఉండవు'' అని చెప్పింది. నేను ఫోన్ చేస్తే లిఫ్ట్ చేసేది కాదు. ఒకరోజు వాళ్ల అమ్మ నన్ను కలిసి ''మా అమ్మాయిని లవ్ చేస్తున్నానని చెప్పావటగా..? నిజమేనా..?'' అని అడిగింది. ''అవునాంటీ.. మీరు ఒప్పుకుంటే పెళ్లి చేసుకుంటా'' అని నిజం చెప్పేశాను. ''నాకో చెల్లెలుంది, తనకు పెళ్లి కాగానే మాట్లాడదాం'' అని పాజిటివ్‌గా స్పందించారు. అదే విషయాన్ని ఆ అమ్మాయికి చెబితే, తను నమ్మలేదు. దాంతో తనకు నమ్మకం కలిగించడానికి వాళ్ల అమ్మ చేతే చెప్పించా. అయినా సరే, నాతో కోపంగానే మాట్లాడుతోంది. తనని కూల్ చెయ్యాలంటే నేనేం చెయ్యాలి? ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి... – కృష్ణ

'మధ్యలో మమ్మీ ఎంటి సార్???'
కదా!!!
'ఎక్కడైనా, మమ్మీ రెండు పీకాలి కదా సార్?'
కదా!!!
'ఎందుకు సార్ మమ్మీ అలా చేసింది???'
కదా!!!
'సార్, ఎంటి సార్ మీరు కూడా అమ్మాయి లాగా కృష్ణకి ఝలక్ ఇస్తున్నారు!?!'
నీలూ... పిన్ని పెళ్లి అయ్యేదాకా...
'మధ్యలో ఈ పిన్ని ఎంటి సార్?'
మమ్మీ సిస్టర్ అంటే అమ్మాయికి పిన్నే కదా నీలూ...!
'అవిడ పెళ్లి అయ్యేదాకా కృష్ణారామ అనుకుంటూ కృష్ణ ఉండాలా సార్?'
పిన్ని పెళ్లి అయ్యేదాకా హార్టుకు పిన్నీసు పెట్టుకుని ఉండాలి నీలూ...!
'పెళ్లి తర్వాత పిన్నీసు తీస్తే అమ్మాయి ఒప్పుకుంటుందా సార్ హార్టులోకి చేరడానికి..?'
అప్పటి సంగతి అప్పుడు చూద్దాం నీలూ...
'ఏడిసినట్టుంది. పిన్నీలు, అత్తలు పెళ్లి చేసుకునే దాకా ఆగితే కృష్ణ గర్ల్‌ఫ్రెండ్ కూడా ఓ ఓల్డ్ ఆంటీ అయిపోతుంది కదా సార్?'
కూల్.. కూల్... నీలూ!
'అదే అడుగుతున్నా సార్... కృష్ణ, అమ్మాయిని కూల్ ఎలా చెయ్యాలని?'
పిన్ని పెళ్లి భోజనాల్లో అందరికీ కూల్ డ్రింకులు ఇచ్చి అమ్మాయి మనసు దోచుకుంటాడు కృష్ణ.
'మంచి ఐడియా సార్! అమ్మాయి పిన్ని పెళ్లికి ఎలాంటి హెల్ప్ కావాలన్నా కృష్ణే ముందుండి తంతు నడపాలి సార్. అప్పుడు అమ్మాయి కూల్‌గా ఆలోచించి కృష్ణకి ఓకే చెబుతుంది సార్. యు ఆర్ ఎ జీనియస్ సార్' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

ఫస్ట్ పంచ్ అదిరింది


నాగచైతన్య

మొహంపై గాయం, గంభీరమైన చూపు. వెనక వలయాకారంలో చేతులు. ఒక్కో చేతికి ఒక్కో ట్యాటూ. 'విన్నారి బొమ్మ, క్వొస్చన్ మార్క్స్, 21, మహా, అక్క, ప్రేమ గుర్తులు'.. ఆ పచ్చబొట్లే నాగచైతన్య ఫస్ట్ పంచ్ విశేషాలు. 'ప్రేమమ్' వంటి హిట్ చిత్రం తర్వాత నాగచైతన్య–చందూ మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సవ్యసాచి'. ఇందులో నిధి అగర్వాల్ కథానాయిక. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై రవిశంకర్, నవీన్ ఎర్నేని, సీవీయం మోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ పంచ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఫస్ట్ పంచ్ పేరుతో రిలీజ్ చేసిన నాగచైతన్య ఫస్ట్ లుక్ ఇటు చిత్రవర్గాల్లో అటు అభిమానుల్లో సూపర్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాలో హీరో పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ఈ పోస్టర్‌తోనే చెప్పేసింది చిత్రబృందం. నాగచైతన్య లుక్ చూశాక అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. మాధవన్, భూమిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

చిట్టిబాబుకి టాటా


రామ్‌చరణ్

గళ్ల లుంగీ, గళ్ల చొక్కా, గుబురు గడ్డం... కొన్ని నెలలుగా రామ్‌చరణ్ ఇలానే కనిపించారు. చిట్టిబాబులా ఈ గెటప్‌లోనే 'రంగస్థలం'లో మనకు కనిపించబోతున్న విషయం తెలిసిందే. దాదాపు పది నెలలు తర్వాత చిట్టిబాబులో నుంచి చరణ్ బయటకు వచ్చేశారు. చిట్టిబాబులో నుంచి బయటకు రావడం ఏంటి అనుకుంటున్నారా? 'రంగస్థలం' సినిమాలో ఆయన పోషించిన చిట్టిబాబు పాత్రకు టాటా బై బై చెప్పేశారు. రీసెంట్‌గా 'రంగస్థలం' సినిమాకు గుమ్మడికాయ కొట్టేశారు. దాంతో చిట్టిబాబు పాత్ర కోసం పెంచిన గుబురు గడ్డాన్ని ట్రిమ్ చేసి స్టైలిష్ లుక్‌లోకి మారిపోయారు చరణ్. కొన్ని నెలలుగా మెలి తిరిగిన మీసాలు, గుబురు గడ్డంతో చరణ్‌ని కొత్తగా చూసి, ఖుష్ అయిన ఫ్యాన్స్ ఇప్పుడు చరణ్ కొత్త లుక్‌ని చూసి ఆనందపడుతున్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో చేయబోతున్న సినిమా కోసమే చరణ్ స్టైలిష్ లుక్‌కి మారారు. ఈ చిత్రంలో చరణ్ పాత్ర చాలా స్టైలిష్‌గా ఉంటుందని, లుక్ డిజైన్ కోసం బాలీవుడ్ స్టైలిస్ట్‌ను సంప్రదించారని సమాచారమ్.

నిధి కోసం అన్వేషణ


ప్రభుదేవా, హన్సిక

ప్రభుదేవా, హన్సిక జంటగా సీనియర్ నటి రేవతి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తమిళనాట సంక్రాంతికి విడుదలై ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ అదేపేరుతో తెలుగులోకి అనువదిస్తున్నారు. ఏప్రిల్ 6న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''యూనివర్సల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో కథ కొనసాగుతుంది. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్. ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన సినిమాకి ప్రధాన ఆకర్షణ. తెలుగు నేటివిటీకి తగ్గట్టు మార్పులు చేశాం. తమిళ ప్రేక్షకులు ఆదరించినట్టే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఇటీవల విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది'' అన్నారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్ రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్‌ఎస్ ఆనంద్ కుమార్.

ఇంద్రు.. నేత్రు.. నాళై...


సందీప్

... అర్థం కావడం లేదా? ఇవాళ, నిన్న, రేపు అని అర్థం. తమిళంలో ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఆ పేరుతో సందీప్ కిషన్ ఓ సినిమా చేయనున్నారని టాక్. తెలుగు సినిమాలతో పాటు సందీప్ తమిళ – తెలుగు బైలింగ్వల్ సినిమాలు కూడా చేస్తుంటారు. ఈసారి 'ఇంద్రు నేత్రు నాళై' అనే తమిళ చిత్రం తెలుగు రీమేక్‌లో నటించనున్నారట. సురేష్ బాబు, రాజ్ కందుకూరి నిర్మించనున్న ఈ సినిమా ద్వారా శ్రీరామ్ అనే కొత్త దర్శకుడు పరిచయం కానున్నారని సమాచారమ్. ఏప్రిల్ నెలాఖరున ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.

నాకు సున్నా మార్కులేశాడు!


కత్రినా కైఫ్

కమిలి కమిలి (ధూమ్ 3–2013), చిక్నీ చమేలి (అగ్నిపత్–2012), షీలాకి జవానీ (థీస్ మార్ ఖాన్–2010)... ఇప్పటికే మీకు గుర్తొచ్చి ఉంటుంది. ఈ సాంగ్స్‌లో హీరోయిన్ కత్రినా కైఫ్ కుర్రకారును ఏ లెవల్లో ఊర్రూతలూగించారో. ఆ పాటల్లో కత్రినా చేసిన డ్యాన్స్‌కు ఎంతోమంది ఫిదా అయ్యారు. అలాంటి కత్రినా కైఫ్ కెరీర్ స్టార్టింగ్‌లో డ్యాన్స్‌తో కాస్త ఇబ్బందిపడ్డారట. ఈ విషయం గురించి కత్రినా చెబుతూ– ''తెలుగులో ఓ స్టార్ హీరోతో సినిమా చేశాను. అప్పట్లో నా డ్యాన్స్ స్కిల్స్ సరిగ్గా లేకపోవడం వల్ల సాంగ్స్ షూట్‌కు టైమ్ పట్టింది. అప్పుడు ఆ కొరియోగ్రాఫర్ నన్ను ఏమీ అనలేదు. ఆ తర్వాత అదే కొరియోగ్రాఫర్ ఓ హిందీ సినిమాకు వర్క్ చేస్తున్న టైమ్‌లో కత్రినా కైఫ్‌కు డ్యాన్స్‌లో 'జీరో మార్క్స్' అన్నారని నా సన్నిహితులు నాతో చెప్పారు. అది విని షాక్ అయ్యాను'' అని పేర్కొన్నారు. ఇంకా చెబుతూ– ''డ్యాన్స్‌లో నేను కాస్త వీక్ అని నాకు తెలుసు. అయితే నాతో విషయం చెప్పకుండా వేరేవాళ్ల దగ్గర నన్ను విమర్శించడం బాధ అనిపించింది. ఆ తర్వాత కథక్ గురు వీరు కృష్ణణ్ పర్యవేక్షణలో డ్యాన్స్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకున్నాను. ప్రతిరోజూ 12 గంటలకు పైగా సాధన చేశాను. కొరియోగ్రాఫర్ బాస్కో సీజర్ నాలో ఆత్మవిశ్వాసం నింపారు'' అన్నారు కత్రినా. విజయ్ కృష్ణ ఆచార్య దర్శకత్వంలో ఆమిర్‌ఖాన్, అమితాబ్ బచ్చన్, కత్రినా, ఫాతిమా సనాషేక్ ముఖ్య తారలుగా రూపొందుతున్న 'థగ్స్ ఆఫ్ హిందోస్తాన్' సినిమాలో ఓ డ్యాన్స్ నంబర్‌కు ఇటీవల కాలు కదిపారామె . ఈ సాంగ్స్ గురించి మాట్లాడుతున్నప్పుడే ఈ విషయాలు పంచుకున్నారు.

న్యూ టాలెంట్


సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్‌లోని నటుడు మనందరికీ ఎప్పటినుంచో పరిచయమే. ఆ తర్వాత పెయింటర్‌గా, సింగర్‌గా మారి ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు తనలో దాగున్న మరో కొత్త టాలెంట్‌ను బయటకు తీశారు సల్మాన్. తాజా చిత్రం 'రేస్ 3' కోసం ఆయన పాటల రచయితగా మారారు. ఈ సినిమాలో హీరో,హీరోయిన్ మధ్యలో వచ్చే ఓ రొమాంటిక్ సాంగ్‌ను ఒక ప్రముఖ రచయితతో రాయించాలని చిత్రబృందం చూస్తుంటే 'నేను రాసుకున్న పాట ఒకటి ఉంది' అని, తను రాసుకున్న పాటను చదివి వినిపించారట సల్మాన్. టీమ్ అందరికీ ఆ పాట బాగా నచ్చిందట. వెంటనే ఆ పాటకు మ్యూజిక్ కంపోజ్ చేసే పనిలో పడ్డారట సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా. ఈ రొమాంటిక్ సాంగ్‌ను సల్మాన్, జాక్వెలిన్‌పై నృత్యదర్శకుడు రెమో డిసౌజా చిత్రీకరించనున్నారట. ఈ చిత్రాన్ని ఈ ఏడాది రంజాన్‌కి విడుదల చేయాలనుకుంటున్నారు. సో.. సల్మాన్ ఖాన్‌లోని ఈ న్యూ టాలెంట్‌ను మనం రంజాన్‌కు వినొచ్చన్నమాట. ఆ సంగతలా ఉంచితే.. సల్మాన్ లవర్స్ లిస్ట్ చాలానే ఉంది. సంగీతా బిజలానీ, ఐశ్వర్యా రాయ్, కత్రినా కైఫ్, లూలియా వంటూర్.. ఇంకా కొంతమంది ఉన్నారు. మరి.. వీళ్లల్లో ఎవరి కోసం సల్మాన్ ఆ రొమాంటిక్ సాంగ్ రాశారో?

గ్యాంగ్ వార్


అవినాష్

'మంగళ', 'క్రిమినల్స్' వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతోన్న మరో డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వెపన్'. అవినాష్, ప్రదీప్ రావత్, రాజారాయ్, రాజు, మధుబాబు ప్రధాన పాత్రల్లో ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వంలో శర్మ చుక్కా నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ మార్చి 20న మొదలవుతుంది. శర్మ చుక్కా మాట్లాడుతూ– ''రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే వార్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. టైటిల్‌కి పూర్తి జస్టిఫికేషన్ ఇచ్చే కథాంశంతో మా సినిమా ఉంటుంది. మా బ్యానర్‌లో వచ్చిన 'మంగళ, క్రిమినల్స్' చిత్రాల కంటే 'వెపన్' మంచి విజయం సాధిస్తుందని నమ్మకంగా చెప్పగలను. 90 శాతం చిత్రీకరణ పూర్తయింది. వేసవిలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సబ్బారపు ప్రకాష్.

కాసుకో సుడోకు

			1		9		3	
	3	4	8				1	
7	1	2	5			6		
6	8			2			4	
1	9						5	6
	2			1			7	9
		6			4	1	2	7
	4				6	9	8	
	7		2		1			

నిబంధనలు:
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

9	4	1	8	6	5	3	7	2
2	5	6	4	7	3	1	9	8
7	3	8	2	9	1	4	6	5
5	1	4	6	2	9	8	3	7
8	9	3	5	1	7	6	2	4
6	2	7	3	8	4	9	5	1
1	7	5	9	4	6	2	8	3
3	6	2	1	5	8	7	4	9
4	8	9	7	3	2	5	1	6

రాశి ఫలాలు (సౌరమానం)

జన్మనక్షత్రం తెలియదా?
నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా?
మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (మార్చి 17 నుంచి 23 వరకు) మీ రాశి ఫలితాలు



డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)



నేనే కదా అధికారిని, నాకు తిరుగేముంది? అన్ని పనులూ అయి తీరుతాయనుకోకండి. ఎంత సింహమైనా నోరు తెరుచుకుని కూచున్నంత మాత్రాన తమంత తాముగా ఏ మృగాలూ నోటిలోనికి రానేరావు. వేటాడి తీరాల్సిందే! అలాగే మీరు కూడా భరోసాని మాని గట్టిగా ప్రయత్నాన్ని చేయక తప్పదు. ఆ కారణంగా అనుకున్న పని కాకుండానూ మానదు. మనకి పని కావడం ముఖ్యమా? అధికారం, హోదా ముఖ్యమా?

ఒక ముఖ్యమైన కార్యం పట్ల తగినంత అవగాహన లేకుండానూ దాన్ని కప్పి పుచ్చుకునేందుకు కొంత అస్పష్టతతోనూ మాట్లాడే అవకాశముంది. అంతేకాదు, కొంత తక్కువ సొమ్ముతో ఆ ముఖ్యమైన కార్యం కాకపోతుందా? అని మీరనుకోవచ్చు. అయితే మీరు మాత్రం సంకోచం– మొహమాటం– బిడియం– లాభం వస్తుంది కదా అనే చిరు అపోహ(ల)తో ఉండడం వల్ల పని చెడే అవకాశం ఎక్కువుంది. పోతే పోనియ్యండి కొంత సొమ్ముని! నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడి పనిని సానుకూలం చేసుకోండి!

ఇతరుల పనులూ ఇతరమైన పనులూ భుజాన వేసుకున్న కారణంగా మీ పనుల విషయానికొచ్చేసరికి, సమయం తక్కువ కావడం– పని అవుతుందా? కాదా అనే ఆందోళనకి గురి కావడం జరుగుతుంది. ఓ ప్రణాళికని వేసుకోవడమే కాకుండా, ఇతరులకి కూడా కొన్ని బాధ్యతలను అప్పగించండి. సంకోచం లేకుండా– తన్నుమాలిన ధర్మ మనే సామెతని గుర్తు చేసుకుని మీ పనులు అవుతాయనే గట్టి నమ్మకం కుదిరిన మీదటే ఇతరులకి సాయపడతానని చెప్పండి.

రావలసిన బాకీలు చేతికొస్తాయి. ఎప్పుడో దాచుకున్న సొమ్ము కూడా మరింత అయి మీచేతికందుతుంది ఈ వారంలో.

లౌకిక పరిష్కారం: మొగమాటం వద్దు. మీ పనులయ్యాకే ఇతరులకి సాయపడండి.
అలౌకిక పరిష్కారం: శ్రీ విష్ణు సహస్ర నామాలని రోజుకి ఓ మారు పఠిస్తూ ఉండండి.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)



పిండి కొద్దీ రొట్టె అన్నట్టుగా ఎంతగా మీరు కృషి చేస్తే అంతగా సత్ఫలితం లభించే అవకాశమున్న అదృష్టకాలం ఇది. ఈ కారణంగా తాత్కాలికమైన ఆలోచనలూ, ప్రణాళికలూ కాకుండా సుదూరకాల ప్రణాళికలని వేయండి. మీ వాడు వైద్యవిద్యలో చేరబోతుంటే ఒక ఆసుపత్రిని నిర్మించడం... అంతటి ఆలోచన చేయాలన్నమాట! ఒట్టిగా గొంతెమ్మ కోరికలు కావు. ఫలించే ప్రణాళికలివి. గమనించండి.

ఒక గృహం ఒక వాహనం ఒక పొలం ఒక స్థిర ఉద్యోగం... ఇలా అన్నీ మీకు సమకూరుతాయి. ఇప్పటికే ఇవన్నీ గాని ఉన్నట్లయితే, మీ పై అధికారుల దృష్టి మీ మీద ఎంతో అనుకూలంగా ఉన్న కారణంగా, మీరు చేస్తున్న ఉద్యోగంలో కొన్ని కొత్త ఆర్థిక ప్రయోజనాలు మీకు సిద్ధించే అవకాశం బాగా ఉంది. ఎంత ఎదుగుతారో అంతగానూ ఒదిగి ఉండండి. మీ ఎదుగుదలకి అదే మీ పెట్టుబడి.

మీరు చేస్తున్న ఉద్యోగం మీకెలా పాడికుండలా ఉంటూ అంతా కలిసొచ్చేలా చేస్తుందో, అదే తీరుగా మీరు చేస్తున్న చిరువ్యాపారం కూడా మెల్లమెల్లగా ఎదిగి కలిసొచ్చేలా చేస్తుంది. ఏవేవో ప్రలోభాలకి గురై వంచన వైపుగా మీరు వ్యాపార విషయంలో గాని అడుగులేస్తే, పెద్ద ఇబ్బందికి గురయ్యే పరిస్థితి ఉంది కాబట్టి, ధర్మబద్ధంగానే వ్యవహరించండి. ఆదాయం తక్కువే కావచ్చు కాని, మనశ్శాంతి ప్రధానం కదా! గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.

ధనంతో ధనాన్ని సంపాదించే చీటీలూ షేర్లూ... మొదలైనవి మిమ్మల్ని అతిశీఘ్రంగా పై పైకి తీసుకెళ్లిపోతాయి. క్రమ క్రమంగా కాకుండా ఒక్కసారిగా పైకి వెళ్లిన ఎవరూ గొప్పవాళ్లు కాలేదు. ఎదిగినంత ఎత్తు నుండి ఒక్కమారుగా– సముద్ర తరంగంలా ఉవ్వెత్తున ఎగిసి చప్పబడ్డట్టుగా, కిందికి పడిపోతారు జాగ్రత్త! అత్యాశ వద్దు.

లౌకిక పరిష్కారం: అత్యాశా, ఆలోచన, వంచనతో కూడిన వ్యాపారం వద్దు.
అలౌకిక పరిష్కారం: మీకిష్టమైన దేవాలయానికి వారంలో ఏడురోజులపాటూ దర్శనానికి వెళ్లండి.

మిథునం
(మే 21 - జూన్ 20)



నాటిన మొక్కకి ప్రతిరోజూ నీరు పోస్తూ తగినంత ఎండ తగిలేలా చూసుకోని పక్షంలో ఆ మొక్క ఎంతటి చందనానికి సంబంధించినది అయినా ఎదుగుదల లేకుండా అయి క్షీణించడం ప్రారంభిస్తుందో, అదే తీరుగా మీ దంపతి ఎంతెంత ప్రతిష్ఠ గల కుటుంబాల నుండి వచ్చినా సమయం చూసుకుని తగినంత సేపు కలిసి గడప(లే)ని పక్షంలోనూ, అన్యోన్యంగా మాట్లాడుకోలేని పక్షంలోనూ దాంపత్యబంధంలో చిన్న అపశ్రుతికి అవకాశం రావచ్చు. రోగిగా మారాక ఔషధసేవ చేసుకునే కంటే, రోగనిరోధక పద్ధతుల్ని పాటించడం ఉత్తమం.

మీ నిజాయితీ ధోరణీ, సమయ పాలన పద్ధతీ, చెప్పిన పనిని చెప్పిన తీరులో ముగించే క్రమశిక్షణా, విశేషించి వినయ లక్షణం అనేవి మీకు చేయించని ఆభరణాలు. ఆ కారణంగా మీపైనా, అలాగే కిందా ఉండే ఉద్యోగులు మిమ్మల్ని అభిమానిస్తూనే ఉంటారు. ఎంతటి పవిత్రుడైన వశిష్ఠునిక్కూడ విశ్వామిత్రుని కోపం అహంకారం కారణంగా ఆశ్రమానికీ తనకీ కూడా అపకారం జరిగినట్లుగా, మీ గొప్పదనం నచ్చని కొందరి కారణంగా మీరంటే గిట్టని ఓ చిన్న వర్గం మీకు ఏర్పడవచ్చు. ఎవరెవరు ఏమేమనుకుంటున్నారంటూ ఆరాలు తీసుకోకుండా, మీ పనిని మీరు అంకితభావంతో నెరవేర్చుకుంటూ వెళ్తే చాలు. ఈ శత్రు సమూహాలన్నీ గాలికి మేఘాల్లా చెదిరిపోయి దూరంగా సాగిపోతాయి. పైగా మీకు ఏ మాత్రమూ భయం లేదనే విషయం వారికి అర్థమై మీ పట్ల తగిన దూరంలో ఉంటారు కూడా.

వర్షకాలంలో ఎండ వచ్చేటట్టూ, ఎండల కాలంలో వర్షం వచ్చేటట్టూ అవి ఏమాత్రమూ ఎలా శాశ్వతంగా ఉండేవి కానట్లూ మీ మీద కూడా మీ పైవారికి చిన్న చిన్న కోపతాపాలూ పట్టింపులూ ఉండవచ్చు. అయితే వాటిని బుద్ధికి పట్టించుకోవలసిన అవసరమే లేదని గ్రహించండి.

లౌకిక పరిష్కారం: మీ రుజువర్తనం సమయపాలనా అనేవి మీకు సహజ కవచ కుండలాలని భావించండి.
అలౌకిక పరిష్కారం: శివాలయానికి వెళ్లి కొంతసేపు మౌనంగా ధ్యానించండి ఆలయ ప్రాంగణంలోనే.

కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)



వ్యక్తిగతంగా మీకు మానసిక బాధ ఉండకకపోవచ్చు కాని, మీ సంతానానికో, మీ ఆప్తులకో చెందిన ఓ సమస్య ఇంకా అపరిష్కృతంగానే ఉండే కారణంగా మీరు మనోవ్యధకి గురౌతూనే ఉంటారు. దూరంగా నిప్పుమంట ఉన్నా, దాని మీదినుండి వీచే గాలికి ఆ ఆ వేడిమి చేరి వెచ్చని గాలినే వీచేలా చేస్తుంది ఆ మంట.

ఏ సందర్భంలోనూ కూడా నోరు జారడమనేది మీకు సరిపోదు. మీ ప్రత్యర్థులు దాన్నే ఒక పెద్ద అభియోగంగా మార్చి, విషయాన్ని ఎంత దూరంగానైనా పోయేలా సాగదీయవచ్చు. కాబట్టి తక్కువ మాట్లాడండి– మాట్లాడే ఆ నాలుగు మాటల్లోనూ ఇతరులని తూలనాడే మాటలని రానీయకండి. తూలనాడడమనేది బహిరంగంగా అయితే శత్రువులు సూటిగా విని ఇబ్బందికి గురిచేస్తారు. చాటుగానైతే ఆ విన్నవారు తమ పైత్యాన్ని కూడా జోడించి ప్రతిపక్షం వారికి చెప్పి, ఇబ్బందిని మరింతగా చేస్తారు. ఎలాగైనా ఇబ్బందికి గురయ్యే తీరుతారు కాబట్టి మాట్లాడే మాటలని జల్లెడ పట్టండి.

వ్యక్తిగతంగా మీకు ఇది మంచి కాలం. సుఖసంతోషాలతో ముందుకి సాగిపోగలరు. ప్రతిపనిలోనూ ఇతరులతో పోటీనీ, పోలికనీ పెట్టుకోకండి. దానివల్ల ఆత్మన్యూనతాభావం కలిగి ప్రోత్సహించాల్సిన మీ మనసు మిమ్మల్ని నిరాశాపక్షం వైపుకి తీసుకుపోవచ్చు. మాటని జారకుండా ఉండడం అలాగే మాటని పడడమనే రెండూ మీ వ్యక్తిత్వానికి నచ్చనివి కాబట్టి, ఆ ధోరణిని అలాగే కొనసాగిస్తూ, అలాంటి సన్నివేశాలకి దూరంగా ఉండండి.

లోగడ జరిగిన చర్చలనీ, మీ ఓటములనీ వెనక్కి వెనక్కి వెళ్తూ గుర్తు చేసుకోవడం వల్ల ముందున్న పని చెడుతుంది. కాలహరణం అవుతుంది తప్ప, రాబోయేదంటూ ఏమీ ఉండదు. మీ భార్య/భర్త క్కూడ ఈ విషయాన్ని చెప్పి వెనక్కి నడవద్దు. గుర్తు చేసుకోవద్దని చెప్పండి.

లౌకిక పరిష్కారం: మనోవ్యధ మీకు మీ గురించి కాదు కాబట్టి మీరు ధైర్యంగా ఉంటూ వాటికి దూరంగా ఉండండి.
అలౌకిక పరిష్కారం: ఆదిత్యహృదయ స్తోత్రాన్ని రోజుకి ముమ్మారు పఠించండి.

సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)



దశ అంత అనుకూలంగా లేనప్పుడు ప్రతి విషయమూ మరో విధంగానే జరుగుతూ వెళ్తుంది. ఎంతగా ఖర్చుని నియంత్రించాలని ప్రయత్నించినా అనారోగ్యమో మరొక కారణంతోనో పెరుగుతూనే ఉంటుంది. అయితే అదృష్టమేమంటే, ఎప్పటికి సరిపడిన సొమ్ము అప్పటికి దొరుకుతూ ఉండడం – ఋణం చేయాల్సిన స్థితిని దాటగలగడం. తల్లిదండ్రులకి కొద్ది సాధారణమైన ఆరోగ్య పరీక్షలని క్రమం తప్పక చేయించుకుంటూ ఉండండి. ఏ ఇబ్బందీ రాదు – ఉండదు.

ఆందోళనతో, కంగారుతో అప్పటికప్పుడు ఏ నిర్ణయాన్నీ తీసుకోవడం సరికాదు. దీంతోపాటు ఏదో ఒక నిర్ణయాన్ని చేసే అలవాటున్న వ్యక్తితో సహవాసం అసలు సరికాదు. 'మా పలుకుబడే అధికారం... సామాన్యం కాదు' అనే ఈ తీరు ప్రగల్భాలు పలికేవారు మీకు దగ్గరయ్యే ప్రమాదముంది. చక్కటి పడవలో ప్రయాణిస్తున్న మీరు ఈ చిల్లు పడవతో మీ పడవని ముడివేసుకోకండి.

ఇంటి యజమాని ఉండే ఇంట్లో అద్దెకి ఉండటం, పై అధికారికి సమీపంగా ఉన్న ఇంట్లో ఉండడం అనే రెండూ సరికావని (అత్యాసన్నాశ్చ రాజానః) శాస్త్రం చెప్పిన మాట. ఎంత చెడ్డా అధికారి అనేవాడు అధిక (ఎక్కువ) అరి (శత్రువే) మాత్రమే. అందుకే వీలయినంత చెప్పొచ్చేదేమంటే మీకు తాత్కాలికంగా అధికారుల నుండి ఒత్తిడి రావచ్చు. భయపడకండి. అధైర్యపడకండి. మరొకర్ని సహాయకులుగా తీసుకుని (కొంత వ్యయం అయినా సరే) పని పూర్తిచేసి మనశ్శాంతిని పొందండి.

'ధైర్యే సాహసే లక్ష్మీః' ధైర్యం–దానికి తోడుగా వెంటనే పనిని ప్రారంభించగల నేర్పరితనం ఉన్నవానికి పరాజయమంటూ ఉండదు. మీరు సింహ రాశివారు. కాబట్టి ధైర్యానికి లోటు లేదు. అయితే పరిస్థితులు తాత్కాలికంగా అనుకూలించక పనిలో నేర్పరితనాన్ని చూపించగల అవకాశం ఉండకపోవచ్చు ప్రస్తుతానికి. భయపడకండి. తగిన సమయం దగ్గర్లోనే రాబోతోంది. ఎదురు చూడండి.

లౌకిక పరిష్కారం: ఉత్సాహపరులతోనే గడపండి. ఋణాన్ని చేద్దామనే ఊహని రానీయకండి.
అలౌకిక పరిష్కారం: గణపతి అధర్వ శీర్షాన్ని రోజుకొక్కమారు పారాయణం చేసుకోండి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)



ఏ పనైనా జరక్కుండా ఉండాలంటే ఏం చేయాలి? అనేదానికి చాణక్యుడు ఓ మాటని చెప్పాడు కదా! ఆ పనిని ఇద్దరు తెలివైనవారి మధ్య పడెయ్యం–డని. దాంతో ఆ ఇద్దర్లో ఒకరు తనకి ఆ పని వీలు తెలుసంటే, మరొకరు కాదు, ఈ ధోరణితో చేసే విధానం మంచిదంటూ దానిని వ్యతిరేకిస్తాడు. ఈ వాదోపవాదాలని వినే మనకి – పనిలో ఉండే లొసుగులు – తెలుస్తాయి. తద్వారా పని చేయడానికీ ప్రారంభించడానికీ ఓ భయం ప్రారంభమౌతుంది. ఇంత ఎందుకంటే – మీరు ఏ పనినైనా ప్రారంభించదలిస్తే ఓ ఇద్దరి మధ్య ఆ పనిని చర్చకి పెట్టకండి. వాదాలాడకండి. సమర్థుడైన ఏ ఒకరినో ఎన్నుకోండి. పనిని కష్టమో నష్టమో ప్రారంభించెయ్యండి. తప్పక పని పూర్తి అవుతుంది. అయితే కొంత అదనంగా వ్యయం అవుతుంది. 'మీకు మరెవరైనా ఓ పనిని ఇంత సొమ్ముని చేసి పెట్టవలసిం'దని కోరితే కాదనకండి. తప్పక ఆ పనిని గురించిన అవగాహన మీకుంటుంది కాబట్టి ఒప్పుకోవచ్చు. ఒకవేళ లేదనే అనుకుందాం – శ్రద్ధ పెట్టి చేసే ధోరణి మీది కాబట్టి చక్కని అనుభవ జ్ఞానం వస్తుంది ఈ పనిలో. అది ముందు నాటికి మీకు ప్రయోజనపడుతుంది. పనిని 'వద్దు' అనకండి. దశరథుడంతటివాడు పట్టాభిషేకానికి అన్ని ఏర్పాట్లనీ చేసుకుని కూడా కేవలం ఒక భార్య వ్యతిరేకత కారణంగా అందరి మధ్యా అప్రతిష్ఠ పాలయ్యాడు. ఆ కారణంగా మీ ప్రతిపాదనని భార్య/భర్తకి చెప్పి చేయడం ఎంతైనా అవసరం. పక్షి అనేది ఎగరాలంటే రెండు రెక్కలుంటేనే సాధ్యం అనుకోకూడదు – రెంటినీ సమాన శక్తితో సమాన వేగంతో ఆడించినప్పుడే సాధ్యం అని గమనించండి. శరీరమనేది అనారోగ్యానికి గురైతే దాని ప్రభావం మనసు మీద పడి మనసు నిరంతరం నిరుత్సాహానికి గురిచేస్తూంటుంది వ్యక్తిని. అలాగే మనసు అనారోగ్యానికి గురైతే శరీరంలో సత్తువ అనేది ఉండనే ఉండదు. శరీరారోగ్యానికి ఔషధ సేవనీ, మానసిక ఆరోగ్యానికి దైవ దర్శనం చేయడం ఉత్తమం. రెంటినీ చేయాల్సిన అవసరం ఉంది.

లౌకిక పరిష్కారం: అనవసర విషయాలని మనసుకి పట్టించకండి – అనవసర దృశ్యాలని కళ్లకి చూపించకండి
అలౌకిక పరిష్కారం: వినాయకుని 16 నామాలనీ నిరంతరం పఠిస్తూ ఉండండి.

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి:
గురువారం సాయంకాలం కలిసొచ్చిందిరా
అదృష్టం అర మీటరు దూరంలో ఉందిరా
నిన్న కన్న కలలే బ్లాక్ అండ్ వైటు నేడు కలరైపోయెలే
చకచక సమయం బ్రేకులేసి నాకు సైడిచ్చిందిలే
కలలోన అరెరెరెరె కనిపించి అలెలెలెలే
ముద్దాడి అయయయ్యయ్యో పిచ్చిపిచ్చి ఊహలేవో
ఒన్స్‌మోర్
కలలోన అరెరెరెరె కనిపించి అలెలెలెలే
ముద్దాడి అయయయ్యయ్యో పిచ్చిపిచ్చి ఊహలేవో

చరణం:
గాల్లో తేలా మూనెక్కి ఊగేశా ఉయ్యాల
తొలిప్రేమల్లో ఆఫ్‌కోర్స్ ఇవి మామూలే
మాయో హాయో మీ కన్నుల్లో ఏదో ఉందిలే
ఉన్నట్టుండి తలకిందులు అయ్యాలే
మతిపోయెనే అతిగా అడిగింది నీ జతగా
పదపదమంటూ పరుగు తీసే ఆపలేనీ తొందర
నిన్ను చూడగానే గంతులేసే మనసు చిందర వందర
కలలోన అరెరెరెరె కనిపించి అలెలెలెలే
ముద్దాడి అయయయ్యయ్యో పిచ్చిపిచ్చి ఊహలేవో
ఒన్స్‌మోర్
కలలోన అరెరెరెరె కనిపించి అలెలెలెలే
ముద్దాడి అయయయ్యయ్యో పిచ్చిపిచ్చి ఊహలేవో
॥ గురువారం ॥ ॥ కలలోన॥

చిత్రం: కిర్రాక్ పార్టీ; **రచన:** రాకేందు మౌళి
సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్; **గానం:** విజయ్ ప్రకాశ్

కట్‌చేయ్...దాచేయ్...

పరి పరిశోధన

ఈ త్రీడీ ప్రింటెడ్ ఇంటి ధర రూ. 2.5 లక్షలే!

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ సాయంతో చిన్న వస్తువులను తయారుచేసుకోవచ్చునని చాలాకాలంగా తెలుసుగానీ.. ఇళ్లను ప్రింట్ చేసుకునే విషయం మాత్రం ఇంకా ప్రయోగ దశలోనే ఉంది అనుకునేవారు. ఈ అంచనాలను తారుమారు చేస్తూ అమెరికాకు చెందిన ఐకాన్ అనే కంపెనీ కారు చౌకగా పొందికైన, చిన్న ఇళ్లను కట్టేందుకు



రంగం సిద్ధం చేసింది. ప్రత్యేకమైన కాంక్రీట్ మిశ్రమాన్ని పొరలు పొరలుగా పేర్చడం ద్వారా కేవలం ఒకే ఒక్క రోజులో ఈ ఇంటిని కట్టేయవచ్చునని చూపుతోంది. ప్రస్తుతం ఎల్ సాల్వడోర్, హైతీల్లో ఇలాంటి చౌక త్రీడీ ప్రింటెడ్ ఇళ్లను నిర్మిస్తోంది. ఒక్కో ఇల్లు 600 నుంచి 800 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంటుంది. సాధారణ ఇళ్లతో పోలిస్తే త్రీడీ టెక్నాలజీతో తయారుచేసే ఇంటి నిర్మాణంలో వృథా చాలా తక్కువగా ఉంటుందని, ఎండాకాలంలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుందని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు. సాధారణ కాంక్రీట్ ఇళ్లతో సమానంగా దశాబ్దాలపాటు చెక్కుచెదరకుండా ఉంటాయని కూడా తెలిపారు. పేదలకు చౌకగా ఒక గూడు కల్పించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారితోపాటు.. మురికివాడల్లో కనీస సౌకర్యాలు లేకుండా జీవిస్తున్న వారికీ నీడ కల్పించేందుకు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.

వికళంబి నామ సంవత్సరంలో
మీరు అనుకున్నవన్నీ జరుగుతాయి.
అనుకున్నంత తొందరగా
జరక్కపోవచ్చు.
ఈ ఉగాది పచ్చడి

విళంబిని జుర్రుకోండి



ఈ షడ్రుచులు మాత్రం
అనుకున్నదాని కంటే ముందే
జుర్రుకుంటారు.
సంవత్సరం పాటు
షడ్రుచులను ఆస్వాదిస్తూ జీవితాన్ని
ఉగాదిమయం చేసుకోండి.

ఎడిటర్, ఫీచర్స్

తెలుగువారి నుడి ఉగాది పచ్చడి

కావలసినవి: **నీళ్లు** – మూడు గ్లాసులు; **చింతపండు** – పెద్ద నిమ్మకాయ పరిమాణం; **చిన్న చిన్న చెరకు ముక్కలు** – 20; **అరటి పండు** – 2 (చిన్న చిన్న ముక్కలు చేయాలి); **బెల్లం పొడి** – ఒక కప్పుడు; **వేప పువ్వు** – 2 టేబుల్ స్పూన్లు; **మామిడి కాయ** – 1 (తొక్క తీసి చిన్న చిన్న ముక్కలు చేయాలి); **ఉప్పు** – చిటికెడు; **పచ్చి మిర్చి** – 4 (చిన్న చిన్న ముక్కలు చేయాలి)

తయారీ: ● ముందుగా చింతపండును ఒక గ్లాసు నీళ్లలో నానబెట్టి, రసం తీసి ఒక గిన్నెలో పోయాలి ● మూడు గ్లాసుల మంచి నీళ్లు జతచేయాలి. బెల్లం పొడి, ఉప్పు జత చేసి బాగా కలపాలి ● వేప పువ్వు, అరటి పండు ముక్కలు, మామిడికాయ ముక్కలు, చెరకు ముక్కలు, పచ్చి మిర్చి జత చేసి బాగా కలిపి గ్లాసులలో పోసి అందించాలి.

చేదు కూడా చేరదీయదగ్గదే...

వేప పువ్వు ముద్ద కూర

కావలసినవి: ఎండబెట్టిన **వేప పువ్వు** – 2 టేబుల్ స్పూన్లు; **నెయ్యి** – ఒక టీ స్పూను; **రసం పొడి** – ఒక టీ స్పూను; **పసుపు** – పావు టీ స్పూను; **ఆవాలు** – పావు టీ స్పూను; **ఎండు మిర్చి** – 2; **కరివేపాకు** – 2 రెమ్మలు; **చింతపండు** –



నిమ్మకాయ పరిమాణంలో; **బెల్లం పొడి** – రెండున్నర టీ స్పూన్లు; **సెనగ పప్పు** – అర టీ స్పూను; **మినపప్పు** – అర టీ స్పూను; **ఉప్పు** – తగినంత

తయారీ: ● అర గ్లాసు నీళ్లలో చింతపండును సుమారు పది నిమిషాలు నానబెట్టి, చిక్కటి రసం తీసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలి ఉంచి, వేడయ్యాక టీ స్పూను నెయ్యి వేసి కరిగించాలి ● సెనగ పప్పు, మినప్పప్పు, ఆవాలు, పసుపు, ఎండు మిర్చి ఒకదాని తరువాత ఒకటి వేసి వేయించాక, వేప పువ్వు వేసి దోరగా వేయించాలి ● చిక్కగా తీసిన చింతపండు రసం జత చేసి బాగా కలపాలి ● బెల్లం పొడి, రసం పొడి, ఉప్పు జత చేసి మరోమారు బాగా కలిపి, సుమారు ఏడెనిమిది నిమిషాలు స్టౌ మీద ఉంచి దింపేయాలి. కరివేపాకుతో అలంకరించాలి ● పొంగల్, రాగి సంగటితో అందిస్తే రుచిగా ఉంటుంది.

పుల్లనగా జిల్లనగా

చింతపండు పచ్చి పులుసు

కావలసినవి:
చింతపండు రసం – రెండు కప్పులు (కొద్దిగా పల్చగా తీసిన రసం); **ఉల్లి తరుగు** – పావు కప్పు; **పచ్చి మిర్చి** – 3 (చిన్న చిన్న ముక్కలు చేయాలి); **కొత్తిమీర** – చిన్న కట్ట **బెల్లం పొడి** – టీ స్పూను; **ఉప్పు** – రుచికి తగినంత



పోపు కోసం
ఆవాలు – టీ స్పూను; **జీలకర్ర** – టీ స్పూను; **కరివేపాకు** – 2 రెమ్మలు; **ఇంగువ** – చిటికెడు; **ఎండుమిర్చి** – 2; **వెల్లుల్లి రెబ్బలు** – 4; **నూనె** – కొద్దిగా

తయారీ: ● ఒక బౌల్‌లో చింతపండు రసం, కొత్తిమీర, బెల్లం పొడి, ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, ఉప్పు వేసి చేతితో బాగా కలపాలి (ఉప్పు, తీపి తగ్గినట్టుగా అనిపిస్తే, మరింత జత చేసుకోవచ్చు) ● స్టౌ మీద చిన్న బాణలి ఉంచి వేడయ్యాక కొద్దిగా నూనె వేసి కాగాక, ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి ● కరివేపాకు, ఇంగువ, ఎండు మిర్చి, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు జత చేసి బాగా వేగిన తరువాత తీసి, తయారుచేసి ఉంచుకున్న పచ్చిపులుసులో వేసి కలపాలి ● అన్నంలోకి రుచిగా ఉంటుంది.

తీపే కదా తొలి రుచి

చెరకురసం ఖీర్



కావలసినవి
చెరకు రసం – 2 కప్పులు
బాస్మతి బియ్యం – ఒక కప్పు (శుభ్రంగా కడిగి తగినన్ని నీళ్లు జత చేసి అరగంటసేపు నానబెట్టాలి); **బెల్లం పొడి** – అర కప్పు; **పాలు** – 2 కప్పులు; **జీడి పప్పు** – 3 టేబుల్‌స్పూన్లు; **పచ్చి కొబ్బరి తురుము** – 3 టేబుల్ స్పూన్లు

తయారీ: ● ఒక పెద్ద పాత్రలో పాలు పోసి స్టౌ మీద ఉంచి మరిగించాలి. ● నానబెట్టిన బియ్యం జత చేసి ఉడికించాలి (మధ్యమధ్యలో కలుపుతుండాలి). ● చెరకురసం జత చేసి సుమారు అయిదారు నిమిషాలు ఉడికించి దింపేయాలి. ● బెల్లం పొడి, కొబ్బరి తురుము, జీడిపప్పులు జత చేసి కలిపి అందించాలి.



కొంచెం కారంగా... కొంచెం గారంగా...

మిరియాల ఫ్రైడ్ రైస్

కావలసినవి: **బాస్మతి బియ్యం** – మూడు కప్పులు; **నెయ్యి** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **జీలకర్ర** – ఒక టీ స్పూను; **ఆవాలు** – ముప్పావు టీ స్పూను; **నల్ల మిరియాలు** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **నువ్వులు** – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; **కరివేపాకు** – 3 రెమ్మలు; **ఉప్పు** – రుచికి తగినంత

తయారి: ● ముందుగా బాస్మతి బియ్యం శుభ్రంగా కడిగి, గంటసేపు నానబెట్టాక, నీళ్లు ఒంపేసి, తగినన్ని నీళ్లు జత చేసి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో నూనె లేకుండా మిరియాలు, నువ్వులు, కరివేపాకు వేసి దోరగా వేయించి తీసి, బాగా చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేయాలి ● బాణలిలో నెయ్యి వేసి కరిగాక ఆవాలు వేసి చిటపటలాడేవరకు వేయించాలి ● జీలకర్ర జత చేసి గోధుమరంగులోకి వచ్చేవరకు వేయించాలి ● ఉడికించిన అన్నం జత చేసి కలపాలి ● మెత్తగా పొడి చేసిన మిరియాల పొడి మిశ్రమం, ఉప్పు జత చేసి మరోమారు కలిపి దింపేయాలి. ● అప్పడాలతో కలిపి తింటే రుచిగా ఉంటుంది.



వగరుకు లేదు తిరుగు

మామిడికాయ డ్రింక్

కావలసినవి: **మామిడికాయలు** – 2; **మిరియాల పొడి** – చిటికెడు; **నల్ల ఉప్పు** – 2 టీ స్పూన్లు; **ఏలకుల పొడి** – అర టీ స్పూను; **బెల్లం పొడి** – 3 టేబుల్ స్పూన్లు; **నీళ్లు** – ఒక గ్లాసు, **జీలకర్ర పొడి** – అర టీ స్పూన్లు; **పుదీనా** – కొద్దిగా



తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడగాలి ● ఒక గిన్నెలో మూడు కప్పుల నీళ్లు పోసి, కడిగిన మామిడి కాయలను జతచేసి, కుకర్‌లో ఉంచి నాలుగు విజిల్స్ వచ్చాక దింపేయాలి ● బాగా చల్లారాక, మామిడి కాయల తొక్క వేరు చేసి, మామిడి గుజ్జును చేతితో మెత్తగా చేసి ఒక పాత్రలోకి తీసుకోవాలి ● ఒక పాత్రలో ముప్పావు కప్పు నీళ్లు, మూడు టేబుల్ స్పూన్ల బెల్లం వేసి కరిగించి, స్టౌ మీద ఉంచి, ఐదు నిమిషాలయ్యాక దింపేయాలి ● బ్లెండర్‌లో మామిడికాయ గుజ్జు, జీలకర్ర పొడి, బెల్లం పొడి, చిటికెడు మిరియాల పొడి, నల్ల ఉప్పు, ఆరేడు పుదీనా ఆకులు వేసి మిక్సీ పట్టాక, ఒకటిన్నర కప్పుల చల్లని నీళ్లు జత చేసి మరోమారు తిప్పి తీసేసి, గ్లాసులలో పోసి అందించాలి.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)



జీవితంలో ఏది ముఖ్యం? ధనమా? విద్యా? మనశ్శాంతా? అని ఓ మహర్షి ప్రశ్నని వేస్తే దాదాపు అందరూ ధనం ముఖ్యమనే సమాధానమిచ్చారట. కొంతకాలమయ్యాక అదే మహర్షి రాగా, ఆయన ఏమీ అడక్కుండానే 'మనశ్శాంతి ముఖ్య'మన్నారట సామూహికంగా. ఇది ఓ పురాణంలోని మాట. ఒక్క క్షణం మీకు మీరుగా మీలోనే ఆలోచించుకుని 'ధనమే ముఖ్యమనే మార్గంలో ప్రయాణిస్తున్నానా?' అనేదాన్ని గమనించుకోండి!

అదే తీరుగా ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న సమస్యని పరిష్కరించడానికి ఆవేశం ముఖ్యమా? ఆలోచన ముఖ్యమా? అని లోపల చర్చించుకుని మిమ్మల్ని గురించి మీరే ఒక అంచనాకి రండి. మీకున్న ఆవేశం మీ అభివృద్ధిని నిరోధిస్తోందేమో పరిశీలించుకోండి. మీ బంధువులూ ఆప్తులూ... వీరిలో ఎవరో గుర్తించుకుని ఓ నిర్ణయానికి రండి!

కుటుంబంలో ఒకరికి వివాహ ప్రయత్నాలు ఫలించే అవకాశముంది కాబట్టి సొమ్ముని సిద్ధంగా ఉంచుకోండి ఆ శుభ కార్యక్రమ నిర్వహణ నిమిత్తం. భూమి, పొలం, గృహం... ఇలా దేన్నో ఓ స్థిరమైన ఆస్తిని సంపాదించుకోగల అవకాశముంది. కొద్దిగా ప్రయత్నిస్తే చాలు సుసాధ్యం అవుతుంది.

చేస్తున్న ఉద్యోగంలో మంచి అభివృద్ధిని సాధించుకోగలుగుతారు. అయితే మీ మాటలోని కరుకుదనం కొద్దిగా ఆ అభివృద్ధికి ప్రతిబంధకంగా నిలుస్తోందేమో గమనించుకోండి. ఉపాయాన్ని ఆలోచించి వెంటనే అమలు చేసెయ్యడం సరికాదు. ఆ ఉపాయాన్ని అమలు చేసినందువల్ల – లేదా – అమలు చేస్తున్న వేళ ఏదైనా ఓ అపాయం వస్తోందో వచ్చిందో గమనించుకుంటూ ఉండాలి. ప్రస్తుతం మీ పరిస్థితి – ఉపాయాన్ని అమలు చేస్తూ చిన్నపాటి అపాయంలో చిక్కుకున్న – వైనమే. భయపడకండి. మంచి రోజులొచ్చాయి దాదాపుగా.

లౌకిక పరిష్కారం: ఆవేశం, మాటలో కరుకుదనం సరికాదు.
అలౌకిక పరిష్కారం: దుర్గాదేవిని దర్శించండి. అమ్మవారి స్తోత్రాలని పఠిస్తూ ఉండండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)



మీకు ధనాశని పుట్టిస్తూ, కళ్లలో లంకెబిందెల్నీ ధనరాశుల్నీ ఇనప్పెట్టెల్నీ చూపిస్తూ తెలిసీ తెలియని (అనుభవం లేని) వ్యాపారాన్ని ప్రారంభింపజేస్తారు కొందరు. ఆ పెట్టిన పెట్టుబడి కాస్తా ఎక్కడ నష్టమౌతుందనోననే అభిప్రాయంతో మీరు ఆ వ్యాపారాన్ని కొనసాగించదలిస్తే మరింత నష్టపోవడానికి సిద్ధపడుతున్నట్టేనని అర్థం. మీకు ఎలా ఇతరులు అంటగట్టారో, అలా ఇతరులెవరికి దీని మీద శ్రద్ధా ఆసక్తీ ఉన్నాయో ప్రయత్నించండి. కొద్దిపాటి నష్టంతో బయటపడిపోగలుగుతారు.

మీ అభిరుచికి తగిన ఇల్లు సిద్ధంగా ఉంది కాబట్టి రుణం చేయాల్సిన అవసరం లేకుండా కొద్దిగా పొదుపు సూత్రాన్ని పాటించండి. మిత్రులూ, బంధువులూ, ఆప్తులూ వచ్చారు గదాని ఆడంబరాలకీ అట్టహాసాలకీ వెళ్లకుండా ఉంటే చాలు. అలాగే పెట్టుపోతల విషయంలో కూడా కొద్ది జాగ్రత్తతో ఉండండి. సరిపోతుంది. ఒకసారి గృహాన్నంటూ ఏర్పరుచుకున్నాక పొదుపు గురించి మీకు చెప్పాల్సిన అవసరం రాదు. మీకే అర్థమవుతుంది. మీ కుటుంబానికి మరీ చేరువ అయినవారు మొగమాటపెట్టి ఏదో ఓ సంస్థలో కొంత పెట్టుబడిని దీర్ఘకాలిక లాభమంటూ వచ్చే అవకాశముంది. నిర్భయంగానూ నిస్సంకోచంగానూ 'చేర'నని చెప్పండి. అనేక ఉదాహరణలతో సాక్ష్యాలతో మిమ్మల్ని ప్రలోభపెట్టబోయినా అవకాశమియ్యకుండా గట్టిగా మాటమీద నిలబడండి. మిమ్మల్ని మోసగించాలనే దృష్టివారిది కాదు గాని, ప్రస్తుతం మీకు సొమ్ము అవసరం. పైగా ఇలాంటి పెట్టుబడి మీకు నష్టదాయకం కూడా. పరుగుపందెంలో గెలవడమంటే కాలుని ఎత్తడం, భూమికి ఆన్చడం మళ్ళీ అంతలోనే కాలిని ఎత్తడం భూమికి ఆన్చడం.. ఇంతే కదా! అలాగే మీ ప్రయత్నం దేనికోసమైనా సరే– ఇలా అంతరాయం లేకుండా సాగవలసిన రోజులివి. చక్కటి ధనార్జనని చేసుకోగల సమయం కూడా ఇదే.

లౌకిక పరిష్కారం: మొగమాటం, సంకోచం వద్దు.
అలౌకిక పరిష్కారం: లక్ష్మీ అష్టోత్తరనామాలని ప్రతిరోజూ పఠిస్తూ ఉండండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)



ఒకప్పటి రోజుల్లో నిట్రాడి పాకలనేవి ఉండేవి. అంటే, పెద్ద స్తంభం నిటారుగా మధ్యలో ఉంటే దాని నుండి ఏటవాలుగా నాలుగువైపులకీ వెళ్తున్న తాటాకుల కప్పు కింద నాలుగువైపులా నాలుగు స్తంభాలు నిలబడి దాన్ని ఓ ఇంటిగా చేస్తుండేవి. అలా మీరు కూడా మీకు సంబంధించిన కొందరు ఆప్తుల కుటుంబాలకి ఆధార స్తంభంగా నిలబడి ఆదుకుంటారు. ఇది నిజంగా చెప్పుకోదగిన విషయం. శుభమస్తు. పదిమంది మీ ఇంటికి రావడం, మీరు పదిమంది ఇళ్లకీ వెళ్తుండడం .. కలిసి పదిమందీ ఎదగాలని అనుకోవడం కారణంగా మీకు సుఖం సంతోషం ఐకమత్యం అంటే ఏమిటో తెలుస్తుంది. అయితే మీకుండే ఆధ్యాత్మిక భావన కారణంగా దైవదర్శనాలూ పుణ్యక్షేత్ర ప్రయాణాలూ తీర్థస్నానాలూ వంటివి మరికొంత మోతాదులో ఉంటూండవచ్చు. అది ఒక్కోసారి మీ జీవనవృత్తికి ఇబ్బంది కలిగించేదిగా ఉండచ్చు. దాంతోపాటు మీ సంపాదనని వ్యయానికి గురి చేసేది కూడా అన్పించవచ్చు. ఎప్పటి ఆదాయం అప్పటికి అన్నట్టుగా చేయడం కాకుండా మీకు మీ సంతానానికీ సంబంధించిన దీర్ఘకాలిక భవిష్యత్ప్రణాళికలని అనుభవజ్ఞుల ద్వారా వేసుకోండి. మీ లక్ష్యం బహుశా సొంతిల్లు కావచ్చు. ఉన్న ఆస్తిని అమ్మి మరికొంత జోడించి కొత్త ఆస్తిని కొనడం మీ విషయంలో గొప్ప కాదు. ఉన్నదాన్ని ఉంచుతూ మరొక ఆస్తిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తే ఆ లక్ష్యం నెరవేరుతుంది త్వరలోనే. భాగ్యమంటే సంపాదనకి వశులై ధనాన్నీ ప్రతిష్ఠనీ కీర్తినీ తెచ్చి మూటగట్టుకోవడం. భోగమంటే దాన్ని మీ ద్వారా పదిమందితో పాటు మీరూ అనుభవించేలా చేసుకోవడం. ఇది ఓ గొప్ప పద్ధతి. తల్లి పట్ల చెప్పలేని గౌరవం ఉంటుంది. భార్య/ భర్తని ఉన్నంతలో గౌరవించాలనే దృక్పథమూ ఉంటుంది. పాముని తోక తొక్కనంతవరకూ అలా దూరంగా పాకి పోయేటట్లూ, తొక్కబోయినా, తొక్కినా బుస్సుమనేటట్లూ.. కాటేసేటట్లూ ఎవరి పరిధిలో వారు మీ పట్ల ఉన్నంతవరకు మీరు సాధుగోమాతలే. ఈ లక్షణమే మీకు శ్రీరామరక్ష.

లౌకిక పరిష్కారం: నిత్యజీవన ఆదాయానికి అవరోధం లేకుండా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని చేయండి.
అలౌకిక పరిష్కారం: ఇంట్లో మీరు చేసుకునే నిత్యపూజని మరువకండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)



ఒకప్పటి రోజుల్లో ప్రతి ఊళ్లోనూ అన్ని వస్తువులూ దొరికేవి కావు. ప్రత్యేకంగా రెండెడ్ల బండి మీద ఓ ప్రదేశానికెళ్లి వారానికి ఓ మారు తెచ్చుకుంటూండేవారు కావలసిన వస్తువుల్ని. అలాగే అన్నిటినీ కొనుక్కుని బండి తోలుకుంటూ వచ్చే వ్యాపారి నిద్రకి ఉపక్రమించగానే ఒక్కొక్కటి చొప్పున దొంగలు తస్కరించేశారుట. ఇంటికొచ్చేసరికి తానూ బండీ మాత్రమే మిగిలాయిట. అతి ముఖ్యమైన పనుల్ని పక్కన పెట్టి – వ్యసనమో లేక వినోదమో లేక విహారమో లేదా ఉద్యోగమో ప్రధానమనుకుంటూ – మంచి ఇబ్బందిలోనికి వెళ్లిపోబోతున్నారు. పరిస్థితి ఇంకా చేజారిపోలేదు కాబట్టి మేల్కొనండి – వ్యసనం, వృథా, కాలక్షేపం నుండి బయటపడాలని నిర్ణయించుకోండి.

పాము కాటు వేసిన వెంటనే వ్యక్తికి మరణం ఉండదు. వైద్యానికి కొంత సమయం ఉంటుంది. మీకు ఉద్యోగం, వ్యాపారం, వృత్తి అనే వీటిలో పై అధికారుల వల్ల తాత్కాలికమైన ఇబ్బంది వచ్చినంత మాత్రాన మీ జీవనాధారాన్ని కోల్పోయినట్లు కానే కాదు. తగిన ప్రయత్నాన్ని వెంటనే చేయండి. సమర్థుడైన వ్యక్తిని మాత్రమే ఎన్నుకోండి. విజయం లభిస్తుంది. అన్నింటికీ మించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలని సకాలంలో చెల్లించండి – ఆర్థికమైన లావాదేవీల్లో స్పష్టతనీ అవగాహననీ కలిగి ఉండండి. ఇది అతిముఖ్యం.

మీ శత్రువులు మిమ్మల్ని రెచ్చగొట్టి తమ మీద భౌతికంగా మీరు దాడి చేసేంత స్థాయిలో మిమ్మల్ని ఉసిగొల్పవచ్చు. ఈ సందర్భంలో మీరెంత ప్రతిస్పందించకుండా ఉంటే అంత మంచిది మీకు. ఏమాత్రం వ్యతిరేక దశలో ప్రతిస్పందిస్తూ నోరు చేసుకున్నా – చెయ్యెత్తినా కూడా పరిస్థితిని కారాగారం వరకూ కూడా తీసుకెళ్లాలనేది ప్రత్యర్థుల ఆలోచన. గుర్తించి జాగ్రత్త పడండి.

లౌకిక పరిష్కారం: వ్యసనానికి దూరంగా వెళ్లండి. అప్రమత్తంగా ఉండండి.
అలౌకిక పరిష్కారం: నవగ్రహ ప్రదక్షిణలని చేస్తూ ఉండడం మంచిది.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)



వెనుకటికి ఓ సామెత ఉంది. 'అత్తగారి కొంగు తొలగిందన్నా తప్పే – తొలగలేదన్నా తప్పే !' అని తొలగడం తొలగకపోవడమనే విషయం తెలిసేది ఆమె కొంగుని పరీక్షగా చూస్తేనే కదా! అందుకని తప్పు అంటోంది సామెత. మీ పరిస్థితీ అంతే. ఏ సలహానిచ్చినా, సూచనలిచ్చినా ముక్కు పట్టుకునే పరిస్థితి ఉంది కాబట్టి, సలహానిచ్చి ఇబ్బంది పడేకంటే – ఎందుకు సూచననియ్యలే'దనే నిందకి గురి కావడం మంచిది. గమనించండి. లోగొడ కొన్న ఆస్తిని అమ్మదలచి అంగీకారపత్రాలని రాసుకున్నట్లయితే అమలు చేసెయ్యండి. వదిలించుకోండి తప్ప, ధర పెరిగింది కదాని ఎవరో ఇచ్చిన సలహాతో కొంత కిరికిరి పెట్టదలిస్తే న్యాయస్థానం మెట్లెక్కాల్సిన అవసరం రావచ్చు. సలహానిచ్చేవారు ఈ ముగింపుని చెప్పరు. కాలం సరిలేనప్పుడు కయ్యం వచ్చినా విడిపించుకోవాలి తప్ప కావాలని కయ్యానికి కాలు దువ్వకూడదు.

అపరిష్కృతంగా కొన్ని కాలాలపాటు నుండి ఉన్న సమస్యల్ని క్రమక్రమంగా పరిష్కరించుకుంటూ వెళ్లడం మంచిది తప్ప ఇంకా వాటిని పేరబెట్టుకోవడం మంచిది కాదు. కలహాలొచ్చే సూచనలున్నాయి. ఆర్థికంగా నష్టపోయే సూచనలు కూడా ఉన్నాయి. రావాలసిన బకాయిల విషయంలో ఎప్పటికప్పుడు రాబోతున్నాయనే ఎదురుచూపు మాత్రమే మిగులుతూ ఉండచ్చు. వట్టి పుణ్యానికి కలహం వచ్చే అవకాశమున్న కాలం అయిన కారణంగా మీరు దేని గురించి మాట్లాడబోయినా ఎవరిని పలకరించబోయినా కూడా ఆచి తూచి వ్యవహరించడం అత్యవసరం. తొందరపాటుతనం వద్దు. అలాగని నిదానంగా ఉండనూ వద్దు. అర్జునుడంతటివాణ్ణి కూడా 'మగతనం లేనివా'డని దుశ్శాసనుడన్నాడు. కృష్ణుడంతటివాణ్ణి కూడా తాళ్లతో బంధించబోయాడు దుర్యోధనుడు. అయితే భారతకథని చదివేటప్పుడు కృష్ణార్జునుల గొప్పదనాన్నే అంతా ప్రశంసిస్తారు తప్ప ఈ అవమానకర ఘట్టాల ఆధారంగా ఈ ఇద్దరిపేరూ వింటూ పెదవి వరవరు. అలాగే తాత్కాలికంగా అగౌరవపడే అవకాశం ఉండచ్చు గాని, విజయం మాత్రం మీదే.

లౌకికపరిష్కారం: అవసరమయితేనే మాట్లాడండి. వాక్ (నోరు) నియంత్రణ అవసరం.
అలౌకిక పరిష్కారం: దత్తాత్రేయ దర్శనం స్తోత్రపఠనం మంచిది.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)



ప్రశాంతంగా ఉన్న చెరువులో ఉండే చేప అకస్మాత్తుగా ఓ సారి పైకెగిరి మళ్ళీ అంతలోనే నీళ్లలోకి మునిగిపోయేటట్లు మీ భార్య/ భర్తకి ఉద్యోగంలో చేరాలనీ, లేదా ఉద్యోగమే గాని చేస్తున్నట్లయితే అకస్మాత్తుగా మానెయ్యాలనీ, దూరపు ప్రయాణం చేస్తూ కొన్ని రోజులపాటు ఆటవిడుపుగా ఇంటిని విడిస్తే బాగుండుననీ.. ఈ తీరు ఆలోచనలు రావచ్చు. వారిని కాదనకండి. అలా వచ్చే జీవనశైలిలోని తాత్కాలికమైన మార్పు వారి మీద మరో తీరు ప్రభావాన్నిస్తుందని అనుకోవద్దు. వాళ్లు మరింత స్ఫూర్తిమంతులౌతారని భావించండి. సంతానానికి సంబంధించిన చదువు ప్రతి సంవత్సరమూ మీకొక సమస్యగా (ఎక్కడ చేర్చాలా? ఏది చదివించాలా?..) అనిపించవచ్చు. మీకిది శుభకాలం కాబట్టి మీ అదృష్టం కొద్దీ మీ సంతానమే వాళ్లకి వాళ్లు ఎక్కడెక్కడ చదవవలసి ఉందో ఆ విషయాన్ని స్పష్టం చేసే ఉత్తీర్ణతాశాతంతో ఆ సమస్య మీకు లేకుండా చేస్తారు. అదే తీరుగా మీరు నిర్వహిస్తున్న వ్యాపారం కూడా ఎంత లాభాన్ని సాధిస్తుందో, ఎంత పెట్టుబడి పెట్టే వీలుందో ఆ విషయాన్ని తనంత తానే మీకు వివరిస్తుంది. వ్యాపార భాగస్వాముల్ని గమనిస్తూ ఉండటం తప్పనిసరి. ఎవరైనా వెళ్లిపోదలిస్తే బతిమిలాడకుండా వెళ్లిపోనివ్వండి. ఆ స్థానాన్ని భర్తీ చేసుకోవడమనేది వెంటనే సరైన చర్య కాదు. ప్రస్తుతానికి కొత్తగా ఆస్తులని కొనుక్కుంటారని చెప్పవీల్లేదు గానీ, ఉన్న ఆస్తులని కట్టుదిట్టం చేసుకుంటారు. అలా మరమ్మతులు చేసే కారణంగా దృఢం చేసుకోగలుగుతారు కూడా. పిత్రార్జితం గాని, అత్తింటి వైపు నుండి గాని కొంత సంపద చేరే అవకాశ ముంది. మీరెవరినీ తూలనాడడం దుర్విమర్శ చేయడం వద్దు. అలాగే మీ గురించి ఎవరైనా తూలనాడినా దుర్విమర్శ చేసినా తీవ్రంగా ప్రతిస్పందించడం కాకుండా మెత్తని మాటలతో గట్టిగా అర్థమయ్యేలా సమాధానాన్ని చెప్పండి. సుఖశాంతులు మీ సొంతం.

లౌకిక పరిష్కారం: ఎవరినీ దుర్విమర్శ చేయకండి. దేనికీ తీవ్రంగా ప్రతిస్పందించకండి.
అలౌకిక పరిష్కారం: లక్ష్మీ నృసింహస్వామికి చందన చర్చ (మంచి గంధపు పూత)ని వీలైనప్పుడు చేయించండి.

మల్టీప్లెక్స్ మూవీ



ది లిప్‌స్టిక్ బ్యాండిట్..

2015.. వరుస బ్యాంక్ దోపిడీలతో అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాలైన ఆరిజోనా, కాలిఫోర్నియా, ఉటాలను ఊపేసిన బాంబ్‌షెల్ బాండిట్ గుర్తుంది కదా? అదేనండీ ఉరఫ్ సందీప్ కౌర్... 24 ఏళ్ల అమ్మాయి.. కాలిఫోర్నియాలో నర్స్‌గా పనిచేసేది. కాసినోకి వెళ్లే వ్యసనంతో విపరీతంగా అప్పులపాలై వాటిని తీర్చడానికి బ్యాంకులకు కన్నం వేయాలని నిర్ణయించుకుంది. మారువేషం.. ఆమె మోడస్ ఆపరెండి. తల మీద విగ్గు.. సగం మొహాన్ని కప్పేసే సన్‌గ్లాసెస్.. ట్రాక్ సూట్, హ్యాండ్ బ్యాగ్‌తో బ్యాంక్‌కు వెళ్లేది. క్యాషియర్ దగ్గరకు వెళ్లి.. ''ఈ బ్యాగ్‌లో బాంబ్ ఉంది.. ఈ బ్యాగ్‌లో పట్టినంత డబ్బు సర్దకపోతే బాంబ్‌తో బ్యాంక్ పేల్చేస్తా'' అని స్థిర స్వరంతో బెదిరించి లూటీ చేసి వెళ్లిపోయేది ఈ రాణి. అలా వరసగా అయిదు వారాలు ఆరిజోనా, కాలిఫోర్నియా, ఉటాలో తన దోపిడీలతో కలకలం సృష్టించింది. అలా దొంగతనం చేసి వెళ్లిపోతుంటే పోలీసులు ఆమెను వెంటాడారు. పసిగట్టిన కౌర్ తన వెహికిల్‌ను హై స్పీడ్‌లో మూడు రాష్ట్రాలను అంటే రెండు టైమ్‌జోన్స్‌ను దాటించింది. ఈ చేజింగ్ సీన్ హాలీవుడ్ సినిమాకూ తక్కువకాదు. మొత్తానికి పోలీసులకు చిక్కి 66 నెలల జైలు శిక్షకు గురైంది. ఆమె బెదిరింపు విని భయంతో గొంతు తడారిపోయిన వాళ్లకు నీళ్లు తాగించి మరీ డబ్బులు దోచుకొళ్లేదట దొరసాని.

ఓకే.. క్వీన్ సినిమా కూడా గుర్తుంది కదా? ఏంటీ ఒక స్క్రీన్ మీద రెండు కథలు? అని ఐబ్రోస్‌ను ముడేయకండి! నిజంగా ఒక టికెట్‌కు రెండు కథల సినిమానే సిమ్రన్.

విడాకులు తీసుకున్న 30 ఏళ్ల ఓ వనిత కథ...

ప్రఫుల్ పటేల్ అలియాస్ సిమ్రన్... అమెరికాలోని జార్జియా (అట్లాంటా)లో ఉంటుంది... తల్లిదండ్రులతో కలిసి. ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో హౌజ్ కీపింగ్ ఉద్యోగం చేస్తూ. భర్తతో విడిపోయి ఇంట్లో ఉంటున్న కూతురంటే తల్లికి, తండ్రికి ఇద్దరికీ చిన్న చూపే. ప్రఫుల్ ఉద్యోగం నుంచి ఇంటికి రాగానే.. ''ఎన్నాళ్లిలా ఉంటావ్? ఇంకో పెళ్లి చేసుకోవచ్చుకదా.. ' అంటూ తల్లి నస పెడుతుంటుంది. జీతం డబ్బుల్లో చాలా దాచుకుంటూ సొంతంగా ఇల్లు తీసుకొని విడిగా ఉండాలనుకుంటుంది. ఈ విషయం తెలిసి తండ్రి ''ఎందుకూ.. ఒంటరిగా అయితే బాయ్‌ఫ్రెండ్స్‌ను పిలిపించుకోవచ్చునా?'' అంటూ అవమానపరుస్తుంటాడు. తల్లిదండ్రుల అనుమానాలు, అవమానాల అంచనాల నుంచి విముక్తి పొందాలనుకుంటుంది ప్రఫుల్. స్వతంత్రంగా బతకాలనుకుంటుంది.

లాస్ వేగస్..

ఆ క్రమంలోనే లాస్ వేగాస్‌లో కజిన్ బ్యాచలరేట్ పార్టీ ఉండడంతో వెళ్తుంది. అక్కడ ఆమెను ఓ క్లబ్‌కు తీసుకెళ్తాడు ఓ ఫ్రెండ్. బాకర్ట్ గేమ్‌లో డబ్బులు గెల్చుకుంటుంది. ఎంజాయ్ చేస్తుంది. కాసినోకు వెళ్తుంది. బకార్ట్‌లో సహకరించిన అదృష్టం కాసినోలో వెక్కిరిస్తుంది. గెలుచుకున్నదంతా పోతుంది. అక్కడితో ఆగకుండా బ్యాంక్‌లో ఉన్న సేవింగ్స్‌నూ పెడ్తుంది. అవీ పోతాయ్. తిరిగి అట్లాంటా వెళ్లిపోతుంది. బ్యాంక్‌లో ఉండాల్సిన డిపాజిట్ లేకపోవడంతో ఇల్లు లోన్ కోసం పెట్టుకున్న దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. ఆర్థిక సహాయం కోసం తండ్రిని అభ్యర్థిస్తుంది. ''ఈ పిచ్చి పనులన్నీ మానుకుని సమీర్ (సోహమ్ షా.. తండ్రి చూసిన ఇంకో సంబంధం)ను చేసుకో'' అంటూ ఒత్తిడి చేస్తాడు. ససేమిరా అనుకుని ఆఖరి సారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మళ్లీ వేగస్ వెళుతుంది. కాసినోలో అప్పులిచ్చేవాడు తారసపడ్తాడు. తాకట్టుగా డ్రైవింగ్ లైసెన్స్‌ను పెట్టి డబ్బు తీసుకుంటుంది. వాటినీ పోగొట్టుకుంటుంది.

లిప్‌స్టిక్ బ్యాండిట్..

మళ్లీ అట్లాంటా వెళ్లిపోయి తండ్రితో చెప్తుంది సమీర్‌ను కలుస్తానని. కలుస్తుంది కాని ఎలాంటి ఆసక్తీ చూపదు. అయితే సమీర్‌కు ప్రఫుల్ అంటే ఇష్టం ఏర్పడుతుంది. ఈలోపు కజిన్ పెళ్లి వస్తుంది. ఆ పెళ్లిలో అప్పులవాడు డబ్బు కట్టమని ఫోన్ చేసి బెదిరిస్తుంటాడు. ఇంటికి లోన్ వస్తే అవి కట్టేద్దామనుకుంటుంది. కాని లోన్ క్యాన్సల్ కావడంతో ఏం చేయాలో పాలుపోదు. మెల్లగా చిల్లర దొంగతనాలకు అలవాటు పడుతుంది. ఆ అలవాటు బ్యాంక్ దోచేందుకు ప్రోత్సహిస్తుంది. బ్యాంక్‌కు వెళ్లి ''డబ్బులు ఈ బ్యాగ్‌లో పెట్టండి లేదంటే బాంబు పేలుస్తా'' అని లిప్‌స్టిక్‌తో రాసిన నోట్‌ను క్యాషియర్‌కు చూపిస్తుంది. భయపడి డబ్బు సర్దేస్తారు బ్యాగ్‌లో. ఇదేదో బాగుంది అని వరుసగా ఇంకో రెండు బ్యాంక్‌లను దోచేస్తుంది. ఆ క్రమంలోనే మరో బ్యాంక్‌ను ఎంచుకుంటుంది. అదే ఫక్కీలో లిప్‌స్టిక్ నోట్ చూపిస్తుంది. అయితే మేనేజర్ నీ పేరేంటి అని అంటూ మాటల్లో పెడ్తాడు. తడబడ్డ ప్రఫుల్.. సిమ్రన్ అని చెప్తుంది. కారణం అప్పటికే వాళ్ల అమ్మ వల్ల 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' సినిమాను కొన్ని పదుల సార్లు చూడ్డం వల్ల. పైగా ఆ సినిమాలోని లాస్ట్ సీన్.. ''జా సిమ్రన్ జా.. జీలే అప్‌నీ జిందగీ'' అనే డైలాగ్ ప్రఫుల్‌కి చాలా ఇష్టం. దాంతో ఆ పేరు చెప్తుంది. కాని మేనేజర్ ఆమె గురించి పోలీసులకు ఇన్ఫామ్ చేస్తున్నాడని తెలుసుకుని తప్పించుకుని ఇంకో బ్యాంక్‌కు వెళ్తుంది. అప్పటికే ఆమె 'సిమ్రన్.. ది లిప్‌స్టిక్ బ్యాండిట్' పేరుతో మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్‌గా మారుతుంది. మూడు, నాలుగు బ్యాంక్‌లను దోచుకున్నా అప్పుల వ్యక్తికి కట్టాల్సిన డబ్బు జమకాదు. దాంతో ఇంకొంత వ్యవధి ఇవ్వమని ప్రాధేయపడుతుంది. ఒప్పుకోడు. ఇంకోవైపు సమీర్ అంటే ఇష్టం ఏర్పడి పెళ్లికి సరే అంటుంది ప్రఫుల్. ఈలోపే ఇంకో సమస్య చుట్టుకుంటుంది ఆమెను. హోటల్లో పనిచేస్తుండగా అప్పుల వాళ్లు ఆమె మీద దాడి చేస్తారు. ఆమె పాత బాయ్‌ఫ్రెండ్, ఆ హోటల్ మేనేజర్ (మైక్) ప్రఫుల్ హోటల్ లాకర్‌లో భద్రపర్చుకున్న డబ్బు (బ్యాంక్ రాబరీ మనీ) మీద కన్నేసి దొంగలిస్తాడు. ఆ విషయం తెలిసి తన డబ్బు తనకు తిరిగి ఇచ్చేయమని అడుగుతుంది ప్రఫుల్. ఇవ్వనంటాడు. అతన్ని కొట్టి సస్పెండ్ అవుతుంది. ఈ గొడవలో అప్పుల వాళ్లకు ప్రఫులే లిప్‌స్టిక్ బ్యాండిట్ అని అర్థమవుతుంది. దాంతో ఇంకో పెద్ద బ్యాంక్‌కు కన్నం వేయమని పిస్టల్‌ను కూడా ఇస్తారు ప్రఫుల్‌కు.

సరెండర్..

వీటన్నిటితో విసిగిపోయి.. ఇక దాంట్లోంచి బయటకు రాలేననుకుని తాను చేసిన దొంగతనాల గురించి సమీర్‌కు చెప్పి తనను వదిలేయమంటుంది ప్రఫుల్. తండ్రికి తెలిసి కూతురి చెంప ఛెళ్లుమనిపించి ఇంట్లోంచి వెళ్లిపొమ్మంటాడు. స్నేహితురాలి దగ్గరకు వెళ్లి ఆ రాత్రి తలదాచుకుంటుంది. అయితే తెల్లవారి తనకు లోన్ రిజెక్ట్ చేసిన బ్యాంక్‌కు కన్నం వేసి డబ్బు దొంగలిస్తుంది. ఇదిలా ఉండగా.. ప్రఫుల్ దొంగ అని తెలిసినా ప్రేమను చంపుకోని సమీర్ ఆమె అప్పులవాళ్లకు కట్టాల్సిన 50 వేల డాలర్ల డబ్బును ప్రఫుల్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. గ్రహించిన ప్రఫుల్ అతన్ని ఒంటరి ప్రదేశంలో కల్సుకుని తనను వదిలేసి ఇంకో మంచి అమ్మాయిని పెళ్లి చేసుకొమ్మని చెప్తుంది. అదంతా కాదు.. ముందు పోలీసులకు లొంగిపో అంటాడు సమీర్. తండ్రి నుంచి ఫోన్ వస్తుంది క్షమించమని. ఇంటికి బయలుదేరుతుంది. పోలీసుల నిఘా ఉండడం వల్ల ఇంటి దగ్గర పోలీసులు చుట్టుముడ్తారు. తప్పించుకుంటుంది ప్రఫుల్. చేజింగ్ మొదలవుతుంది. తర్వాత సరెండర్ అవుతుంది. తప్పించుకోవాలనే ఉద్దేశం లేదని, తమింటి దగ్గర అందరూ భారతీయులే కావడం వల్ల అక్కడ దొరికిపోవడం ఇష్టం లేకే అంత దూరం వచ్చినట్టు చెప్తుంది. వచ్చేసరికి పోలీసులు ఆమె కారును చుట్టుముడ్తారు. సరెండర్ అయిపోతుంది. పది నెలలు జైలు శిక్ష పడుతుంది. ఇదీ బాంబ్‌షెల్ బ్యాండిట్‌కు ప్రతీకగా వచ్చిన 'ది లిప్‌స్టిక్ బ్యాండిట్' సిమ్రన్ సినిమా కథ.

- శరాది

ఆచారి హంగామాకు టైమ్ ఫిక్స్


● మంచు విష్ణు

డాలర్స్ సంపాదించి బిందాస్ లైఫ్‌ను లీడ్ చేద్దామని గురువు అప్పలాచారి అండ్ గ్యాంగ్‌ను అమెరికా తీసుకెళ్లాడు కృష్ణమాచారి. డాలర్స్ కోసమే కాదు కృష్ణమాచారి అమెరికా వెళ్లడానికి మరో కారణం కూడా ఉందట. ఆ రీజన్ ఏంటి? అమెరికా యాత్రలో జరిగిన సందడేంటి? అనేది తెలుసుకోవాలంటే 'ఆచారి అమెరికా యాత్ర' చూడాల్సిందే. 'దేనికైనా రెడీ, ఈడో రకం ఆడోరకం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత హీరో విష్ణు, దర్శకుడు జి. నాగేశ్వర్‌రెడ్డి కాంబినేషన్‌లో రూపొందిన మూడో సినిమా 'ఆచారి అమెరికా యాత్ర'. ఇందులో ప్రగ్యా జైస్వాల్ కథానాయిక. యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పణలో పద్మజ పిక్చర్స్ పతాకంపై కీర్తి చౌదరి, కిట్టు నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ''ట్రైలర్‌కు విశేష స్పందన లభిస్తోంది. తమన్ మంచి సంగీతం ఇచ్చాడు. విష్ణు–బ్రహ్మానందం కాంబినేషన్‌లో వచ్చే సీన్స్ హైలైట్‌గా నిలుస్తాయి. స్టార్టింగ్ టు ఎండింగ్ మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ఈ సమ్మర్‌కి కూల్ ఎంటర్‌టైనర్ అని చెప్పొచ్చు. అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లో షూటింగ్ చేశాం. ఏప్రిల్ 5న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. అన్ని వర్గాలవారిని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర బృందం పేర్కొంది. తనికెళ్ల, కోట శ్రీనివాసరావు, పోసాని, పృథ్వీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్దార్థ్.


● ఇలియానా

రావాలని ఉంది...

... అంటున్నారు ఇలియానా. తెలుగు సినిమా 'దేవదాసు'తో కథానాయిక అయ్యి, దాదాపు ఆరేళ్లు ఇక్కడ హవా సాగించారీ బ్యూటీ. సడెన్‌గా హిందీకి వెళ్లిపోయి, మళ్లీ వెనక్కి రాలేదు. నాలుగేళ్లుగా హిందీలో ఏడాదికో సినిమా చేస్తూ వస్తున్నారు. ఆమె నటించిన 'రైడ్' శుక్రవారం విడుదలైంది. వాట్ నెక్ట్స్? మళ్లీ హిందీ సినిమాయేనా? తెలుగులో చేసే ఉద్దేశం ఉందా? అనే ప్రశ్న ఇలియానా ముందుంచితే – ''తెలుగుకి రావాలని ఉంది. మంచి స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తున్నా. తెలుగులో నేను పెద్ద పెద్ద స్టార్స్ పక్కన పెద్ద సినిమాలు చేశాను. పెద్ద డైరెక్టర్స్‌తో సినిమాలు చేశా. మళ్లీ తెలుగులో చేస్తే అలాంటి బిగ్ ప్రాజెక్ట్స్ చేయాలి. త్వరలో అలాంటి అవకాశం వస్తుందనుకుంటున్నా'' అన్నారు. ఇంతకీ సౌత్ ఇండస్ట్రీ మీకేం నేర్పించింది అంటే – ''నన్ను మంచి నటిని చేసింది. స్ట్రాంగ్ ఉమన్‌ని చేసింది. నటిగా ఎదుగుతూనే వ్యక్తిగా కూడా ఎదిగాను. నా ఆలోచనా పరిధిని పెంచింది. జీవితం అంటే ఏంటో నేర్పించింది. ఇక్కడ వచ్చిన పాపులార్టీ వల్లే హిందీ నుంచి పిలుపొచ్చింది. ఇంత చేసిన సౌత్ ఇండస్ట్రీకి దూరమవ్వాలని నేను అనుకోవడంలేదు. మళ్లీ సౌత్‌కి రావాలనుంది'' అని పేర్కొన్నారు ఇలియానా. మరి.. 'రామ్మా' అని ఇక్కణ్ణుంచి ఇలియానాను ఏదైనా అవకాశం పిలుస్తుందా? వేచి చూడాలి. సినిమాల సంగతి పక్కన పెడితే ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్‌తో ఇలియానా లవ్‌లో ఉన్నారు. పెళ్లి చేసుకున్నారని వార్త వస్తున్నా ఇలియానా మాత్రం క్లారిటీ ఇవ్వడంలేదు.

ఉగాది ముందే వచ్చినట్లుంది

– శివాజీరాజా

రచన స్మిత్ ప్రధాన పాత్రలో ఆర్‌కే ఫిలింస్ పతాకంపై ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా 'మహిళ కబడ్డి'. రీసెంట్‌గా మూడో షెడ్యూల్ కంప్లీటైంది. ఈ చిత్రం కోసం ఉగాది పండగపై పాటను సంగీత దర్శకుడు బోలే షావళి స్వరపరిచారు. ఈ పాటను ఉగాది పండగ సందర్భంగా ఆవిష్కరించారు. ''ఆర్‌కే ఫిలింస్ నా సొంత బ్యానర్ లాంటింది. నా కెరీర్ ప్రారంభ దశలో ఈ బ్యానర్‌లోనే నటించాను. ఉగాది పండగపై చేసిన పాటను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. బోలే షావళి అద్భుతంగా కంపోజ్ చేయగా, సింగర్ వరం బాగా పాడారు. ఈ పాటతో ఉగాది ముందే వచ్చినట్లు అనిపిస్తోంది'' అన్నారు శివాజీరాజా. ''మహిళలు ఎందులోనూ తక్కువ కాదనే కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రమిది. ఒక పల్లెటూరి అమ్మాయి భారతదేశం గర్వపడే స్థాయికి ఎలా ఎదిగింది? అన్నదే కథ' అన్నారు ప్రతాని రామకృష్ణగౌడ్. ముత్యాల రాందాస్, ఏడిద శ్రీరామ్, సింగర్ వరం, బోలే షావళి పాల్గొన్నారు.


● శివాజీరాజా, ప్రతాని

సినిమా నచ్చకపోతే డబ్బులు వెనక్కి!

''అనాథలకు సంబంధించిన కథతో రూపొందిన చిత్రం 'సత్య గ్యాంగ్'. ఈ చిత్రంలో చంద్రబోస్‌గారు అనాథలపై రాసిన పాట బాగుందని అందరూ అంటున్నారు. మా నాన్నగారి జ్ఞాపకార్థం కోటీ యాభైలక్షలు విలువ చేసే స్థలాన్ని అనాథలకు ఉచితంగా ఇచ్చా. మా సినిమా చూడండి. బాగా లేకపోతే టికెట్ డబ్బులు తిరిగి ఇచ్చేస్తా'' అని నిర్మాత మహేశ్ ఖన్నా అన్నారు. సాత్విక్ ఈశ్వర్, అక్షిత జంటగా ప్రభాస్ దర్శకత్వంలో మహేశ్ ఖన్నా నిర్మించిన 'సత్యగ్యాంగ్' త్వరలో విడుదల కానుంది. పాటల రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో అనాథలపై ఓ మంచి పాట రాశా. ఇందుకు మహేశ్ ఖన్నా గారికి, ప్రభాస్‌గారికి థ్యాంక్స్. నా పాట విని, కీరవాణిగారు అభినందించడం సంతోషంగా ఉంది'' అన్నారు. 'సత్యగ్యాంగ్' వంటి మంచి సినిమాతో హీరోగా పరిచయమవుతుండడం గర్వంగా ఉంది'' అన్నారు సాత్విక్ ఈశ్వర్. ఈ చిత్రానికి నిర్మాత–దర్శకత్వ పర్యవేక్షణ: మహేష్ ఖన్నా, సంగీతం–దర్శకత్వం: ప్రభాస్.


● అక్షిత, సాత్విక్